701745

కుష్ఠు సమస్త మహా వ్యాధులకు
బొల్లి మొదటి నెలలో 40% నివారణ!!! 10% నివారణ!!
మా లెప్సిన్ అమోఘ ఔషధము!!!
వివరములకు గ్రంధే రఘురామ గుప్త
అమర జ్యోతి ప్రొడక్ట్స్ మారాపురం. కర్నూలు జిల్లా.

VISALAANDHRA, VIJAYAWADA-4 Phone 376 * * * Regd No H 203

విశాలాంధ్ర

సంపుటి 14 సంచిక 129] విజయవాడ • 23-7-1964 గురువారం [6 పేజీలు 7 పై

తిండిగింజల ధరల తగ్గింపుకై పలుప్రాంతాల్లో ప్రదర్శనలూ, సత్యాగ్రహమూ

బొంబాయి, నాగపూర్ మొదలగుచోట్ల అరెస్టులు. మధ్యప్రదేశ్ లో లాఠీఛార్జీ

అహమ్మదాబాద్‌లో శ్రీ సుబ్రహ్మణ్యానికి నల్లజెండాలు

విజయవాడ. జూలై 22

తిండిగింజల ధరల తగ్గింపుకై దేశంలో పలుప్రాంతాలలో ప్రజలు సత్యాగ్రహమూ ప్రదర్శనలు ప్రారంభించారు

బొంబాయి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యాన శాసనసభా భవనం ముందు జరిగిన సత్యాగ్రహంలో పోలీసులు 11 మంది వాలంటీర్లను అరెస్టు చేశారు. నాగపూర్‌లో కలెక్టరు కార్యాలయం ఎదుట 500 మంది ప్రదర్శన చేయగా 10 మందిని పోలీసులు అరెస్టు చేశారు

మధ్యప్రదేశ్‌కు చెందిన గ్వాలియర్‌లో 9 మందిని అరెస్టు చేశారు అదే రాష్ట్రంలోని మొరీనా జిల్లా కేంద్రంలో ప్రదర్శకులపై పోలీసులు లాఠీఛార్జి చేశారు

ఉత్తరప్రదేశ్‌లోని లక్నో, అలహాబాద్ నగరాలలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యాన పెద్ద ప్రదర్శనలు జరిగాయి.

ఆగస్టు 6 వ తేదీనుండి బీహారు శాసనసభ ఎదుట కమ్యూనిస్టు శాసనసభ్యులు మూడు రోజులపాటు నిరశనదీక్ష జరపాలని, ఆగస్టు 17 మండి సత్యాగ్రహం జరపాలని బీహారు రాష్ట్రకమ్యూనిస్టు సమితి నిర్ణయించింది.

కమ్యూనిస్టుపార్టీ అధ్యక్షుడు శ్రీ ఎస్ ఎ డాంగే ఇటీవల లూధియానాలో మాట్లాడుతూ దేశం మొత్తంమీద ఆహారసమస్యపై 50 వేలమంది కమ్యూనిస్టు వాలంటీర్లు సత్యాగ్రహం చేయనున్నారని ప్రకటించారు.

అహమ్మదాబాద్‌లో ఆహారమంత్రి సుబ్రహ్మణ్యం ఎదుట నల్లజెండాల ప్రదర్శన జరిగింది ఉత్తరప్రదేశ్‌లో ఆహారసమస్యపై ప్రత్యక్ష కార్యాచరణకు కాంగ్రెసువాదులు సైతం సన్నద్ధమౌతున్నారు.

ఆంధ్రలోని ఉరవకొండలో కమ్యూనిస్టు - కాంగ్రెసుపార్టీలకు చెందిన 300 మంది తాసిల్దార్ ఆఫీసు ఎదుట ప్రదర్శన జరిపారు.

బొంబాయిలో శాసనసభ పరిసరాలలో సభలు, సమావేశాలపై పోలీసులు విధించిననిషేధాన్ని ధిక్కరించి 11 మంది కమ్యూనిస్టు కార్యకర్తలు సత్యాగ్రహం చేశారు.

కార్పొరేషన్ కమ్యూనిస్టు సభ్యులు శ్రీ జి. యల్. రెడ్డి వీరికి నాయకత్వం వహించారు.

ఆహార ధాన్యాల కృత్రిమ కొరతను, ధరల విపరీత పెరుగుదలకు నిరసనగా తామీ ప్రదర్శన జరుపుతున్నట్లు వారంతకుముందు ప్రకటించారు.

ఫ్లోరా ఫౌంటెన్ ప్రాంతంనుండి కొన్ని వందల మంది వాలంటీర్లు, ప్రజలూ కలిసి ఊరేగింపు జరిపారు. శాసనసభ భవనానికి వంద గజాల దూరంలో పోలీసులు వారిని అడ్డగించారు

శ్రీ రెడ్డి నాయకత్వాన 11 మంది వాలంటీర్లు పోలీసువలయాన్ని ఛేదించుకొని ముందుకు సాగడానికి ప్రయత్నించగా వారిని అరెస్టు చేశారు.

సత్యాగ్రహం

రాష్ట్ర శాసనసభ ప్రస్తుత సమావేశం కొనసాగి నన్ని రోజులూ, యీ విధంగా తమ వాలంటీర్లు జట్లుజట్లుగా సత్యాగ్రహం సాగిస్తూ వుంటారని బొంబాయినగర కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ వి. పి. వైద్య ప్రకటించారు.

అవిశ్వాస తీర్మానం

ఆహార సమస్యను పరిష్కరించడంలో విఫలమైన దృష్ట్యా శ్రీ వి. పి. నాయక్ మంత్రివర్గంపై ప్రతి పక్షాలన్నీ కలిసి ప్రతిపాదించిన ఒక అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టటానికి శాసనసభ యీరోజు అనుమతించింది.

పెజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ సభ్యుడు శ్రీ కె. యస్. ధులప్ యీ తీర్మాన ప్రతిపాదకులు. మొత్తం ముప్పై ఆరుమంది సభ్యులు యీ తీర్మానం ప్రవేశపెట్టడానికి తమ సమర్థన తెలియజేశారు.

ఈ రకమైన తీర్మానం ప్రతిపాదనకు 35 మంది సభ్యులు సమ్మతించితే సరిపోతుంది.

"రాష్ట్రంలో ఆహారపరిస్థితిని, ధరల పెరుగుదలను అదుపులోపెట్టడంలో దారుణంగా విఫలమైన యీ ప్రభుత్వంపట్ల శాసనసభ తన విశ్వాసరాహిత్యాన్ని ప్రకటిస్తూవుంది" అని యీ తీర్మానంలో చెప్పారు.

శాసన సభాధ్యక్షులు యీ తీర్మానంపై ఈ నెల 27, 28 తేదీల్లో చర్చ జరుగుతుందని ప్రకటించారు.

లక్నోలో ప్రదర్శన

లక్నో. జూలై 21

ఆహారధాన్యాల ధరల పెరుగుదలకు అసమ్మతి తెలుపుతూ నిన్న లక్నో పట్టణ కమ్యూనిస్టుపార్టీ పెద్ద ఊరేగింపును నడిపించింది.

ఊరేగింపు నగరం ముఖ్యవీధులగుండా సాగి, జిల్లామేజిస్ట్రేటును కలుసుకొని మెమొరాండం సమర్పించింది.

వర్తకులు నిలవచేసిన ధాన్యాన్ని ప్రభుత్వం స్వాధీనపరచుకొని దొంగనిల్వదారులను శిక్షించాలని మెమొరాండంలో కోరారు.

ఆహార ధాన్యాలను ఖరీదుకొనడం -టోకు వ్యాపారంని చేపట్టాలనీ, బ్యాంకులను జాతీయం చేయాలనీ, రైతుల పంటకు న్యాయమైన ధర యివ్వాలనీ, ఆహార ధాన్యాలకు కనీస, గరిష్ఠ ధరలను నిర్ణయించాలనీ దానిలో కోరడమైంది.

అల్లాహాబాద్‌లో

అల్లాహాబాద్. జూలై 21

ధరల పెరుగుదలకు అసమ్మతి తెలుపుతూ అల్లాహాబాద్ కమ్యూనిస్టు పార్టీ బహిరంగ సభ జరిపి, కాగడా ప్రదర్శన సాగించింది.

అమ్మకానికి బెల్లం నిలవచేసినవారు జూలై 31 లోపున తమ నిలవల వివరాలను తెలియపరచాలంటూ నిన్న ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది రాష్ట్రంలో బెల్లం ఎంత వుందో ఖచ్చితంగా తెలుసుకోనేటందుకు ఈ ప్రయత్నమని ప్రభుత్వప్రకటన తెలుపుతూ ది.

నాగపూర్‌లో సత్యాగ్రహం

ప్రతిపక్షాల ఆధ్వర్యాన

నాగపూర్. జూలై 20

కమ్యూనిస్టు పార్టీ పెజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ, రిపబ్లికన్‌పార్టీ, తదితర పార్టీలతో ఏర్పడిన కార్యాచరణ సమితి ఆధ్వర్యాన ఆహార ధాన్యాల ధరలకు వ్యతిరేకంగా నేడిక్కడ సత్యాగ్రహం ప్రారంభమయింది.

రిపబ్లికన్ పార్టీ నాయకుడు హంసరాజ్ గడ్ [illegible] నాయకత్వాన 10 మంది కలెక్టరు కార్యాలయం వద్ద సత్యాగ్రహం చేస్తుండగా అరెస్టు చేశారు.

అంతకుముందు 700 మందితో పెద్ద ఊరేగింపు జరిగింది.

ప్రతిరోజూ ఇదే విధంగా కలెక్టరు కార్యాలయంవద్ద సత్యాగ్రహం జరపటానికి నిర్ణయించుకొన్నట్టు కార్యాచరణ సమితి ఒక ప్రకటన చేసింది.

అదేవిధంగా [illegible] జిల్లాలోని వాణి పట్టణంలో కూడ గత మూడురోజులనుండి

(మిగత 6 వ పేజీలో)

కలకత్తా సీనియర్ అధికారిపై ఫిర్యాదు

సదాచార సమితి ఆఫీసులో దాఖలు

న్యూఢిల్లీ, జూలై 21

గత ఒక మాసంలోనూ కేంద్ర హోం మంత్రి శ్రీ నందా తన యింటి వద్ద ఏర్పాటు చేసిన సంయుక్త సదాచార సమితికి దాదాపు 1900 ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తోంది.

జూన్ 22 వ తేదీ నుండి సమితి ఫిర్యాదులను తీసుకోవడం ప్రారంభించింది.

కలకత్తాలో వుండే ఒక సీనియర్ అధికారి అవకతవకలపై నేడు సమితికి ఒక ఫిర్యాదు వచ్చింది. అతడు విదేశాలకుపంపించే వస్తువుల ధరలను హెచ్చించడమూ, తగ్గించడమూ చేస్తూ ఆ విధంగా డబ్బు గడించుకుంటున్నాడని తీవ్రమైన ఆరోపణ వచ్చింది.

శ్రీ నందా వుండగానే ఈ ఫిర్యాదు అందజేయబడింది, ఈ కేసును దర్యాప్తు జరపవలసిందిగా హోంశాఖ సహాయ మంత్రి శ్రీ జయసుఖ్‌లాల్‌హాథీకి శ్రీ నందా [illegible] చెప్పారు.

ఇప్పటివరకూ ఢిల్లీ కార్యాలయానికి వచ్చిన 1900 ఫిర్యాదులలోనూ 1100 ఫిర్యాదులు [illegible] చేయబడినాయి తతిమ్మా 800 అప్పటికప్పుడే పరిష్కారం చేయబడినాయి.

విద్యార్థులకు, సినిమాహాలు యజమానికి ఘర్షణ

శ్రీకాకుళం, జూలై 21

ఇక్కడ విద్యార్థులకు, ఆంజనేయ టాకీస్ యజమానికి మధ్య 16 వ తేదీ రాత్రి తగాదా జరిగింది. 17 వ తేదీన విద్యార్థులను కొందరు కొట్టారు. అందుకు కాలేజీ విద్యార్థులు సినిమా హాలు యజమానినుండి క్షమాపణను కోరారు. అయన క్షమాపణ యివ్వడానికి నిరాకరించారు.

18 వ తేదీన సినిమా హాలుకు నష్టం జరగటంతో పోలీసులు విద్యార్థులను కొందరిని అరెస్టుచేశారు.

విద్యార్థులను అరెస్టు చేసినందుకు నిరసించుతూ వెయ్యిమంది విద్యార్థులు ప్రదర్శనలు జరిపారు.

ఆ తరువాత వారిని జామీనుపై విడుదల చేశారు.

విద్యార్థి ప్రతినిధులు 21 వ తేదీన కలక్టరు వద్దకువెళ్ళి శాంతియుతపరిస్థితి నెలకొనేటట్టు ప్రయత్నించవలసిందిగానూ విద్యార్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవలసిందిగానూ విజ్ఞప్తి చేశారు.

ధరల అదుపుకై తీవ్ర చర్యల ఆవశ్యకత

రైల్వే ఉద్యోగుల నేషనల్ ఫెడరేషన్ తీర్మానం

కలకత్తా, జూలై 21

నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ సంస్థ ఏభయివ సాంవత్సరిక సదస్సు నాలుగు రోజులపాటు జరిగి నిన్న ముగిసింది. అవసర వస్తువుల ధరలు తగ్గించి, న్యాయమైన స్థాయికి స్థిరపరచకపోతే మన ఆర్థిక వ్యవస్థ అంతా తల్లక్రిందులు కాగలదని సదస్సు ఒక తీర్మానంచేసింది.

అన్ని వస్తువులకూ, ముఖ్యంగా ఆహార వస్తువులకు ధరలు అతివేగంగా, అంత ఎక్కువగా పెరిగినందుకు ఫెడరేషన్ "అమిత ఆదుర్దా" ప్రకటిస్తూ తీర్మానం చేసింది.

ఆహారోత్పత్తిని ఎక్కువ చేయడం మీద ప్రభుత్వం కేంద్రీకరించాలనీ, దొరికినచోట్ల నుంచి ఆహార పదార్థాలు దిగుమతిచేసి నిల్వలు పొయ్యాలనీ. అవసర వస్తువులు ఎగుమతి కాకుండా నిరోధించాలనీ. రాష్ట్రాల మధ్య ఆహారధాన్యాల రవాణాకుగల ఆటంకాలు తొలగించాలనీ, ధాన్యంలో సట్టా వ్యాపారాన్ని రద్దు పరచాలనీ ఆ తీర్మానంలో కోరారు. యుద్ధకాలంలో తీసుకొనేటంత తీవ్రంగా చర్యలుతీసుకొనాలని దానిలో కోరారు.

వెంటనే తగు సమయంలో తోడ్పాటు నిచ్చేటందుకు చాల ఎక్కువ సంఖ్యలో ధాన్యం డిపోలు తెరచి. తక్కువ రేట్లకు అవసర వస్తువులను వానిలో రైల్వే ఉద్యోగులకు అంద

(మిగతా 5 వ పేజీలో)

విజయవాడలో వారంనుండి 150 చౌకదుకాణాలమూత

బియ్యం సరఫరాకు మిల్లర్ల నిరాకరణ

విజయవాడ. జూలై 21

బియ్యం సరఫరా కాకపోవడం చేత విజయవాడలోని 150 చౌకడిపోలువారంరోజులుగా మూతపడి వున్నాయి

ఆ షాపులకు సరఫరాచెయ్యవలసినబియ్యం మిల్లులు ఇవ్వడంలేదు ఏ యే షాపులకు యే మిల్లు ఎంత బియ్యం సప్లయి చెయ్యాలో సివిల్ సప్లయిల శాఖ నిర్ణయించింది. ఆ విధముగా సప్లయి చేసిన బియ్యానికి లెవీ వసూలు చెయ్యరు. ఆ బియ్యం నిర్ణీతమైన రేట్లకు సరఫరా చెయ్యాలి

లెవీ పద్ధతిని రద్దుచేసి. జూన్‌లో స్వేచ్ఛా రవాణా అనుమతించడంతో ప్రస్తుత పరిస్థితి ఏర్పడింది. చౌకడిపోలకు ఇవ్వడానికి తమవద్ద బియ్యం లేవంటున్నారు మిల్లు యజమానులు.

జోన్ రద్దు రవాణాపై నిషేధాలు తొలగించడంతోనే మద్రాసు, కేరళ, మైసూరు రవాణా బాగా పెరిగింది.

దక్షిణానికి మిల్లర్లు బియ్యం పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తూనే చౌకడిపోలకు బియ్యం లేవంటున్నారని కలెక్టరుకు తెలుసు. సివిల్ సప్లయిల శాఖకు తెలుసు. కాని ఏం చెయ్యాలో తెలియడంలేదని వారు దిక్కులు చూస్తున్నారు.

ప్రభుత్వం బియ్యంధర పెంచుదు దనే ఆశతో మార్కెట్టులో బియ్యం దొరకకుండా చేశారు, దీనా చిక్కా వుపయోగించే [illegible] ధరలు బాగా పెంచారు.

ప్రభుత్వాని కివ్వవలసిన లెవీలో [illegible] ఇచ్చి, ప్రభుత్వంతో సహకరించవలసిందిగా తమ సభ్యులను కోరుతూ ఆంధ్రా రైస్ మిల్లు యజమానుల సంఘ కార్యవర్గం ఇక్కడ సమావేశమై ఒక తీర్మానం చేసింది.

మిల్లు బట్ట ధర కంట్రోలు - పంపిణీ

ఢిల్లీలో చర్చల ప్రారంభం

న్యూఢిల్లీ. జూలై 21

ధరల కంట్రోలును గురించీ, బట్టపంపిణీని గురించీ వాణిజ్య మంత్రిత్వశాఖ అధికారులకూ, మిల్లుబట్టల వర్తకుల ప్రతినిధులకు మధ్య న్యూఢిల్లీలో చర్చలు ప్రారంభమైనాయి.

చర్చలు ఈ వారమంతా జరుగవచ్చు. ఆ తరువాత ప్రభుత్వం తన నిర్ణయాన్ని ప్రకటిస్తుంది.

జౌళి మిల్లుల సలహాదారువాడు మొత్తం మిల్లులలో ఉత్పత్తి అయ్యే బట్టలలో 40 శాతం బట్ట నియంత్రణ కంట్రోలుక్రింద రావాలనీ తతిమ్మా దానిని తాము నిర్ణయించిన ధరలకు వారే అమ్ముకో వచ్చుననీ సిఫారసు చేసింది.

అయితే బట్టల వ్యాపారస్తులు మిల్లుబట్ట ఉత్పత్తిపై దట్టమైన కంట్రోలుకు ప్రాతికూల్యాన్ని వెలిబుచ్చుతున్నారు. దీనివలన ధరలను అదుపులో పెట్టాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరజాలదని వారంటున్నారు.

ఆగస్టు 1 తేదీన నల్లబాడ్జీల ప్రదర్శన

హైదరాబాద్ ఇంజనీరింగ్ వుద్యోగుల సభ నిర్ణయం

హైదరాబాద్. జూలై 21

హైదరాబాద్ జిల్లా టెలిగ్రాఫ్ ఇంజనీరింగ్ ఉద్యోగుల సంఘం ప్రథమ వార్షిక సమావేశంలో ఆగస్టు 1 న నల్ల బ్యాడ్జీల ప్రదర్శనం జరపడానికై నిర్ణయం తీసుకున్నారు.

పని భారం పెరుగుదల దృష్ట్యా అదనపు పనివారిని వెయ్యాలనేది వారికోరికలలో ఒకటి.

సమావేశానికి శ్రీ యు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. శ్రీ కె. ఆదినారాయణ అధ్యక్షులుగానూ, శ్రీ యస్. దామోదర రావు సర్కిల్ కార్యదర్శిగానూ, నూతన కార్యవర్గం సభలో ఎన్నుకోబడింది.

ఉరవకొండలో ఐక్యప్రదర్శన

పందలపాకలో నిరాహారవ్రతానికి సన్నాహం

ఉరవకొండ, జూలై 21

స్థానిక కాంగ్రెస్‌వాదులూ, కమ్యూనిస్టులూ కలిసి నేడిక్కడ తహసీల్‌ఆఫీసుముందు ఒక ఆహార ప్రదర్శన జరిపారు.

300 మంది ప్రజలు యీ ప్రదర్శనలో పాల్గొన్నారు.

స్థానిక కమ్యూనిస్టు నాయకులు శ్రీయుతులు రంగన్న, సెట్టి కల్లప్ప, శంకరయ్య, కాంగ్రెస్ నాయకులు కరూర్ ఎర్రప్ప, ఓబులప్ప ప్రభృతులు యీ ప్రదర్శనకు నాయకత్వం వహించారు.

ఆహారధాన్యాల వర్తకాన్ని ప్రభుత్వం చేపట్టాలనీ, చౌకడిపోలసంఖ్య పెంచాలనీ వారు డిమాండు చేశారు.

డిప్యూటీ తహసీల్‌దారు వారిచ్చిన మెమొరాండాన్ని స్వీకరించి. యీ విషయాలు ప్రభుత్వానికి వ్రాస్తానని చెప్పారు.

పందలపాకలో

పందలపాక, జూలై 21

పందలపాక గ్రామజనాభా 6500. ఈగ్రామంలోనే రాష్ట్రంలో అతిప్రసిద్ధమైన రెండు అధునిక [illegible] మిల్లులున్నాయి. [illegible] చేనేత, వ్యవసాయ కార్మికులే దాదాపు 5 వేలకు పైగా ఉన్నారు.

పందలపాకలో సాగులేనిభూమి అంగుళం మేరైనాలేదు. రెండుపంటలతో, ధాన్యం గాదులతో కలకలలాడే గ్రామం ఇటువంటి గ్రామంలోనే బియ్యం అక్కడక్కడ కుంచం (4 శేర్లు) రు3/లు అమ్ముతున్నారంటే, పొద్దల్లా కష్టించి, చాలీచాలని జీతాలతో యిక్కట్లుపడుతున్న కార్మికులు ఎంత బాధపడుతుంటారో ఊహించుకోవచ్చు

పంచదారకూడాదొరకడంలేదు. ఈగ్రామం మొత్తానికి 10 బస్తాలకు పైగా కావలసివున్నా 5 బస్తాలు మాత్రం ఇస్తున్నారు. టీ త్రాగి పనిలోకిపోయే కార్మికులు ఎంతో అసంతృప్తి చెందుతున్నారు.

ఈ అధికధరల ఫలితంగా గ్రామంలో తక్షణం చౌకబియ్యం డిపోలు తెరవవలసిందిగా 1300 మంది సంతకాలతో గతవారం తహసీల్దారుకు అర్జీని సమర్పించారు. అలా వెంటనే డిపోలు తెరవని పక్షాన పందలపాక వాసులు కచేరీ చావిడిముందు నిరవధిక నిరాహార వ్రతానికి ఉపక్రమించే సన్నాహంలోకూడా ఉన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యంచేసుకుని వెంటనే చౌకబియ్యండిపోలు ఏర్పాటుచేయవలసిందిగానూ. పంచదారకోటా హెచ్చించవలసిందిగానూ కోరుతున్నాము.

ఆగస్టు 9,10 తేదీలలో నిరసనదినానికై ఎ.పి.టి.యు.సి. పిలుపు

హైదరాబాద్, జూలై 22

ఆహారధాన్యాల పెరుగుదలకు వ్యతిరేకంగా ఆగస్టు 9, 10 తేదీలను నిరసన దినంగా జరపవలసిందిగా యావత్తు కార్మిక ప్రజానీకానికి ప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు కార్యవర్గం పిలుపిచ్చింది.

ప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు కార్యవర్గం సమావేశం ఈ నెల 18, 19 తేదీలలో ఇక్కడ జరిగింది.

ధరలను అదుపులో పెట్టాలని, ఆహారధాన్యాల వ్యాపారాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని బ్యాంకులను జాతీయంచేయాలనేనినాదంతో ఆగస్టు 9, 10 తేదీలలో ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ప్రదర్శనలు, బహిరంగసభలు జరపవలసినదిగా రాష్ట్రంలోని శాఖలన్నిటికీ కార్యవర్గం విజ్ఞప్తి చేసింది.

ప్రతి 500 మంది కార్మికులకు ఒక చౌకడిపో పెట్టాలని, జీవన వ్యయసూచిక ననుసరించి కరువుభత్యం ఇవ్వాలని కూడా డిమాండ్ చేయవలసిందిగా రాష్ట్ర కార్యవర్గం కోరింది.

సార్వత్రిక సమ్మెకు ఈ ఆందోళనా కార్యక్రమం ఒక సన్నాహమని దీనిని జయప్రదం చేయటానికి కృషి చేయవలసిందిగా అన్ని శాఖలను కార్యవర్గం కోరింది.

యావత్తు ప్రజానీకం ఈ ఆందోళనలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఏ. పి. టి.యు సి. విజ్ఞప్తి చేసింది.

ప్రధానినివాసగృహం

న్యూఢిల్లీ జూలై 21

ప్రధాని శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి ప్రస్తుతం ఉంటున్న (మోతిలాల్ నెహ్రూ ప్యాలెస్) యింటిలోనే ఉండాలని అంతిమనిర్ణయం చేసుకున్నట్లు తెలుస్తోంది.

మంత్రివర్గంలో చేరినప్పటినుండి శ్రీ శాస్త్రి యీ యింటిలోనే ఉంటున్నారు.

[illegible] "[illegible]" అధికార కార్యక్రమాలకు ఉపయోగిస్తారు.

శాసనమండలి ఛైర్మన్ ఎన్నిక

హైదరాబాద్. జూలై 21

శ్రీ మాడపాటి హనుమంతరావు రాజీనామా యిచ్చినదృష్ట్యా ఆంధ్ర శాసనమండలికి నూతన ఛైర్మనును ఎన్నుకోవడానికి జూలై 25 వ తేదీ నిర్ణయించబడింది.

నామినేషన్ పత్రాలను 24 వ తేదీ మధ్యాహ్నానికి అందజేయవలసి వుంది.

సాగర్ ప్రేలుడు ఉదంతంపై దర్యాప్తు

హైదరాబాద్. జూలై 21

విజయపురి (నాగార్జున సాగర్) లో యీ వారం జరిగిన ఘోరమైన ప్రమాదం సందర్భంగా ప్రేలుడు పదార్థాల దుర్వినియోగ మౌతున్నట్లు అనుమానానికి తావేర్పడిందనీ యీ ఉదంతంపై దర్యాప్తు బాధ్యత నేరపరిశోధన శాఖకు అప్పగించబడిందనీ న్యాయశాఖా మంత్రి నేడు రాష్ట్ర శాసనసభలో ప్రకటించారు.

ఈ ప్రమాదానికి కేంద్రమైన శ్రీ సీతారామరాజు యింటిలో యిలాంటి ప్రేలుడు మందు ఎంత వుండినదీ, అసలంత పెద్ద ప్రమాణంలో అక్కడ ఎందుకు నిల్వచేయబడాల్సి వచ్చిందీ అనే అంశాలు తీవ్ర అనుమానాలకు ఆస్కారమౌతున్నవని ఆయన అన్నారు.

ఈ ప్రమాదంలో మొత్తం 13 గురు చనిపోయారు. అసలు ప్రేలుడు ప్రమాదం శ్రీ సీతారామరాజు అనే సూపర్‌వైజర్ యింటిలో జరిగింది. విజయపురి [illegible] లో పునరావాసాల డివిజన్ ఆఫీసులో పనిచేస్తున్న అయిదుగురు సూపర్‌వైజర్లలో శ్రీ రాజు ఒకరు.

సాగర్ ప్రాంతంలో సాగునీరుల త్రవ్వకానికి కంట్రాక్టు తీసుకున్న శ్రీ ఎం. వెంకటేశ్వర్లు అనే అతనికి యీయన ద్వారానే ప్రేలుడు మందు సరఫరా చేయబడుతూవుంది.

ఈ [illegible] సంబంధించి [illegible] ఇంజనీర్ కార్యాలయంలో నమోదైన సమాధానానికీ స్టోర్స్ రిజిస్టరులోని సమాచారానికీ మధ్యకొంత తేడా వున్నట్లు వెల్లడైంది.

దక్షిణ కలకత్తాలో ఇద్దరు స్వర్ణకారులవద్ద 140 తులాల బంగారాన్ని పోలీసులు పట్టుకున్నారు.

ఆఫ్రికా రాజ్యాలకు తటస్థ వైదేశిక విధానమే శిరోధార్యం

కైరో శిఖరాగ్రసభ ఉద్ఘాటన

కైరో జూలై 21

ఆఫ్రికాదేశాలకు తటస్థ విధానమే శిరోధార్యమని ఇకముందు కూడా ఆ విధానాన్నే అనుసరించాలని ఆఫ్రికా శిఖరాగ్రసభ నేడిక్కడ తీర్మానించింది.

జాతీయ విమోచన ఉద్యమాలకు కావలసిన సహాయ సంపత్తులను అందచేయటం ద్వారా దానిని మరింత ఉధృత పరచాలనే దీక్ష శిఖరాగ్ర సభ చర్చలలో ఎల్లెడలా కానవచ్చింది.

నేటితో సమావేశం సమాప్తం కావచ్చునని తెలుస్తోంది.

దక్షిణాఫ్రికా, పోర్చుగల్ దేశాలపై పటిష్ఠవంతమైన ఆంక్షలు విధించాలని, ముఖ్యంగా, ఆఫ్రికా భూభాగాలగుండా విమాన, నౌకా, తదితర మార్గాలద్వారా దక్షిణాఫ్రికాకు సాగే రాకపోకలపైన ఆంక్షలు విధించవలసిందిగా శిఖరాగ్రసభ విజ్ఞప్తి చేసింది.

దక్షిణాఫ్రికాకు నూనెను, అన్నిరకాల పెట్రోలియం ఉత్పత్తుల సప్లయిను సత్వరం నిలిపివేయవలసిందిగా నూనె ఉత్పత్తి కావించే దేశాలన్నింటికి శిఖరాగ్రసభ విజ్ఞప్తి చేసింది.

తటస్థ విధానాన్ని ఆఫ్రికా దేశాలు అవలంబించాలన్న తీర్మానాన్ని రెండు దేశాలుమాత్రమే వ్యతిరేకించాయి అవి మలగాసి, గబన్ దేశాలు.

9 దేశాల విమోచన కమిటీని కొనసాగించటానికి శిఖరాగ్రసభ నిర్ణయించింది.

రవాణా, వార్తా సౌకర్యాలరంగంలో సన్నిహిత సహకారం, సాంస్కృతిక ప్రతినిధివర్గాల పర్యటనలు, సరిహద్దు సమస్యల విషయాలలో నిర్దిష్టమైన విజయాలను శిఖరాగ్ర సభ సాధించిందని పరిశీలకులు అంటున్నారు.

ఆఫ్రికా ఖండాన్ని ఎదుర్కొంటున్న సమస్యలు ఎంతటి జటిలమైనవాటిని పరిష్కరించాలనే సంకల్పం శిఖరాగ్రసభ ప్రతినిధులలో ద్యోతకమయింది.

ఆఫ్రికాదేశాలన్నీ తటస్థవిధానాన్ని అవలంబించవలసిన ఆవశ్యకతపై మలావి ప్రధాని హేస్టింగ్స్ బండా ఉద్వేగపూరితమైన ప్రసంగం చేసారు.

"ప్రతిఒక్క అంతర్జాతీయ సమస్యను దాని యొక్క మంచిచెడులనుబట్టి నిర్ణయించటమే సరియైన విధానం. అంటే దాని అర్థం మీ విజ్ఞతను, స్వతంత్రత ఉపయోగించి నిర్ణయించటమే."

"అటు తూర్పు దేశాలుగాని, ఇటు పశ్చిమ దేశాలుగాని అన్ని సమస్యలపైన ఎల్లప్పుడు సమంజసవైఖరిని గాని లేదా అసమంజసవైఖరినిగాని ప్రదర్శించ లేవు. దీనికి కొన్ని దృష్టాంతాలను చూపగలను సూయజ్‌దాడి "సమయంలో అమెరికా, సోవియట్ యూనియన్‌లు ఒకే విధానాన్ని అవలంబించాయి కాంగో విషయంలో షా బేను బ్రిటన్, ఫ్రాన్సు, బెల్జియం దేశాలు బలపరచగా, అమెరికా వ్యతిరేకించింది.

"అన్ని దేశాలతోను సఖ్యత నెరపుకోవాలి. స్వతంత్రంగా ప్రవర్తించే దుకు తటస్థ విధానాన్ని ఆఫ్రికాదేశాలు అవలంబించాలి" అని డాక్టరు బండా అన్నారు.

దక్షిణాఫ్రికా సరకును బహిష్కరించేందుకు తీసుకొనే చర్యలను సమన్వయం చేయటానికి ఒక సంఘాన్ని ఏర్పరచటానికి శిఖరాగ్రసభ నిర్ణయించినట్లు తెలుస్తోంది.

అఖిలాఫ్రికా ప్రభుత్వాన్ని ఏర్పరచాలన్న ఘనా ప్రతిపాదనపై శిఖరాగ్రసభ చర్చ జరిగిన మీదట ఒక ప్రత్యేక కమిటీని నియమించాలని, అధ్యక్షుడు నాజర్ సూచించినట్లుగా దశలవారీగా అటువంటి ప్రభుత్వం రూపొందటానికి, ఆఫ్రికా దేశాల మధ్య సహకారం వృద్ధి కావటానికి గల అవకాశాలను ఆ కమిటీ పరిశీలించ దని తెలుస్తూంది.

ఆఫ్రికాఖండం వాణిజ్యంలో 10 శాతం మాత్రమే ఆఫ్రికా దేశాల మధ్య సాగుతున్నదని, మిగిలిన 90 శాతం ఆఫ్రికాయేతర దేశాలతో సాగుతున్నదని అధ్యక్షుడు నాజర్ వెల్లడించారు.

దక్షిణ రొడీషియా శీఘ్రంగా స్వాతంత్ర్యాన్ని పొందేందుకుగాను ఆ దేశంలోని జాతీయపార్టీలతో సంయుక్త సంఘటన ఏర్పరచటానికి తమ పలుకుబడిని ఉపయోగించవలసిందిగా మలావి, ఐక్యఅరబ్ రిపబ్లిక్, టాంగనీకా, జాంజిబార్, సమైక్య రిపబ్లిక్ దేశాలకు మహాసభ విజ్ఞప్తి చేసింది.

ఆల్జీర్స్‌లో రెండవ బాండుంగ్ సభ

ఆల్జీర్స్‌లో ఆసియా-ఆఫ్రికా దేశాల రెండవ మహాసభ జరపవలసిందిగా ఆసియా - ఆఫ్రికా దేశాల స్థాయీ సెక్రటేరియట్‌కు మెమోరాండం పంపడానికి శిఖరాగ్ర సభ నిర్ణయించింది.

వచ్చే సంవత్సరం ప్రారంభంలో ఈ మహాసభ జరగవచ్చు.

అడిస్‌అబాబాలో ఆఫ్రికా సమైక్యసంస్థ కేంద్ర కార్యాలయాన్ని ఉంచడానికి మహాసభ ఆమోదించింది.

ఘానాలో గినీ శాశ్వత ప్రతినిధి దియల్లో టెల్లిని సమైక్యసంస్థ సెక్రటరీ జనరల్‌గా నియమించారు.

మహాసభ ముందున్న ఎజెండాలో ఒక్కటి మినహా మిగతా అంశాలన్నీ పూర్తయ్యాయి.

కామన్‌వెల్తు ప్రకటనలో భారత పాక్ విభేదాల ప్రస్తావనకు జయప్రకాశ్ సమర్థన

టి. టి. కె. కు వత్తాసు

మద్రాసు, జూలై 21

కామన్‌వెల్తు ప్రధాన మంత్రుల సంయుక్త ప్రకటనలో భారత-పాకిస్తాన్ సంబంధాలను ఉదహరించడాన్ని శ్రీ జయప్రకాశ్ నారాయణ సమర్థించారు.

శ్రీ జయప్రకాశ్ పి. టి. ఐ. విలేకరికి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో యిలా అన్నారు:

ఈ ఆవేశకావేశాలన్నింటినీ అర్థంచేసుకోవడం నాకు కష్టంగావుంది. ఇది సంకుచిత జాతీయ దురభిమాన మనస్తత్వాన్ని బయట పెడుతున్నది.

కొంతమంది ఇంకా తమ తలకాయలను 19 వ శతాబ్దంలో ఇరుక్కొని వున్న రోజుల్లో వుంచి ఆలోచిస్తున్నట్లు కనిపిస్తున్నది. వీరినే భారతదేశం అనుసరించితే ఇంతవరకు రాజా రామమోహన రాయ్ నుండి జవహర్‌లాల్ నెహ్రూవరకు నిర్మించుకుంటూ వచ్చిన ఉత్తమ సాంప్రదాయాలను తిరస్కరించడమని వస్తుంది. ఇకపోతే దీని అనుసరించితే భారతదేశం కామన్‌వెల్తు నుండేకాక, అన్ని అంతర్జాతీయ సంస్థలనుండి చివరికి ఐక్యరాజ్యసమితి నుండి కూడా తప్పుకోవలసివస్తుంది. విచారించవలసిందేమంటే కొంతమంది

(మిగతా 6 వ పేజీలో)

విశాలాంధ్ర

ఆఫ్రికా పురోగతి

రాజకీయ స్వాతంత్ర్యాన్ని దృఢతరం చేసుకుంటూ, ఆర్థిక స్వాతంత్ర్య సాధనకు కృషి చేస్తూ, తమలో తమ కేర్పడే వివాదాలను చర్చలద్వారా పరిష్కరించుకుంటూ ముందుకు సాగాలనే దృఢ దీక్ష ఆఫ్రికా రాజ్యాలన్నిటా వ్యక్తమౌతున్నది. కైరోలో ముగిసిన ఆఫ్రికా రాజ్యాధినేతల సభ ఆమోదించిన తీర్మానాలు, చేసిన నిర్ణయాలు, ఈ దృఢ దీక్షకు తార్కాణంగా ఉన్నాయి.

శతాబ్దాలుగా బ్రిటిష్, ఫ్రెంచి, బెల్జియం సామ్రాజ్యవాదులు ఆఫ్రికాపై వలసాధిపత్యం వహించారు. అపారమైన ఆఫ్రికా సహజ సంపదను దోపిడీచేసి, తమ జేబులను నింపుకున్నారు. ప్రజోద్యమాల తాకిడికి తట్టుకోలేక ఆఫ్రికా నుండి వారు దాదాపు నిర్గమించినప్పటికీ, నూతనంగా ఏర్పడే రాజ్యాల, వైదేశిక విధానాలను తమ చెప్పుచేతులలో ఉంచుకునేందుకు కుట్రలు చేస్తూనే ఉన్నారు.

ఈ కుట్రలనుండి బైటపడి స్వతంత్ర వైదేశిక విధానం అవలంబించటంలోనే, ఆఫ్రికా రాజ్యాల పురోగతి ఆధారపడి వుంది. తటస్థ వైదేశిక విధానమే ఆఫ్రికారాజ్యాలన్నిటికి శిరోధార్యమని, కైరో శిఖరాగ్ర సభ చేసిన తీర్మానం ఈ దృష్ట్యా ఎంతో ప్రధానమైనది. సభకు హాజరయిన 33 రాజ్యాలలో మలగాసి, గబన్ అను రెండు రాజ్యాలుమాత్రమే యీ తీర్మానాన్ని వ్యతిరేకించాయి.

ఆఫ్రికా ఖండంలో హెచ్చు భాగం ఈపాటికే స్వాతంత్ర్యాన్ని పొందింది. ఐనా, ఇంకా కొన్ని ఆఫ్రికన్ రాజ్యాలు, అంగోలా, మొజాంబిక్ వంటివి, ఈ నాటికి పోర్చుగల్ సామ్రాజ్యవాదుల కబంధ కౌగిలిలో నలిగిపోతున్నాయి. ఆ దేశాలలో ఆఫ్రికన్ ప్రజలు తమ ప్రాణాలను పణంగా ఒడ్డి, స్వాతంత్ర్యసాధనకు వీరోచితంగా పోరాడుతున్నారు. ఈ పోరాటాలకు సర్వవిధాలా సాయం చేయటానికి ఆఫ్రికన్ రాజ్యాధినేతల సభ తీర్మానించింది.

దక్షిణ ఆఫ్రికా అనుసరిస్తున్న జాతిద్వేష విధానాలు మానవ నాగరికతకే తలవంపులు తెస్తున్నాయి. ప్రత్యేకించి ఆఫ్రికన్ ప్రజలకు అవమానకరంగా ఉన్నాయి. దక్షిణాఫ్రికాపై సమగ్ర ఆర్థిక ఆంక్షలు విధించాలనీ, ఐరాసలో ఆఫ్రికన్ రాజ్యాలు ఎంతోకాలంగా ఆందోళన చేస్తున్నాయి. కాని స్వార్థ ప్రయోజనాలతో బ్రిటన్ వంటి కొన్ని రాజ్యాలు ఈ ఆర్థిక ఆంక్షల విధింపును వ్యతిరేకిస్తున్నాయి.

ఆఫ్రికా శిఖరాగ్రసభ తిరిగి ఈ అంశంపై ఒక తీర్మానం చేసింది. మానె పదార్థాలను ద. ఆఫ్రికాకు రవాణా చేయరాదని, ద. ఆఫ్రికాకు పయనిస్తున్న విమానాలకు, తదితర రవాణా సాధనాలకు ఆఫ్రికా రాజ్యాలేవీ తమ భూభాగంమీదుగా పోయే సౌకర్యం కలిగించరాదని మహాసభ తీర్మానించింది.

ద. రొడీషియా ప్రభుత్వం కూడా ద. ఆఫ్రికా అడుగు జాడల్లో నడవాలని యత్నిస్తున్నది. నూటికి 80 మందిగా ఉన్న ఆఫ్రికన్ ప్రజలకు ఎట్టి ప్రాతినిధ్యమూలేని శ్వేతజాతి ప్రభుత్వం అక్కడ అధికారంలో ఉంది. ఈ ప్రభుత్వం, బ్రిటిష్ కామన్వెల్తునుండి తనకుతానై విడిపోయి స్వతంత్రం ప్రకటించుకోవాలని యత్నిస్తున్నది. అలా జరిగితే ద. రొడీషియాలో ఆఫ్రికన్ ప్రజలు తమ స్వాతంత్ర్య పోరాటాన్ని ముందుకుతీసుకువెళ్ళేందుకు ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు చేయుటం ఖాయం. అలాఏర్పడే ప్రభుత్వానికి అన్నివిధాలా సహాయం చేయాలని కూడా కైరో మహాసభ తీర్మానించింది.

ఈ నిర్ణయాలన్నీ ఆఫ్రికారాజ్యాల స్వేచ్ఛా వాంఛకు, స్వాతంత్ర్య రక్షణా దీక్షకు తార్కాణంగా ఉన్నాయి. ప్రపంచంలోనలుమూలలా ఉన్న స్వేచ్ఛాప్రియులకు ఈ తీర్మానాలు సంతృప్తి కలిగించగలవు.

ఆర్థిక పురోగతి ఆఫ్రికా దేశాల నెదుర్కొంటున్న తక్షణ సమస్య. ఘానా రాజధాని అక్రానుండి, లండన్‌కు ఆరుగంటలలో ప్రయాణం చేసే సౌకర్యాలుండగా, అక్రా, కైరోల మధ్య ప్రయాణానికి 12 గంటలకంటె ఎక్కువ పడుతున్నదంటే, రవాణా సౌకర్యాలు ఎంత ప్రాథమిక దశలో ఉన్నాయో స్పష్టమౌతుంది.

ఈ సౌకర్యాలను వృద్ధి చేసుకోవటం, ఆఫ్రికా రాజ్యాల సమైక్యత కొక ముఖ్యావసరం.

ఆఫ్రికారాజ్యాల ఆర్థికాభివృద్ధికి సోషలిస్టుదేశాలు, ముఖ్యంగా సోవియట్ యూనియన్ అపారమైన సాయం చేస్తున్నాయి. ఈజిప్టులోని నైలునదిపై సోవియట్ సాయంతో నిర్మితమౌతున్న అశ్వాన్ ఆనకట్ట ఈజిప్టు ఆర్థిక పురోగతికి ధృవతారగా రూపొంద నున్నది. ఘనా, గినీ, మాలివంటి ఇతర ఆఫ్రికన్ రాజ్యాలకు కూడా సోవియట్ యూనియన్ ఎంతో సాయం చేస్తున్నది. ఈ సహాయాన్ని పూర్తిగా వినియోగించుకోవటం ద్వారా, ఆఫ్రికా రాజ్యాలు ఆర్థికంగా ముందంజ వేయగలవు.

ఆఫ్రికన్ రాజ్యాలమధ్య ఇటీవల కొన్ని సరిహద్దు తగాదాలు ఏర్పడ్డాయి.

అల్జీరియా, మొరాకోల మధ్య ఇథియోపియా, సోమాలియామధ్య ఇట్టి తగాదాలు సాయుధ ఘర్షణలరూపం ధరించాయి. ఈ వివాదాలను, ఘర్షణలను నివారించటంలో తోటి ఆఫ్రికన్ రాజ్యాలు ప్రశంసనీయంగా కృషి చేశాయి.

ఇది ఎంతో హర్షణీయం.

ఆఫ్రికన్ రాజ్యాలలో ఏర్పడే పరస్పర విభేదాలు సకాలంలో, శాంతియుతంగా పరిష్కారం కాకపోతే సామ్రాజ్యవాదులు తిరిగి ఆఫ్రికాఅంతరంగిక వ్యవహారాలలో జోక్యం కలిగించుకునేందుకు అవి అవకాశం కలిగిస్తాయి.

కాంగోకు సంభవించిన విపత్తు ఆఫ్రికారాజ్యాలన్నిటికీ ఒకహెచ్చరిక. స్వాతంత్ర్య వీరుడు లుముంబా హత్యకు బాధ్యుడైన షోంబే, సామ్రాజ్యవాదుల మద్దతుతో నేడు కాంగోకు ప్రధాని కావటం, కాంగోకే కాక, యావదాఫ్రికాకే ప్రమాద సూచన.

షోంబేకు శిఖరాగ్ర సభలో స్థానాన్ని నిరాకరించటంద్వారా కాంగో దుష్ట పరిణామాలు, ఇతర రాజ్యాలలో పునరావృతం కారాదనే గుర్తింపు ఆఫ్రికా రాజ్యాధినేతలు ప్రదర్శించారు. ఇది శుభ సూచన.

ఆఫ్రికన్ రాజ్యాల స్వాతంత్ర్యానికి ప్రమాదం ఏర్పడినప్పుడు ఆ దేశాలకు సాయం చేసేందుకు ఒక సంయుక్త సైనిక నాయకత్వాన్ని ఏర్పరచాలని ఈజిప్టు అధ్యక్షుడు నాజర్ మహాసభలో ప్రతిపాదించారు. కాంగో పరిణామాలను దృష్టిలో పెట్టుకునే నాజర్ ఈ సూచన చేసినట్లు తెలుస్తున్నది. ఆఫ్రికన్ రాజ్యాలన్నీ కలిసి, ఆఫ్రికా సమాఖ్యగా రూపొందాలని ఘనా అధ్యక్షుడు న్క్రుమా మరొక ప్రతిపాదన చేశారు.

నాజర్ ప్రతిపాదన హెచ్చు రాజ్యాలకు ఆమోదకరం కాగా, న్క్రుమా ప్రతిపాదనకు తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఇట్టి సమస్యలపై వెంటనే నిర్ణయాలు చేయక, సావకాశంగా చర్చలు సాగించాలని తీర్మానించటంద్వారా ఆఫ్రికా రాజ్యాధినేతలు ఎంతో విజ్ఞత ప్రదర్శించారు.

కాసబ్లాంకా, మన్రోవియా రాజ్యాలుగా, విడివడి ఉన్న ఆఫ్రికా రాజ్యాలన్నిటినీ, గత సంవత్సరం అడిస్ అబాబాలో జరిగిన శిఖరాగ్ర సభ ఒకే వేదికపై సమీకరించింది. ఆ ఐక్యతను కైరోసభ దృఢతరం చేసింది. ఆఫ్రికా రాజ్యాల పురోగతిలో కైరోమహాసభ ఒక మైలురాయి అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

కరువుభత్యం పెంపుదల పాత్రికేయుల విజ్ఞప్తి

నాగపూర్, జూలై 20

జీవనవ్యయం పెరుగుదలకు అనుగుణంగా తమ ఉద్యోగులకు కరువుభత్యాన్ని పెంచాలని నాగపూర్‌లోని పత్రికా యజమానులను పాత్రికేయులు కోరారు.

పత్రికా కార్యాలయాల్లో పనిచేసే పాత్రికేయులకు, ఇతర ఉద్యోగులకు తగిన సహాయం లభించేటట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూడాలని నిన్న ఇక్కడ జరిగిన పాత్రికేయుల సమావేశంలో తీర్మానించారు.

భారత కమ్యూనిస్టుపార్టీ కార్యక్రమం ముసాయిదా - 4

ఇండియాలోని రాజ్యాంగ యంత్రం బూర్జువావర్గం చేతిలోని సాధనం

భారత కమ్యూనిస్టుపార్టీ 7 వ మహాసభకు ముందు దేశవ్యాపితంగా జరిగే చర్చలకుగాను పార్టీ జాతీయ సమితి రూపొందించిన పార్టీ కార్యక్రమం ముసాయిదాలోని ఆరో అధ్యాయంలో ఇండియాలోని రాజ్యాంగ యంత్రం ఏవిధంగా బూర్జువావర్గం చేతిలో సాధనంగా వున్నదీ వివరించారు. 7 వ అధ్యాయంలో భారత దేశం అనుసరిస్తున్న వైదేశికనీతిలోని మంచినీ, బలహీనతలను విశదీకరించారు. ఆరు, ఏడుఅధ్యాయాలను నేడు ప్రకటిస్తున్నాము.

VI

బూర్జువావర్గం: రాజ్యాంగయంత్రం

49. ఇండియాలోని రాజ్యాంగ యంత్రం మొత్తం జాతీయ బూర్జువావర్గంయొక్క వర్గ పాలనా యంత్రాంగం. అది ఇండియా జాతీయార్థిక వ్యవస్థలో పెట్టుబడిదారీ విధానాన్ని, పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలను, సంపదనీ, మారకాన్ని పెంచి, పోషిస్తుంది.

ప్రభుత్వ ఏర్పాటులోను, ప్రభుత్వాధికార నిర్వహణలోను బడాబూర్జువావర్గం సాధారణంగా గణనీయమైన పలుకుబడిని కలిగి వుంటుంది.

జాతీయ బూర్జువావర్గంలో భూస్వాములు కూడా కలిసే వున్నారు. ప్రభుత్వ నిర్మాణంలో, ముఖ్యంగా రాష్ట్రాల స్థాయిలో, వారినికూడా చేర్చుకొన్నారు. రైతాంగానికి నష్టదాయకమైన రీతిలో వారికి సౌకర్యాలు కల్పించి పెడుతున్నారు.

రాజ్యాంగయంత్రం బూర్జువావర్గ స్వభావం కలిగివున్నప్పటికీ, మన దేశంలో సామ్రాజ్యవాద నిరంకుశ పాలనపోయి, బూర్జువా ప్రజాస్వామిక రాజ్యాంగ యంత్రం అవతరించడమే చరిత్రాత్మకమైన ముందంజ.

50. భారత రిపబ్లిక్ రాజ్యాంగం వయోజన ఓటింగ్ హక్కు ప్రాతిపదికపై పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, ప్రజలకు కొన్ని ప్రాథమిక హక్కులను, ప్రభుత్వానికి కొన్ని ఆదేశ సూత్రాలను సమకూర్చు తున్నది.

అయితే, రాజ్యాంగం సమకూర్చుతున్న కొన్ని ప్రాథమిక హక్కులు ప్రజలకు పరిమితంగా మాత్రమే ఉపయోగ పడగలవన్న విషయం ఈ సందర్భంలో చెప్పక తప్పదు. ఈ హక్కులలో అనేకవాటి విషయంలో ప్రభుత్వాధికారులు తప్పుడు వ్యాఖ్యానాలతోను, అపార్థాలకల్పనలతోను, చివరకు అతిక్రమణలతోను దోపిడీ వర్గాలకు అనుకూలంగా అన్వయిస్తున్నారు. సువిశాలమైన ప్రాంతాలలో, ప్రదేశాలలో 144 సెక్షన్ ప్రకటించి నెలలూ, సంవత్సరాలూ ఆ నిషేధాజ్ఞను కొనసాగిస్తూ, లక్షలాది ప్రజలకు సమావేశ స్వేచ్ఛ లేకుండా చేస్తున్నారు. అందుకు శాంతి భద్రతలు కాపాడడంఅనే సాకు చెబుతున్నారు. దీని ద్వారా కార్మికులు, కర్షకులు తమ ప్రయోజనాలను రక్షించుకోవడానికి ఒక చోట సమావేశం కాకుండా అడ్డుకొంటున్నారు. ముఖ్యంగా కార్మికులు, కర్షకులు, ఇతర కష్టజీవులు, సామాన్య ప్రజలు తమ హక్కుల రక్షణకు, తమ కోర్కెల సాధనకు సంకల్పసిద్ధులై పోరాడే సందర్భంలో రాజ్యాంగ యంత్ర హింసాకాండ క్రూరంగా, ఘోరంగా తయారవుతున్నది.

ఇలాంటి పరిమితులు ఉన్నప్పటికీ, రాజ్యాంగంలో వున్న ఈ హక్కులను వేదికగాను, సాధనంగాను చేసుకొని ప్రజాపోరాటాలద్వారా ప్రజాస్వామిక విస్తరణకు, ప్రజల ప్రయోజనాల రక్షణకు పాటుపడవచ్చు.

51. ఇండియాలోని ప్రస్తుత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఒకరకమైన వర్గపాలనే అయినప్పటికీ, దానిని సాధనంగా చేసుకొని ప్రజలు తమ పోరాటం ద్వారా, ఆ వర్గపాలన నిరంకుశరూపం ధరించకుండాను, అభివృద్ధి నిరోధక గుత్తాధిపతుల, భూస్వామ్య వర్గాల చేతిలో అది సాధనం కాకుండాను కొంతవరకు అరికట్టవచ్చు. రాజ్యాంగయంత్ర వ్యవహారాలలో ప్రజలపక్షాన కొంతవరకు జోక్యం కల్పించుకోవడానికి ఇండియాలోని పార్లమెంటు వేదికగావుంది. శాంతి, జాతీయ స్వాతంత్ర్యం ప్రజాస్వామ్యం రక్షణను కోరుతూ ఎలుగెత్తి చాటడానికి, సామ్రాజ్యవాదుల కుట్రలను దూర్పారబట్టడానికి, ప్రజలకు అనుకూలంగా సామాజిక పరివర్తనను, భూసంస్కరణలవంటి వాటిని తీసుకురావాలని కోరడానికి, కార్మిక హక్కులకోసం పోరడానికి, గుత్తాధిపత్య సంస్థలను అరికట్టాలని కోరడానికి పార్లమెంటు వేదికగా ఉపయోగపడుతున్నది.

52. అగ్ర గుత్తాధిపత్యపు గ్రూపులు మిగతా బూర్జువావర్గం నుంచి అధికాధికంగా వేరై పోతున్న కొలదీ, జాతీయ బూర్జువావర్గంలోనే అంతర్గత పోరాటం తీవ్రమవుతుంది. బడ్జెట్ వ్యవహారాలపైన, ఇతర ఆర్థిక చర్యలపైన అధికారం సంపాదించు కొనేందుకు పార్లమెంటరీ యంత్రాన్ని స్వాధీనంచేసుకొనే నిమిత్తం జాతీయ బూర్జువా వర్గంలోని వివిధ గ్రూపుల మధ్య పోరాటం తీవ్రమవుతుంది. తమ తమ గ్రూపుల ప్రయోజనాలకు అనుగుణంగా బడ్జెట్, శాసనాలు, విధానాలు మున్నగువాటిని మలుచుకోవాలని చూసే ఆ గ్రూపులు పార్లమెంటరీ యంత్రాన్ని చేజిక్కించు కోవడానికి విశ్వ ప్రయత్నం చేస్తాయి.

ఈ పరిణామాలపై విదేశీ గుత్తాధిపత్య వర్గాల ప్రభావంకూడా తప్పనిసరిగా వుంటుంది. ఆ వర్గాలు సాధారణంగా గుత్తాధిపత్యపుగ్రూపులను, మాజీ సంస్థానాధీశుల వర్గాలను బలపరుస్తుంటాయి. అందుకే దేశీయ గుత్తాధిపత్య గ్రూపులు, మాజీ సంస్థానాధీశులు దేశంలోకి విదేశీ పెట్టుబడులు రావడానికి మార్గం సుగమం చేయాలని, ప్రభుత్వ రంగాన్ని అరికట్టాలని, అలీన విధానాన్ని విడనాడాలని కోరుతున్నారు.

53. గుత్తాధిపత్యపు గ్రూపులు, ఫ్యూడల్ వర్గాలు దేశంలోని ప్రధానమైన అభివృద్ధినిరోధక, ప్రజాస్వామిక వ్యతిరేక శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. పార్లమెంటుపైన, ప్రభుత్వంపైన నిరంతరం వత్తిడి తేవడంద్వారా వారు మరింత మితవాద విధానాలను దేశంమీద రుద్దజూస్తున్నారు. అందుచేతనే వారు ప్రజాస్వామిక విస్తరణను వ్యతిరేకిస్తున్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై పరిమితులు విధించాలంటున్నారు. నిరంకుశ నియంతృత్వాన్ని పెంపొందించాలంటున్నారు.

కనుకనే, ప్రజాస్వామికశక్తులు, సోషలిస్టు శక్తులు ప్రభుత్వరంగాన్ని పటిష్ఠవంతం చేయాలని, దానిపై ప్రజాస్వామిక అజమాయిషీని విధించాలని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పటుతరం చేయాలని కోరుతున్నాయి.

54. ప్రజలు ఒకసారి ఎన్నుకొన్న ప్రజాప్రతినిధిని మధ్యలో, అయిదేళ్ళ కాలపరిమితి పూర్తి కాకముందే, వెనక్కు రప్పించే హక్కు లేనందున, తమ ప్రయోజనాలకు వ్యతిరేకంగా తమచే ఎన్నుకొనబడిన ప్రతినిధి వ్యవహరిస్తున్న సందర్భంలోకూడా ప్రజలు వెంటనే జోక్యం కల్పించుకోలేకపోతున్నారు. అయిదేళ్ళ కాలపరిమితి పూర్తయ్యేవరకు వారు మిన్నకుండ వలసి వస్తున్నది. పెట్టుబడిదారీ ప్రభుత్వం హయాంలో ఎన్నికలు ఎంత స్వేచ్ఛా పూర్వక వాతావరణంలో జరిగినప్పటికీ ఆ ఎన్నికలు స్వతఃసిద్ధంగా కష్టజీవులకు భారమైనవిగానే వుంటాయి. ఎందుకంటే, పత్రికలన్నీ గుత్తాధిపత్యం వర్గాల చెప్పుచేతల్లో వుంటాయి. కోటీశ్వరులిచ్చే ఎన్నిక నిధులు దండిగా పాలక పక్షం చేతిలో వుంటాయి.

ఆలాంటి పరిస్థితులలో, పార్లమెంటరీ విధానాల తీరును ప్రజలకు అనుకూలంగాను, గుత్తాధిపతులకు వ్యతిరేకంగాను - అంటే అర్థం ప్రజాస్వామ్యాన్ని, పార్లమెంటును రక్షించడమే-మలచాలంటే, అందుకు ఒక్కటే మార్గం వుంది. పార్లమెంటువెలుపల ప్రజాపోరాటాలు మాత్రమే అందుకు శక్తివంతమైన ఆయుధంగా ఉపకరిస్తాయి.

55. జాతీయ స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతరం భారతీయ ప్రజాస్వామ్యం ముందు అతిముఖ్యమైన సమస్య ఒకటి ప్రత్యక్షమైంది. ఇండియన్‌యూనియన్‌లోని అన్ని అంతర్భాగాలకు - అతిస్పష్టమైన ప్రాంతీయత, అభివృద్ధి చెందిన భాష, చరిత్ర, సంస్కృతి లక్షణాలను కలిగివున్న అంతర్భాగాలు-ఆర్థిక, రాజకీయాభివృద్ధి సాధనలో పరిసమానమైన అవకాశాలు, కల్పించి, ప్రజాస్వామానికి భద్రత చేకూరే విధంగారాజ్యాంగాన్ని పునర్వ్యవస్థీకరించవలసిన బాధ్యత భారతీయ ప్రజాస్వామ్యం పైన పడింది. కులతత్వాన్ని, మతతత్వాన్ని, అనిష్టదాయకమైన అంటరానితనాన్ని, కుల వివక్షను నిర్మూలించటం, తెగలు దళితప్రజలు త్వరితంగా అభివృద్ధి చెంది, సమాన హక్కులు అనుభవించేటట్లు చూడటం వంటి బాధ్యతలు కూడా దానిపై పడినవి.

సామ్రాజ్యవాద పాలకులు భారత దేశాన్ని అనేక ఫ్యూడల్ సంస్థానాలుగాను, కృతకమైన అనేక రాష్ట్రాలుగాను చీల్చారు. భారతదేశం అఖండ ప్రజాస్వామిక జాతిగా అభివృద్ధి చెందకుండా అరికట్టడమే సామ్రాజ్యవాదుల పరమావధి. ఐక్య భారత దేశంలో వివిధ భాషాసమూహాలు వికసించకుండా నిరోధించడం వారి ధ్యేయం. జాతీయవిమోచన పోరాటాన్ని చీల్చి, దుర్బలపర్చడం వారిలక్ష్యం.

స్వాతంత్ర్య పోరాటాన్ని దెబ్బతీయటానికి దేశాన్ని రెండు రాజ్యాలుగా, ఇండియా, పాకిస్తాన్‌లుగా చీల్చడానికి, ఆ రెండిటి స్వాతంత్ర్యాన్ని దుర్బలం చేయడానికి సామ్రాజ్యవాదం కులతత్వాన్ని, మతతత్వాన్ని, ముఖ్యంగా హిందూ-ముస్లిం వైషమ్యాన్ని వినియోగించుకొన్నది.

56. స్వాతంత్ర్యానంతరం, కాంగ్రెసునాయకత్వం భారత రిపబ్లిక్ రాజ్యాంగ వ్యవస్థను భాషాప్రయుక్త సూత్రం ప్రాతిపదికపై పునర్వ్యవస్థీకరించి, ఆ విధంగా ఏర్పాటు చేయబడిన రాష్ట్రాలకు పూర్తి స్వపరిపాలనాధికారాలు యిస్తారని అంతా ఆశించారు. జాతీయ బూర్జువా వర్గం సంస్థానాలను రద్దుచేసి, ఇండియన్ యూనియన్‌లో వాటన్నిటిని విలీనం చేసింది. అయితే దూరదృష్టిలేని అభివృద్ధి నిరోధక గుత్తాధిపత్య వర్గాల పలుకుబడికి లోనైన జాతీయ బూర్జువావర్గం భాషాప్రయుక్త సూత్ర ప్రాతిపదికపై రాష్ట్రాలను పునర్విభజించడానికి నిరాకరించింది. చివరకు ప్రజా పోరాటాలద్వారా ఈ సమస్యను పరిష్కరించవలసి వచ్చింది. ఆంధ్ర, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్‌లలోని ప్రజాస్వామిక జనానీకం సాగించిన పోరాటాల వత్తిడికి పాలకవర్గాలు లొంగివచ్చాయి. అయితే, రాష్ట్రాల సరిహద్దు నిర్ణయం విషయంలో ఇప్పటికీ కొన్ని సమస్యలు అపరిష్కృతంగానే వున్నాయి.

57. కమ్యూనిస్టుపార్టీ మొదటినుంచీ భాషాప్రయుక్త రాష్ట్రాల నిర్మాణంకోసం పాటుపడుతూనే వచ్చింది. తెగల ప్రజలకు వారు మెజారిటీగావున్న ప్రాంతాలలో ప్రాంతీయ స్వపరిపాలనాధికారాలు యివ్వాలని, ఇండియన్ యూనియన్‌లోని అన్ని అంతర్భాగాలకు సంపూర్ణ అభివృద్ధి అవకాశాలు కలుగచేయాలని, ప్రజాస్వామ్యం [illegible] కోరుతూ వచ్చింది. అంటరానితనాన్ని, కుల వివక్షను పూర్తిగా నిర్మూలించడానికి కమ్యూనిస్టుపార్టీ కంకణం ధరించింది. ఫ్యూడల్, సెమీఫ్యూడల్ దోపిడీ పీడన అవశేషాలను నిర్మూలించడం ద్వారా నిమ్నజాతుల ప్రజలకు విమోచనం కల్గించాలని కమ్యూనిస్టుపార్టీ కోరుతున్నది. వారికి భూములు యివ్వాలని, వారి సాంస్కృతిక బడుగుస్థితిని త్వరగా నిర్మూలించడానికి గట్టి చర్యలు తీసుకోవాలని కమ్యూనిస్టుపార్టీ కోరుతున్నది.

58. మనది పేరుకి ఫెడరల్ వ్యవస్థ అయినప్పటికీ, వాస్తవంలో అధికారాలన్నీ దాదాపు కేంద్ర ప్రభుత్వం చేతిలోనే కేంద్రీకృతమై వున్నవి. ఇండియన్ యూనియన్‌లో అంతర్భాగాలైన రాష్ట్రాలు పరిమితమైనస్వపరిపాలనను, అధికారాలను మాత్రమే కల్గి వున్నాయి. దీనివల్ల రాష్ట్రాల ఆర్థికాభివృద్ధి, సాంస్కృతిక వికాసం అరికట్టబడుతున్నాయి.

59. ఇట్టి పరిస్థితిలో, కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రాలకు మధ్య వైరుధ్యాలు పెంపొందుతాయి. బ్రిటిష్ హయాంలో, పెట్టుబడిదారీ విధానం దేశమంతటా ఒకేసారిలో అభివృద్ధి చెందనందువల్ల, కొన్ని రాష్ట్రాలు పారిశ్రామికంగా అభివృద్ధిచెందడం, మరికొన్ని వెనుకబడిపోవడం తటస్థించింది. ఈ ఎగుడు దిగుడు అభివృద్ధిని పంచవర్ష ప్రణాళికలైనా సరిదిద్దలేవు. పెట్టుబడులు ఎంతగా పెరుగుతున్నా, పలుకుబడిగల్గిన బడాబూర్జువావర్గం ఆ పెట్టుబడులన్నింటిని తమ పాత పెట్టుబడులుగల కేంద్రాలకే మళ్ళించుకోజూస్తున్నది. ఈ వైరుధ్యాలకు ప్రజాస్వామిక పరిష్కారాలను కనుగొనడానికి మారుగా, బూర్జువావర్గంలోని అభివృద్ధి నిరోధక శక్తులు జాతీయ దురహంకారాన్ని, రాష్ట్ర దురభిమానాలను, ఇతర విచ్ఛిన్నకర ధోరణులను రెచ్చగొడుతూ, ప్రతి రాష్ట్రం అభివృద్ధిని, మొత్తం దేశం పురోభివృద్ధిని అరికడుతున్నాయి.

60. దేశంలో కొన్ని ప్రాంతాలు కేంద్ర పాలిత ప్రాంతాలుగా వున్నాయి. కేంద్ర ప్రభుత్వం నియమించిన అధికారులు ఆప్రాంతాలను పరిపాలిస్తున్నారు.

మొత్తంమీద ఆ ప్రాంతాలలోని ప్రజలకు పరిపాలనా వ్యవహారాలలో ఎలాంటి ప్రమేయం లేకుండా చేయబడింది. అయితే, ఆ ప్రాంతాలలోని కొన్నిటిలో పార్లమెంటుకు ప్రతినిధులను ఎన్నుకొనే హక్కును ప్రజలకు కల్పించారు. దేశంలోని పార్లమెంటుకు ప్రతినిధిని పంపే అర్హత కల్గివున్న ఆ ప్రాంతాల ప్రజలు తమ ప్రాంతంలో తమ స్థానిక అసెంబ్లీకి ప్రతినిధులను ఎన్నుకొనడానికి మాత్రం అనర్హులై పోయారు!

కొన్ని రాష్ట్రాలలో, గిరిజనులు ఒకే ప్రాంతంలో గుమిగూడినట్లు జీవిస్తూ, సొంత భాషను, సంస్కృతిని, సొంత గిరిజన రాజ్య సంప్రదాయాలను కలిగి వున్నారు. ఈ ఆదివాసుల జీవితంలో త్వరితగతిని పరివర్తన వస్తున్నది. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందిన కొత్త పరిస్థితులలో వారి జీవితం కునారిల్లి పోతున్నది. వారిలో కొత్త చైతన్యం ప్రదీప్తమవుతున్నది. వారు పెద్ద పెద్ద రాష్ట్రాలలో చిన్న చిన్న గ్రూపులుగా చెల్లా చెదురై జీవిస్తున్నందున, వారిలో పొంగుతున్న చైతన్యానికి తగినట్టుగా వారు అభివృద్ధిచెందడానికి అవకాశం లేకపోతున్నది. వారు ప్రాంతీయ స్వపరిపాలనను కోరుతున్నారు. తమ ప్రయోజనాలను తమకు నచ్చిన విధంగా నెరవేర్చుకొని, అభివృద్ధి చెందే అవకాశం తమకు యివ్వాలని వారు కోరుతున్నారు. కొన్ని ప్రాంతాలలో, అంత జనసంఖ్య, భౌగోళిక ఏర్పాటువున్న ప్రాంతాలలో, తమకు సొంత రాష్ట్రం కావాలని కూడా వారు కోరుతున్నారు.

కాని, జాతీయ బూర్జువావర్గం వారు కోరుతున్న న్యాయమైన కోర్కెలను నిరాకరిస్తూ బలప్రయోగంద్వారా వారిని అణస్తూ, వారిలోని అగ్రశ్రేణికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించి, లొంగదీస్తున్నారు. ఇందుకు ఒక కారణం లేకపోలేదు. జాతీయ బూర్జువావర్గానికి అడవులలోను, గనులలోను, తదితర శాఖలలో పని చేయటానికి గిరిజనులుచౌకగా దొరుకుతున్నారు. గిరిజనుల జీవితంలో త్వరితంగావస్తున్న మార్పుల ఫలితంగా, వారు దోపిడీకి తేలికగా గురైపోతున్నారు. పెట్టుబడిదారీ పోటీ కొనసాగే పరిస్థితులలో, రాజ్యాంగంలో పొందుపరచిన మైనారిటీల హక్కులనూ పూర్తిగా అనుభవించలేరు.

61. అత్యున్నత కేంద్రీకృత నిరంకుశాధికారం అనే ప్రాతిపదికపై పరిపాలనా వ్యవస్థ రూపొందినందువల్ల, సర్వాధికారాలు శిఖరాగ్రంలోనే పోగయ్యాయి. ప్రజాసామాన్యానికి దూరమైన, భద్రమూర్తులైన (ప్రిఫెక్ట్) నిరంకుశాధికారులు దోపిడీవర్గాల ప్రయోజనాలకు అనుకూలంగా సవినయవిధేయతలతో సేవచేస్తున్నారు. ఈ వర్గాలు తమ పెట్టుబడిదారీ పోటీలో తమ చేతిలోని ధనశక్తిని వినియోగించి, పరిపాలనా శాఖలపై పలుకుబడి సంపాదించి, తమ స్వార్థ ప్రయోజనాలను నెరవేర్చుకుంటాయి గనుక, ప్రభుత్వంలోని ఉన్నత వర్గాలు అవినీతికి లోనుకాగల అవకాశం ఏర్పడుతున్నది. ప్రభుత్వ యంత్రాంగంలోని పైవర్గాలలో ప్రారంభమైన ఈ జబ్బు నెమ్మదిగా క్రింది స్థాయిలకు వ్యాపించక మానదు.

స్థానిక సంస్థలు, స్థానిక అభివృద్ధికి సంబంధించిన పరిపాలనా వ్యవహారాలలో ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొనటంకోసం స్థానిక పరిపాలనలోని స్థానికసంస్థలు ఉద్దేశింపబడినవి. ఆ విధంగా నిరంకుశాధికార కేంద్రీకరణకు విరుగుడుగా కూడా అవి ఉద్దేశింపబడినవి. అయితే, పంచాయతీలు తలపెట్టే పనులకు డబ్బు మంజూరుచేసే అధికారాన్ని గుప్పెట్లో పెట్టుకొని కూర్చున్న ఉన్నతాధికారులు ఆ స్థానిక సంస్థలను నిరంకుశంగా శాసిస్తున్నారు. ప్రజల పంచాయతీ రాజ్యం అని పిలువబడుతున్న స్థానిక పరిపాలన ఆ విధంగా బూర్జువావర్గం చేతిలో కేవలం పనిముట్టుగా మారిపోయింది. గ్రామీణ ప్రాంతంలో తన అధికారాన్ని సుస్థిరం చేసుకొనడానికి ఆ వర్గం ఆ పనిముట్టును వినియోగించుకొంటున్నది. దోపిడీదారులు, వారి అడుగులకు మడుగులొత్తే నిరంకుశాధికారులు నిర్వహించే బూర్జువా ప్రజాస్వామ్యంలో నిజమైన సిసలైన ప్రజాస్వామ్యం బ్రతికి బట్టకట్టలేదన్న సంగతి విస్మరించరాదు.

62. రాజ్యాంగయంత్రనిర్వహణలో న్యాయ నిర్వహణశాఖ ముఖ్యమైన ఉపాంగం. ఈ న్యాయ నిర్వహణ ఉపాంగం కార్మికులకు, కర్షకులకు, ఇతర కష్టజీవులకు ప్రతికూలమైన ధోరణినే కలిగివుంటుంది. చట్టం దృష్టిలో పేదలు, ధనికులు అనే భేదా లేకుండా అంతా సమానులే అన్న సూత్రం వున్నప్పటికీ, చట్టాలు, కోర్టు వ్యవహారాలు, న్యాయ వ్యవస్థ ప్రధానంగా దోపిడీ వర్గాల ప్రయోజనాలను మాత్రమే కాపాడుతూ, వారి వర్గ పాలనను పదిలపర్చుతుంటాయి.

63. బూర్జువావర్గం నిర్వర్తిస్తున్న వర్గ పాలనను బట్టి, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పరిమితులు ఏర్పడుతున్నాయి. గుత్తాధిపత్యపు వర్గాలు, అభివృద్ధి నిరోధక శక్తులు పెరిగిన కొలదీ, ఇప్పుడువున్నప్రజాస్వామికహక్కులు, మొత్తం పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే ఎగిరిపోయే ప్రమాదం వుంది.

పచ్చి అభివృద్ధి నిరోధక శక్తులే పార్లమెంటరీ వ్యవస్థను లోపలనుంచి, వెలుపలనుంచి కూడా తూట్లు పొడుస్తున్నాయి. సంకుచితమైన తమ వర్గ ప్రయోజనాలను కాపాడుకోవడానికి, కష్టజీవులను అణచడానికి, దాని నొక పనిముట్టుగా మార్చ చూస్తున్నాయి. కమ్యూనిస్టు పార్టీ పార్లమెంటరీ సంస్థలను, ప్రజాస్వామిక సంస్థలను రక్షించడానికి, వాటిని మరింత అభివృద్ధి చేయడానికి, పరిపూర్ణమైన, సార్థకమైన ప్రజాస్వామ్యంగా అభివృద్ధి చేయడానికి శక్తి వంచన లేకుండా పాటుబడుతుంది.

VII

భారత వైదేశిక నీతి:

64. భారత ప్రభుత్వం అనుసరిస్తున్న వైదేశిక నీతి ప్రధానంగా శాంతి విధానం, అలీన విధానం వలస వ్యతిరేక విధానం. జాతీయ బూర్జువావర్గ ప్రయోజనాలకు అది అనుగుణమైనది, ఆ విధానం భారతదేశ ఆర్థికాభివృద్ధి అవసరాలను తీరుస్తున్నది. భారత ప్రజల మనోభావాలను అది ప్రతిబింబిస్తున్నది.

మొదట్లో భారత వైదేశికనీతి బ్రిటిష్ వత్తిడుల ప్రభావానికి గురిఅయింది. అంతకు పూర్వంగల పరాధీనతనుంచి సంక్రమించిన వారసత్వం అది. కాని, త్వరలోనే అది గణనీయంగా మారింది.

65. ఇండియా, తదితర ఆగ్నేయాసియా దేశాల విషయంలో ఆంగ్లో - అమెరికన్ విధానాల పట్ల భ్రమలు తొలగిపోవడం, ఒక వైపున కొత్తగా స్వాతంత్ర్యం పొందిన రాజ్యాలు తమ స్వాతంత్ర్యాన్ని పటిష్ఠవంతం చేసుకోవాలని, జాతీయార్థిక వ్యవస్థలను స్వతంత్ర పథంలో అభివృద్ధి చేసుకోవాలని ఉవ్విళ్ళూరుతూండే, వేరొకవైపున సామ్రాజ్యవాదులు తమ నయా సామ్రాజ్యవాద ఆకాంక్షలను ఈడేర్చుకోవాలని తాపత్రయపడుతుండటంతో, ఆ రెండింటికీ మధ్య వైరుధ్యాలు ఎక్కువ కావటం, ఆసియా - ఆఫ్రికా దేశాలలో జాతీయ విమోచన పోరాటం ఉధృత రూపంలో ప్రజ్వరిల్లడం, శక్తి ఉడిగిపోయిన సామ్రాజ్యవాదం తిరోగమనం ప్రారంభించడం, సోషలిస్టు ప్రపంచం శక్తి సామర్థ్యాలు దిన - దిన ప్రవర్ధమానమవుతుండడం - వీటన్నిటి ఫలితంగా భారత వైదేశిక నీతిలో పెద్దమార్పు వచ్చింది. అలీన విధానాన్ని నిర్మాణాత్మకంగా రూపొందించారు. 1954 లో చైనా ప్రజా రిపబ్లిక్‌తో సుప్రసిద్ధమైన పంచశీలా ఒప్పందము కుదుర్చుకున్నారు. 1955 లో బాండుంగ్ మహాసభ జరిగింది. సోషలిస్టుదేశాలతో స్నేహ సంబంధాలు వృద్ధిచెందసాగాయి. సమానత్వం, పరస్పర ప్రయోజనదాయకం అయిన ప్రాతిపదికపై వాటితో ఆర్థిక సహకారం నెరపసాగారు. ఈజిప్టుపై సామ్రాజ్యవాద దండయాత్రప్రారంభమైనప్పుడు,దానినినిర్ద్వంద్వంగా ఖండించడంలోను, వలసవిధానాన్ని ఖండిస్తూ వలసదేశాలన్నింటికిని శీఘ్రంగా స్వాతంత్ర్యాన్ని యివ్వాలని ఐరాసలో సోవియట్ ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని బలపరచడంలోను భారత వైదేశిక నీతిలోని వలస వ్యతిరేక స్వభావం స్పష్టంగా ప్రస్ఫుటమైంది. శాంతి, శాంతియుత సహజీవనం, [illegible], సంపూర్ణ నిరాయుధీకరణ, అణ్వస్త్రాల నిషేధం, ఆసియా, ఆఫ్రికా సౌహార్దం మున్నగువాటిని ప్రభుత్వం పూర్తిగా బలపరుస్తున్నది.

66. నాలుగు వందల ఏళ్ళబట్టి పోర్చుగీస్ సామ్రాజ్యవాదుల అధీనంలోవున్న భారత భూభాగాల విషయంలో, ఆ సామ్రాజ్యవాదులు మొండి వైఖరి అవలంబించినందున, 1961 లో ఆ భూభాగాలను విముక్తిచేయడానికి ఇండియా సైనిక చర్య తీసుకోవడంతో భారతదేశ వైదేశిక నీతిలోని అలీన స్వభావం, వలస వ్యతిరేక స్వభావం మరింత బలపడింది. భారతదేశం తీసుకున్న ఈ సైనికచర్యలను ఆంగ్లో-అమెరికన్‌సామ్రాజ్యవాదులు ఖండించగా, సోషలిస్టు ప్రపంచం, కొత్తగా విముక్తిపొందిన దేశాలు భారత ప్రభుత్వం, భారతప్రజలు గైకొన్న న్యాయసమ్మతమైన చర్యను పూర్తిగా బలపర్చాయి. దేశంలో శాంతిశక్తులను, వలసవ్యతిరేక శక్తులను ఈ విధానం పటుతరమొనర్చింది. అదే సమయంలో ఈ విధానం ప్రపంచంలోని శాంతి ప్రియ దేశాలలో భారతదేశానికి ఎనలేని పేరు ప్రతిష్ఠలను చేకూర్చి పెట్టింది.

67. ఇండియా వైదేశిక నీతి సామ్రాజ్యవాదులకు ఏమాత్రం రుచించడం లేదనడానికి మరొక నిదర్శనంగా, కాశ్మీరు విషయంలోవారు అవలంబిస్తున్న వైఖరినే తీసుకోవచ్చు. కాశ్మీరు సమస్యపై పాకిస్తాన్ ప్రదర్శిస్తున్న దురాక్రమణ పూరిత వైఖరిని వారు పూర్తిగా బలపరుస్తున్నారు. ఇండియాలో అంతర్భాగమైన కాశ్మీరు తమకు చెందాలని పాకిస్తాన్ అంటుంటే, సామ్రాజ్యవాదులు ఆ గొంతెమ్మ కోర్కెను కూడా బలపర్చుతున్నారు. భద్రతా సమితిలో పాకిస్తాన్‌తో పొత్తు కలవడం ద్వారా వారు కాశ్మీరును ఉద్రిక్తతకు ఆకరం చేయాలన్నదుష్ట విధానాన్ని బలపర్చుతున్నారు. తత్ఫలితంగా పాకిస్తాన్, భారతదేశం పదేపదే ప్రతిపాదిస్తున్న స్నేహ, నిరాక్రమణ, శాంతిసంధి కుదుర్చుకోవడానికి నిరాకరిస్తున్నది.

68. 1962 అక్టోబరులో జరిగిన చైనా దండయాత్ర భారతప్రజలను దిగ్భ్రాంతులను చేసింది. ప్రజలలో చెలరేగిన ఆగ్రహావేశాలను భారతదేశం అనుసరిస్తున్న అలీనవిధానంపైకి మళ్లించాలని పచ్చి అభివృద్ధి నిరోధకులంతా కలిసి ప్రయత్నించారు. నెహ్రూ నాయకత్వాన్నే దుయ్యబట్టసాగారు. భారత వైదేశికనీతికి ప్రధాన శిల్పకారుడైన నెహ్రూ రాజీనామాఇవ్వాలనిడిమాండ్ చేశారు. అలీనవిధానాన్ని విసర్జించవలసిందని, ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్యవాదులతో రక్షణ సంధి కుదుర్చుకోవలసిందని పచ్చి అభివృద్ధి నిరోధకులంతా ప్రధాన మంత్రి నెహ్రూపై విపరీతమైన ఒత్తిడి తెచ్చారు.

69 అయితే, అలీన విధానం విషయంలో నెహ్రూ గట్టి వైఖరి తీసుకున్నారు. దానికి తోడు భారత ప్రజానీకం ఆయనకు అండగా నిలబడింది. జాతీయ రక్షణ విషయంలో భారత కమ్యూనిస్టు పార్టీ సరియైన వైఖరులను అవలంబించింది, క్యూబా సంక్షోభం పరిష్కారం కావటంతో ప్రపంచ యుద్ధ ప్రమాదం తొలగిపోయింది. సోవియట్ యూనియన్, తదితర సోషలిస్టు దేశాలు ఇండియా విషయంలో స్నేహ వైఖరి అవలంబించాయి. [illegible] పరిణమించిన పురోగమనానికి స్వస్తిచెప్పి, చైనావారు యుద్ధ విరమణ ప్రకటించారు. వీటన్నిటి ఫలితంగానూ భారత వైదేశిక నీతి [illegible] బ్రతికి బయట పడింది.

70. అయితే, చైనా దురాక్రమణ దేశంలోని అభివృద్ధి నిరోధక శక్తులకు అవకాశాలను చేకూర్చి పెట్టింది. ఆ శక్తులు తమ రాజకీయ దాడిని కొంతకాలం పాటు కొనసాగించగలిగాయి. అలీన విధానాన్ని, వలస వ్యతిరేక విధానాన్ని అవి కొంత కాలం పాటు బలహీన పరచగలిగినవి. వాయిస్ ఆఫ్ అమెరికాతో కుదుర్చుకొన్నఒప్పందం, హిందూ మహాసముద్రంలో అమెరికా 7 వ నౌకాదళం గస్తీచర్యలు ప్రారంభించబోతున్నప్పుడు దానిని గట్టిగా ఖండించి, వ్యతిరేకత తెల్పడంలో ప్రభుత్వం ప్రదర్శించిన తటపటాయింపు, మరొకమాటలోచెప్పాలంటే, ఆ సమస్యను దాటవేయడానికి ప్రయత్నించడం, ఉమ్మడి వైమానిక విన్యాసాలు మొదలైన వాటిని ఇందుకు ఉదాహరణలుగా తీసుకోవచ్చు.

71. అలీనవిధానం మొత్తంమీద చెక్కు చెదరలేదని చెప్పవచ్చు. ఇది కేవలం మాటల్లోను, ప్రకటనల్లోను మాత్రమే జరుగుతున్నది కాదు, ఆచరణలోకూడా అలీన విధానం నికరంగానేవుంది, చైనా దండయాత్ర సాగిన సందర్భంలో తీవ్రమైన సంక్షోభం ఏర్పడిన రోజుల్లో కూడా, అభివృద్ధినిరోధకులు పెద్ద ఎత్తునదాడిచేస్తూన్నా, భారత ప్రభుత్వంక్యూబన్ సంక్షోభం విషయంలో సోవియట్ యూనియన్ వైఖరిని గట్టిగా బలపర్చింది, ఐక్యరాజ్య సమితిలో చైనాకు సభ్యత్వం ఉండగలన్న అంశాన్ని బలపర్చింది. అణ్వస్త్ర పాటవ పరీక్షల నిషేధపు ఒప్పందాన్ని ధృవీకరించింది, ప్రజాభిప్రాయాన్ని గమనించి, వాయిస్ ఆఫ్ అమెరికాతో తాను కుదుర్చుకొన్న ఒప్పందాన్ని రద్దుచేసుకొన్నది. చైనాకు వ్యతిరేకంగా వైమానిక రక్షణ కల్పిస్తామంటూ సామ్రాజ్యవాదులు చేసిన ప్రతిపాదనను నిరాకరించింది.

72. ఆంగ్లో అమెరికన్ పెట్టుబడులతో బలీయమైన సంబంధాలను ఏర్పరచుకొన్న కొన్ని గుత్తాధిపత్య పెట్టుబడిదారీ వర్గాలు, వాటితోపాటు పయనిస్తున్న మాజీ సంస్థానాధీశులు చెందిన ఫ్యూడల్అవశేషవర్గాలు ప్రధానంగా భారత వైదేశిక నీతిని వ్యతిరేకిస్తున్నాయి. ప్రధానంగా ఈ వర్గాల తోడ్పాటును కలిగివున్న పార్టీలు భారతదేశ అలీన విధానాన్ని వ్యతిరేకిస్తున్నాయి.

కాంగ్రెస్ లోపలగల అభివృద్ధి నిరోధకులు సాధారణంగా ఈ వర్గాలనే బలపర్చుతుంటారు. ఆ విధంగా ఈ వర్గాలవారు, ఇటు కాంగ్రెసు లోపలనుంచి, అటు కాంగ్రెసు వెలుపలనుంచి, ద్విముఖంగా దాడిచేస్తూ ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి, ఆంగ్లో - అమెరికన్ కూటమితో భారతదేశం సన్నిహిత సంబంధాలు పెట్టుకొనేటట్టు చేయాలని చూస్తున్నారు.

ఈ వత్తిడుల మూలంగా, కాంగ్రెసు ప్రభుత్వం తరచు ప్రమాదకరమైన ఊగిసలాటలలో పడుతూ, భారత వైదేశికనీతికి అనుగుణంగాని వైఖరులను అవలంబిస్తున్నది. ముఖ్యంగా నయా వలసవాద కుట్రలకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదుల దురాక్రమణ చర్యలకు వ్యతిరేకంగా (ఉదాహరణకు కాంగో, దక్షిణ వియత్నామ్, మలేషియాలు) గట్టి వైఖరిని, గట్టి చర్యలను తీసుకోవడంలో భారత ప్రభుత్వం పూర్తిగా విఫల మవుతున్నది. దీనివల్ల ఆసియా, ఆఫ్రికా దేశాల దృష్టిలో భారతదేశంయొక్క సామ్రాజ్య వ్యతిరేక, వలస వ్యతిరేక ప్రతిష్ఠ దెబ్బతింటున్నది. అందుచేత ప్రజాస్వామిక శక్తులు సదా అతి మెళకువతో మసలుకొంటూ, సువిశాలమైన ప్రాతిపదికపై శాంతి సౌహార్ద ఉద్యమాలలోకి అశేష జనానీకాన్ని సమీకరిస్తూ ఈ ఒత్తిడులను త్రిప్పికొట్టాలి. తద్వారాభారతవైదేశికనీతిలోనిబలహీనతలను ఊగిసలాటలను తొలగించాలి.

అలీన, శాంతి, వలస వ్యతిరేక విధానాల వల్ల భారతదేశ రాజకీయ స్వాతంత్ర్యం పటిష్ఠవంతమైంది. దానితోపాటు శాంతియుత ఆర్థిక నిర్మాణానికి అవసరమైన వనరులను మిత్ర దేశాలనుంచి సంపాదించుకోవడానికి ఈ విధానం తోడ్పడింది. కొత్తగా విముక్తిపొందిన సోషలిస్టేతర దేశాలన్నింటికి శిరోధార్యమైన అలీన విధానం నిర్మాణాత్మకమైనదీ, అభ్యుదయకరమైనదీ. ప్రపంచ చరిత్రలో సోషలిజం నిర్ణయాత్మక శక్తిగా రూపొందుతున్న ఈ కొత్తయుగంలో, మాజీ వలస దేశాల స్వాతంత్ర్యాన్ని దెబ్బతీయడానికి సామ్రాజ్యవాదం సాగిస్తున్న ప్రయత్నాలుఅంతకంతకు కష్టసాధ్యమైపోతున్న ఈ కొత్తయుగంలో, ఈ అలీన విధాన సాఫల్యానికి ప్రధానంగా సోషలిస్టు శిబిరం మనుగడ, దాని తోడ్పాటు ఎనలేని సహాయం చేస్తున్నాయి.

దేశంలోని అభ్యుదయకర శక్తులు ఈ విధానాన్ని కాపాడుతూ, దీనికి వ్యతిరేకంగా అభివృద్ధి నిరోధక శక్తులు తీసుకొచ్చే వత్తిడులను త్రిప్పికొడుతూ వుంటాయి. (సశేషం)

మాంటిసోరి స్కూలు సాహితీ సమితి

డాక్టర్ కె. యల్. రావుచే ప్రారంభోత్సవం

విజయవాడ, జూలై 21

స్థానిక మాంటిసోరి శిశు విద్యాలయం సాహితీ సమితికి నిన్న సాయంత్రం కేంద్ర ఇరిగేషన్ మంత్రి డాక్టర్ కె. యల్. రావు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంలో జరిగిన సభకు డాక్టరు కొమర్రాజు అచ్చమాంబ అధ్యక్షత వహించారు. ప్రిన్సిపాల్ శ్రీమతి వి. కోటేశ్వరమ్మ స్వాగతపత్రం సమర్పించారు.

విద్యార్థినులు కోలాటం, మయూర నృత్యం ప్రదర్శన లిచ్చారు.

పాఠశాల నిర్వహణను, బోధనా పద్ధతులను డాక్టరు కె. ఎల్. రావు ప్రశంసించారు. ఈపాఠశాలలను [illegible]లోకూడా ఏర్పాటు చేయవలసిందిగా నిర్వాహకులకు సలహా యిచ్చారు. పాఠశాల అభివృద్ధికి తాము సర్వశక్తులా సహాయ సహకారా లిస్తామన్నారు.

దాస్‌కమిషన్ నివేదిక పరిశీలనకుప్రత్యేకాధికారి

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం

న్యూఢిల్లీ, జూలై 21

దాస్ కమిషన్ నివేదికలోని మిగిలిన పని చూడటానికి, ఇటీవలవరకూ ప్రణాళికా సంఘ సలహాదారుగా పని చేసిన శ్రీ ఆర్. ఎస్. కృష్ణస్వామిని ప్రత్యేకాధికారిగా నియమించడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ నియామకానికి శ్రీ కృష్ణస్వామి అంగీకరించినట్లు తెలుస్తోంది.

దాస్ కమిషన్ నివేదికలో ఆరోపణలు చేసిన వ్యక్తుల కేసులను విడదీసి ఆయా అధికారులకు శ్రీ కృష్ణస్వామి పంపిస్తారు.

ఈ కార్యాలయం చండీగఢ్‌లో ఉంటుంది.



విశాలాంధ్ర

మహిళాభ్యుదయం

స్త్రీలలో విద్యాభివృద్ధికి మహిళాక్లబ్ ల కర్తవ్యం

విద్య నభ్యసించాలనే కోర్కె స్త్రీలలో ఈనాడు ఎంత ఎక్కువ ఉన్నదో తెలిపే దృష్టాంతరాలు ఎన్నైనా చూపవచ్చును.

విజయవాడలోని భారత మహిళామండలి అధ్వర్యాన, నిరాశ్రిత స్త్రీలకు మెట్రిక్ పరీక్షకు రెండుసంవత్సరాల సంక్షిప్త తరగతులు నడుపబడతాయని, 25 మందికి ఉచిత భోజన విద్యా సౌకర్యాలు కలిగించబడతాయనీ ప్రకటించారు. అనేక జిల్లాలనుండి నూట, మూట యాభై మంది యువతులు ఈ అవకాశాన్ని పొందగోరి వ్యయ ప్రయాసలపడి వచ్చారు. అవకాశం ఉన్నది 25 మందికి మాత్రమే. వచ్చినది వందలాది! అందులో ఎంత మంది, ఎటువంటి క్లిష్ట జీవిత పరిస్థితులలో జీవించుతున్నారో ఊహించలేము. వివాహితలు, అవివాహితలు పిల్లల తల్లులు భర్తలచే కాదని వేయబడిన వారు మోసాలకు గురి అయినవారు తలిదండ్రులులేని వారు. ఏదోవిధంగా మెట్రిక్ వరకు విద్య నభ్యసించితే జీవనోపాధికి ఒక మార్గం దొరుకుతుందని ఎన్నెన్నో ఆశలు పడినవారు — ఉండవచ్చు. 25 మంది మినహా మిగిలిన అందరూ వెనుకకు వెళ్ళిపోయారు. ఇటువంటి వందలు ఈనాడు తెలుగుదేశంలో ఎన్నో చెప్పలేము.

మరొక దృష్టాంతరం: నాల్గవ ఫారం చదువుతూ ఈ సంవత్సరం పరీక్ష తప్పిన ఒక బాలిక తన చదువు ఆగిపోయిన విచారకర విషయాన్ని తెలుపుతూ వ్రాసిన లేఖ (అభిప్రాయాల శీర్షిక చూడండి!) నెలకు డెబ్బై రూపాయల ఆదాయం గల కుటుంబం. ఈ చాలీచాలని ఆదాయంలోనే తిండి, బట్ట, చదువుల ఎల్లా గడుస్తాయి? దురదృష్టవశాత్తు పరీక్షపోయింది! పూర్తి జీతం కట్టాలి. ఫలితం ఈ సంవత్సరం చదువుకు స్వస్తి! చదువు కొనసాగించలేక పోతున్నానే బాధ ఆ లేత హృదయాన్ని ఎంత బాధిస్తున్నదో చెప్పలేం.

ఇదీ నేడు దేశంలో పరిస్థితి! ఒకనాడు 'ఆడదానికి' చదువు ఎందుకులే అనే దుస్థితి ఉండేది; తొలగి పోయిందని సంతోషించుదామా? చదువుకోడానికి స్త్రీలు ముందుకు వస్తూంటే, అవకాశం లేనందుకు విచారించుదామా?

చదువుకుంటానన్న ప్రతీ బాలికకు, బాలునికి, ప్రతీ యువతీ యువకునికి అవకాశాలు కలిగించే సమాజం కోసం కృషి చేయడం ప్రతిఒక్కరి కర్తవ్యం. అయితే యీలోగా ఎవరి కర్తవ్యం ఏమిటి? ఎంతవరకు?

స్త్రీ పురుషుల విద్యాభివృద్ధి మధ్యనున్న అగత్త రోజు రోజుకు పెరుగుతోంది గాని తరగడంలేదు. 1961 జనాభాలెక్కల ప్రకారం మన దేశంలో 6-11సంవత్సరాలమధ్యనున్న బాలికలు (ప్రైమరీ) 2 కోట్ల 79 లక్షలమంది; 11-14 సంవత్సరాల మధ్యవయస్సుగల బాలికలు (మాధ్యమిక) 1 కోటి 38 లక్షల మంది, 14-17 మధ్య వయస్సుగల (సెకండరీ) బాలికలు 1 కోటి 26 లక్షలమంది. 17-23 మధ్య వయస్సుగల యువతులు 23 లక్షల మంది ఉన్నారు. మనదేశంలో జనాభా ఏడాదికి 2.4 శాతం చొప్పున పెరుగుతున్నదట.

స్త్రీ పురుషుల విద్యాభివృద్ధిలో ఉన్న అగత్తను పూడ్చాలంటే స్త్రీలకు ప్రత్యేక విద్యా సౌకర్యాలు కలిగించడం తప్పనిసరి 1959 లో కేంద్ర ప్రభుత్వం స్త్రీల విద్యాభివృద్ధి పరిశీలనకు కమిటీని వేసింది. ఈ కమిటీ సిఫారసులను అమలు జేయడానికి స్త్రీవిద్య జాతీయ సమితిని ఏర్పరచింది. వీటికి అనుబంధంగా రాష్ట్రాలలో బాలికల విద్యా సమితులను రాష్ట్రప్రభుత్వాలు ఏర్పాటు చేశాయి. స్త్రీ విద్యాభివృద్ధికి ఉన్న ప్రత్యేక అవరోధాలను పరిశీలించి వాటిని నివారించడం ఈ సంస్థల కర్తవ్యం.

పాత ఆచారాలు, సంప్రదాయాలు, ఆర్థిక ఇబ్బందులు, ఉపాధ్యాయినుల కొరత, పాఠ్యాంశాలలోపం మున్నగు అనేక కారణాలవల్ల బాలికలు ఈ నాటికి ఇంకా బాలురకంటే వెనుకబడే ఉంటున్నారు. ఏ హైస్కూలును చూసినా, కాలేజీ చూసినా ఈ విషయం మనకి బోధపడుతుంది. క్లాసులో 50 మంది మొత్తం సంఖ్య ఉంటే అందులో 10 మంది ఆడపిల్లలున్నారంటే అది అద్భుతమే. అంటే కొంచెం ఇంచుమించుగా 5 : 1 నిష్పత్తిలో బాలుర-బాలికలు చదువు పొందుతున్నారని స్పష్టం.

ప్రభుత్వం ఇంకా ఎక్కువ సౌకర్యాలు కల్గించి, ఎక్కువ ధనాన్ని కేటాయించి, ఎక్కువ మంది ఉపాధ్యాయినులను తర్ఫీదుచేసి పల్లెటూళ్లకు, పట్టణాలకు వీరినిపంపి స్త్రీల విద్యాభివృద్ధికి కార్యక్రమం తీసుకోవాలి. ముఖ్యంగా వయోజనస్త్రీలకు విద్యావకాశాలు కల్పించాలి

ప్రభుత్వంపై ఇందుకు ఆందోళన చేయడంతోబాటు మహిళా సంఘాలు, మహిళా క్లబ్‌లు మొదలైన స్వచ్ఛంద మహిళా సేవా సంస్థలు ఏమిచేయాలి? అన్న విషయం ఆలోచించాలి.

ఆంధ్రదేశంలో అనేక ప్రాంతాలలో మహిళా సంస్థలు ఇందుకు కృషిచేస్తున్నాయి. ఇది అభినందించదగిన విషయం. ముఖ్యంగా మెట్రిక్ పరీక్షకు సంక్షిప్త విద్యా కోర్సులను నడుపుతున్న మహిళా సంస్థ లున్నాయి.

కాని తెలుగు దేశంలోని మిగిలిన మహిళా సంస్థలు-ముఖ్యంగా క్లబ్‌ల విషయం ఏమిటి? ఎన్ని క్లబ్‌లో స్త్రీ విద్యాభివృద్ధి కార్యక్రమం వేసుకొని నడుపుతున్నాయి? సరసా కోసం వినుదులు, వినోదాలకోసమే నేడు ఎక్కువ సంఖ్యలో మహిళాక్లబ్‌లు వినియోగించబడుతున్నాయేమో

ఇండొనేషియాలో మహిళా క్లబ్‌లు స్త్రీల పురోభివృద్ధికి ఏవిధంగా పాటుపడుతున్నాయో ఇదే పంచికలో మీరు చదువుతారు.

వినోదం, ఆటలు, పాటలు, నాటకాలు వార్షికోత్సవ సంరంభాలకు మాత్రమే పరిమితం అవుతున్న క్లబ్‌లు అందులో విధిగా స్త్రీల విద్యాభివృద్ధి కార్యక్రమం చేర్చాలి.

వారు వయోజనస్త్రీలకు చదువను వ్రాయను నేర్పే తరగతులను నెలకొల్పవచ్చు. వివిధ వృత్తులను నేర్పవచ్చు. 8 వ తరగతి వరకు లేదా స్కూలుఫైనల్, మెట్రిక్ వరకు ప్రయివేటుగా చదువు చెప్పవచ్చు పుస్తకాలు ఉచితంగా యివ్వవచ్చు. ఈ విధంగా ఎక్కువ మంది యువతులు చదువు నభ్యసించడానికి ప్రయివేటుగా పరీక్షలు ప్యాసుకావడానికి తోడ్పడవచ్చును.

కోటి స్త్రీలపట్ల తమ కర్తవ్యాన్ని నెరవేర్చడానికి, తద్వారా దేశంపట్ల తమ కర్తవ్యాన్ని నిర్వహించడానికి మహిళా క్లబ్‌లను నిర్వహించుచున్న సోదరీమణులు పూనుకుంటారా?

—హితైషి

బంగాళాదుంపలు చెక్కి ఎండబెట్టేయంత్రం

హాలెండులోని అస్టరన్‌లోని ఇష్టీ కంపెనీవారు బంగాళాదుంపలు తరిగి, అవెంటనే ఎండబెట్టడానికి అనువైన యంత్రాన్ని కనుగొన్నారు. పదిహేను సెకండ్లలో 6 పౌనులు, 11 పౌనుల దుంపలు, తరగగల రెండురకాల యంత్రాలు దీనిలో వున్నాయి. తరిగినదుంపలను ఎండబెట్టి వినియోగించినప్పుడు వానిని వేయించడానికి తక్కువ వ్యవధి పడుతుంది. మాడె ఎక్కువ తీయదు. వాసన వుండదు. ముక్కలు తెల్లగా వుంటాయి. 13 లేదా 22 పౌనులు తరగగల,ఎండబెట్టగల వేర్వేరురకాల యంత్రాలనుకూడా వీరు సప్లయిచేయగలరు.

గ్యాస్ పైపులకు 'చెక్' వాల్వు

హాలెండ్ దేశం అమస్టర్ డాంలోని జి.ఎల్. లూస్ కంపెనీవారు పైపులో గ్యాస్ వెనకకు రాకుండా నివారించే కొత్తరకం చెక్ వాల్వును కనుగొన్నారు. వాల్వులు - బర్నర్లకు మధ్య పైపులో వచ్చే ఏరకమైన వత్తిడిని అయినా యిది తట్టుకొనగలదు. అన్నిరకాల బర్నర్లకు దీనిని ఉపయోగించవచ్చు.

అభిప్రాయాలు

ఆడపిల్లలకు స్కూలు ఫైనల్ వరకు ఫీజు లేదన్నారే కాని ఒక సంవత్సరం దురదృష్టవశాన ఫెయిల్ అయితే పూర్తి జీతం, స్పెషల్‌ఫీజు వసూలు చేస్తున్నారు. ధనవంతులైతే ఫీజులు వసూలు చేసినా పరవాలేదు. కాని ఒక కుటుంబం రు 70 లు జీతంతో బాధ బాధన్న పరిస్థితులలో ఫీజులు, బట్టలు, పుస్తకాలు, జరిమానాలు, ఇంకాకొన్ని స్కూళ్ళలోరకరకాలైన రికార్డులు. రికార్డులు కొనకపోతే స్కూలుకు రావద్దు అనేనిర్బంధాలు ఈ విధంగాఉంటాయి. అసలు బడికివెళ్లునప్పుడు సామాన్యుడు తన పిల్లలకు నూలుబట్టలు రెండు మూడు జతలు కన్నా ఎక్కువ కొనలేరు. అవి పుతికి పిల్లలు వేసుకొని వెడితే "ఇస్త్రీ" మడతలు కావని కోటి విద్యార్థినులు ఎగతాళి చేస్తారు. టీచర్లుకూడా సీరసంగా చూస్తారు. ధనం ఉండేనే, ఖరీదైన బట్టలు వేసుకుంటేనే గౌరవం. అందరూ సమానమనిగాని, పేదవారిని కనిపెట్టి చూడాలనికాని ఏకోశానా ఉండటంలేదు. బీద బాలికల బ్రతుకులు చాలా అన్యాయంగా ఉన్నాయి ఇటువంటి పరిస్థితులలోఉన్నవారికి పూర్తి ఉచిత విద్యావకాశాలు కల్గించకపోతే వారు విద్యాభ్యాసం చేయడం సాధ్యంకాదు పొరపాటున, లేక అనేక అవాంతరాల వలన ఒకసారి తప్పినప్పటికీ పూర్తి ఫీజు కట్టాలని విధించరాదు. తల్లిదండ్రులు లేని పిల్లలకు చదువుకోవలయునని ఉన్నప్పటికీ కుటుంబ పోషణ జరుగుట కష్టంగా ఉన్నప్పుడు జీతాలు ఏ విధంగా తేగలరు? నేను ఫెయిల్ అగుట వల్ల ఈసంవత్సరం నా చదువు ఆగిపోయింది.

— కళ, యల్లాయపాలెం.

బోర్డు హైస్కూళ్ళలో కూడ యూనిఫారమ్ దుస్తులు

"కుమారి" శీర్షికలో హైస్కూళ్ళలో ఇన్నాళ్ళకు యూనిఫారం దుస్తులు వచ్చినందుకు పరిస్థితి మెరుగుపడిందని అన్నారు. కాని, అన్ని స్కూళ్ళలో ఈ యూనిఫారం రాలేదు. ముఖ్యంగా చిన్న పిల్లల స్కూళ్ళలో, పరిషత్ హైస్కూళ్ళలో యిటువంటి యూనిఫారం దుస్తులు వుంచిన పరిస్థితులు చాలా మెరుగు పరచామని చెప్పవచ్చుననుకుంటా హైస్కూలు విద్యార్థినులు కాని, విద్యార్థులు కాని కాస్త విజ్ఞానం, ఆలోచనా శక్తి వారికి వుంటుంది. కాని చిన్న పిల్లలకు హైస్కూలు విద్యార్థులకున్న ఆలోచనా శక్తికాని, విజ్ఞానం కాని వుండదు.

పిల్లలను మనము చాలా మందిని చూస్తున్నాము. ధనవంతుల పిల్లలు మంచి దుస్తులు సిల్క్‌గా వేసుకొని వస్తారు. అటువంటి వారిని చూచిన బీద పిల్లలు, మాకు లేవన్నబాధ యుండుటవల్ల, వారు మంచి దుస్తులు కావాలని లేకున్న స్కూలుకు పోమని మంకు పట్టు పట్టెదరు. వారి నాన్నగారు తెస్తే మన నాన్న మనకు అలాంటి గుడ్డలు ఎందుకు తేలేదని ఆలోచించుచూ వుంటారు.

పాపం! వారికి "మనం బీదవారము, డబ్బు మన నాన్నగారివద్ద లేదు. ఎలా తేగలరన్న ఆలోచనాశక్తి వారి కెలా కల్గుతుంది?" అటువంటివాటికి అవకాశాలు ఇవ్వకుండా వుండాలంటే ముఖ్యంగా బోర్డు హైస్కూళ్ళలో "యూనిఫారం దుస్తులు ప్రవేశపెట్టాలి అట్లు వుంచిన మనమంతా ఒకటే అన్న అభిప్రాయం పిల్లలకు కలుగుతుంది. ఇంటివద్ద తలిదండ్రులకు బాధ తగ్గుతుంది.

ఈ శీర్షికలో ముఖ్యంగా హైస్కూళ్ళను, కాలేజీలను గుర్తులో వుంచుకొనే వ్రాశారు. బోర్డు హైస్కూళ్లలో యూనిఫారం దుస్తులు వుండాలని వ్రాయలేదు. అన్నిటిలోను వుండాలని వ్రాసినుండే బాగుండేది.

ఇంకా ఇలా వ్రాశారు. మంచి దుస్తులు వేసుకొన్నా హేళన చేస్తారని, రిమార్కులు చేస్తారని వ్రాశారు. అవికూడా జరుగుతూ వుంటాయి. కాని మనముముఖ్యంగా కాలేజీకానీ, ప్రయివేటుస్కూళ్ళుకాని, పరిషత్‌స్కూళ్ళలో కాని వంద మంచి దుస్తులు వేసుకొన్నా. కొత్తరకం గుడ్డలుకాని, ఫ్యాషన్‌గా దుస్తులుకుట్టించుకొన్నవారిని పరిశీలిస్తూ చూస్తూ వుంటారు. అది ఎలా కుట్టారు అనో ఎలాగనో వారి ఆలోచనలుబట్టి వుంటుంది. కాని ఉపాధ్యాయుడు బోధించే పాఠాలమీద దృష్టి వుండదు. అటువంటి వేవో ఆలోచిస్తూ వుంటారు. అటువంటి ఆలోచనలకు అవకాశం లేకుండా చేయాలంటే అన్నింటిలోను యూనిఫారం దుస్తులు వుండాలి. అట్లు వుంచి నప్పుడుకాని మనము అభివృద్ధిపరచుకొనవలయునన్న విద్య అభివృద్ధికాదు.

అందరూ ఒకేరకమయిన దుస్తులు వేసుకొన్నా. అలా ప్రత్యేకంగాపరిశీలించి చూడవలసిన అవసరము వుండదు. చూడటానికి చాలా ఆకర్షణీయంగా ఉంటుంది.

—నిర్మల

చీమలవాగుపల్లి, అనంతపురం జిల్లా.

జూలై 31 న రాజమండ్రిలో ఉదయం 9 గంటలకు విక్రమహాలులో మంత్రి శ్రీ యం. ఆర్. అప్పారావుగారి అధ్యక్షతన ఆంధ్ర ప్రదేశ్ వరకట్న నిషేధ ప్రచార ప్రథమ సభ జరుగును. కావున ఈ విషయమునందాసక్తిగలవారే గాక సేవాసంస్థలు, మహిళా సమాజములన్నియు ఇందు పాల్గొనవలసిందిగా ఆహ్వాన సంఘాధ్యక్షురాలు శ్రీమతి అద్దేపల్లి వివేకానందదేవిగారు తెలియజేయుచున్నారు.

కాలేజీలలో కూడా

16 వ తేదీ మహిళాభ్యుదయం"కుమారి"లో యూనిఫారం గూర్చి చర్చజాగానే వున్నది. హైస్కూల్ దశలో యూనిఫారం దుస్తులువచ్చి పరిస్థితి కొంత మెరుగైనదన్న మాట వాస్తవమే. కాని కాలేజీలో యూనిఫారం సమస్య విజయవంతం అవుతుందా? అని నా అనుమానం. కాలేజీలకు వచ్చే వారిలో అధిక సంఖ్యాకులు కొంచెం కలవారే. పోతే ఏ కొద్దో గొప్పో పేద, మధ్యతరగతి విద్యార్థులుగూడా చుట్టూ అలుముకొన్న వాతావరణానికి అలవాటు పడినవారుగూడా ఆ మోజులోకే దిగుతున్నారు. ఈ పరిస్థితిని మార్చాలంటే కాలేజీలలోకూడా యూనిఫారాలు తప్పక ప్రవేశ పెట్టాలి.

శ్రీమతి అడవికొలను పార్వతిగారి 'నేటి సమాజ వ్యవస్థ' వ్యాసం చాలా బాగుంది. వరకట్నాల నిషేధం గురించి వేదికల నెక్కి ఉపన్యాసములు ఇచ్చే నాయకులే లోలోపల వరకట్నాలు పుచ్చుకుంటుంటే ఇక అది ఎలా విజయవంత మౌతుందో అర్థం గావటం లేదు.

వట్టిమర్తి, నల్లగొండ జిల్లా.

గ్రుడ్ల విచ్ఛేదనయంత్రం

హాలెండులోని ఇన్స్‌కంపెనీవారు ఒకేదఫా 360 గ్రుడ్లను పగలగొట్టగల యంత్రాన్ని కనుగొన్నారు. గ్రుడ్లు వరసగావస్తూ, పగిలి — వాటిలోని సొన ఒకవైపున, కాళీగుడ్డు మరొకవైపున పడిపోతాయి. దీనిలో నిదుమ్మును కూడా సులభంగా తీసి, కడిగి, తిరిగి వాడవచ్చు. దీనికి రివిలన్ మోటారు, ఎలాక్ట్రానిక్ బ్రేక్స్ వున్నాయి. ఒకేదఫా 75 గ్రుడ్లను చేధించగల చిన్న తరహాయంత్రాలను కూడా వీరు సప్లయి చేయగలరు.

మనలో మనం

మనకంటే ఎంతో వెనుకబడి ఉన్నదేశం ఇండొనేషియా. కాని శరవేగంతో మనలను అందుకుంటూన్నట్టు అక్కడ స్త్రీలు సాధించుతున్న అభివృద్ధిని చూస్తే స్పష్టమవుతుంది అక్కడ మహిళా క్లబ్‌లు కేవలం వినోదాలతోనే పొద్దుపుచ్చడం లేనట్లు కనుపిస్తుంది. స్త్రీ విద్యాభివృద్ధి, వృత్తి శిక్షణ బాధ్యతలను చాలావరకు నిర్వహిస్తున్నట్లు తెలుసుకోవచ్చును. మహిళా క్లబ్‌పేరు ఇండొనేషియా భాషలో "గేడుంగ్ వనిత" వనిత అనేమాట ఇండొనేషియాకు ఎల్లా వచ్చింది? భారత ఇండొనేషియా దేశాలమధ్య ప్రాచీన కాలంనుండి బౌద్ధయుగంనుండి ఉంటూవచ్చిన సాంస్కృతిక సంబంధాలను అది తెలుపుతూంది.

• • •

కొన్ని హైస్కూళ్ళలోనేకాక అన్ని హైస్కూళ్ళలోను (జిల్లా పరిషత్‌లు) బాలబాలికలకు, కాలేజీలలోను యూనిఫారం పెట్టాలని తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. శ్రీమతి నిర్మలగారు వెలిబుచ్చిన అభిప్రాయాలు సర్వజనాంగీకార మనడంలో ఏమీ సందేహంలేదు. మరి ప్రభుత్వం, అధికారులు, ముఖ్యంగా విద్యార్థినీ, విద్యార్థులు ఏమంటారో?

• • •

ఆంధ్రదేశంలో అసలు మహిళా క్లబ్‌లు ఎన్ని ఉన్నాయి? ఎన్ని క్లబ్‌లు స్త్రీల విద్యాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాయి? ఎన్ని క్లబ్‌లు వృత్తి విద్యలను నేర్పుతున్నాయి? ఆ యా ప్రాంతాల సోదరీమణులు వ్రాస్తే నేటి కర్తవ్య నిర్వహణలో మహిళాక్లబ్‌లు ఏ స్థితిలో ఉన్నవో, ఏవిధంగా ఉండాలో తెలుసుకోవచ్చు ఆ యా క్లబ్‌లుగావించుతున్న ఆదర్శ కృషి అందరు తెలుసుకోడానికి అనుభవాలను పంచుకోడానికి వీలవుతుంది.

• • •

అధికధరల సమస్య అన్ని ప్రాంతాలలో అందరినీ పీడించుతున్న సమస్యే కాని ఎందుచేతనో, సోదరీమణులు తమ తమ ప్రాంతాలలో ధరల పెరుగుదల గురించి వ్రాయలేదు. ఈ వారమైనా వ్రాస్తారని ఆశించవచ్చునా?

• • •

రాజమండ్రి లేడీస్ క్లబ్ ఆధ్వర్యాన వరకట్న నిషేధ ప్రచారం జరిగింది. ఈ కృషి అభినందనీయం నేడు సంఘంలో స్త్రీ జాతికి అవమానకరంగా తయారైన ఈ దురాచారంపై అన్నిప్రాంతాల్లో మహిళా సంస్థలు క్లబ్‌లు ధ్వజమెత్తడం అవసరంకాదా? త్వరలో రాజమండ్రి రాష్ట్రస్థాయిలో వరకట్న నిషేధ ప్రచార సదస్సు జరుగుతుందని శ్రీమతి అద్దేపల్లి వివేకానందదేవిగారు ప్రకటించారు. ఒక మంత్రి బహుశా ఇదే మొదటిసారి కావచ్చు. ఈ సదస్సుకు హాజరవుతున్నారు. ఈ సదస్సు రాష్ట్రప్రజ లందరి దృష్టి, ముఖ్యంగా మహిళ లందిరిదృష్టి ఆకర్షించుతుందనీ దిగ్విజయంగా జరుగుతుందని ఆశించుదాం.

• • •

ఎక్కువమంది సోదరీమణులు తమ తమ అభిప్రాయాలనుపంపడం ద్వారా సమస్యలపై ఆసక్తిదాయకమైన చర్చ సాగించవలసిందిగా కోరుతున్నాము



బాండుంగ్‌లో కొంతమంది ఇండొనీషియన్ మహిళలతో సోవియట్ ఉజ్బెక్ పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి ఖాయిదరోవా (ఎడమ నుండి నాల్గవవారు.)

ఇండొనీషియా మహిళల ప్రగతి

ఇండొనీషియా మహిళా సంఘాధ్యక్షురాలు శ్రీమతి హారుస్తియాతి సుబాంద్రియో ఇండొనీషియా తల్లుల ఉత్సవంలో పాల్గొనవలసిందిగా పంపిన ఆహ్వానాన్ని పురస్కరించుకొని సోవియట్ మహిళాసంఘంనుండి ఒక ప్రతినిధివర్గం రెండు వారాలపాటు ఇండొనీషియాలో ఇటీవల పర్యటించింది. అందులో ఒకరైన శ్రీమతి లూడ్మిల్లా వ్రాసిన వ్యాసం దిగువ ప్రకటిస్తున్నాం.

మేము ఇండొనీషియా నుండి తిరిగి రష్యా వచ్చిన తరువాత మమ్మల్ని చాలామంది ఇండొనీషియా పుస్తకాలలో యాత్రా ప్రచార కరపత్రాలలో జాగ్రఫీ పుస్తకాలలో, చెప్పినంత సుందరంగా ఆదేశం ఉందా? అని అడుగుతూ వచ్చారు.

దీనికి 'ఔననే' మేము విస్పష్టంగా చెబుతూవచ్చాము. మమ్మల్ని ఉక్కిరి బిక్కిరి చేసిన ఆ దేశ సుందరదృశ్యాలేకాక అక్కడ మమ్మల్ని కలుసుకున్న అనేకమందిని గురించి మా హృదయాలలోను, స్మృతుల లోను ఎన్నడూ ఉంచుకుంటాం. ఈ విధంగా మేము కలుసుకున్నవారిలో పొలాల్లో ఫ్యాక్టరీలలోపనిచేసే శ్రామిక స్త్రీలు, సభలకూ సమావేశాలకూ హాజరైన విద్యాధిక స్త్రీలు, చక్కని రంగురంగుల యూనిఫారం దుస్తులు ధరించి విద్యాలయాలకు వెళుతున్న అనేకమంది బాలబాలికలు అనేక నిర్మాణాలలో పని చేస్తున్న పురుషులు ఉన్నారు.

రెండువారాల స్వల్పకాలంలో ఒక దేశం గురించి ఏమి చూడగలం? ఏమి నేర్చుకోగలం? వినూత్నమైన విషయాలను, దీర్ఘకాల పోరాటం ద్వారా సాధించిన విషయాలను, వీటితోబాటు తాము ఎదుర్కొంటున్న సమస్యలనుచెప్పగల స్నేహశీలురుకూడా ఉంటే ఎంతైనా చూడవచ్చు.

1963 డిసెంబరు 22 వ తేదీన ఈ తల్లుల దినోత్సవం ఇండొనీషియా దేశమంతటా జరిగింది. 35 సంవత్సరాలక్రితం జరిగిన అఖిల ఇండొనేషియా ప్రథమ మహిళా మహాసభకు వార్షికోత్సవంగా ఇది జరిగింది. మొదటి పర్యాయంగా ఇండొనీషియా స్త్రీలు డచ్చి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటానికి ఈవేదికపై ఐక్యమయ్యారు" ఒకేభాష, ఒకేజాతి, ఒకే మాతృదేశం" అనే నినాదంతో వీరు ముందుకురికారు. దేశంలో ఉన్న వివిధ మహిళా సంస్థలన్నింటిని ఐక్యపరచే విశాల సంస్థ ఈ ప్రథమ మహాసభలోనే ఏర్పడింది.

మమ్మల్ని బాండుంగ్‌లోని స్త్రీల క్లబ్‌కు (గీదంగ్ వనిత) ఆహ్వానించారు ఇది ఆకర్షణీయంగా ఉన్న రెండంతస్తులభవనం అందులో సభలు జరుపుకోడానికి ఒక విశాలమైనహాలు ఉంది, మంచి గ్రంథాలయంఉంది, పఠనాలయాలున్నాయి. రిపబ్లిక్ అధ్యక్షుడు డాక్టరు సుకర్ణో ఈక్లబ్‌కుప్రారంభోత్సవంజరిపారు.

ఇండొనీషియా విముక్తి పోరాటంలోను ఆ తరువాత స్వాతంత్ర్యాన్ని పటిష్ట మొనరించడంలో బాండుంగ్ స్త్రీల సహకారానికి కృతజ్ఞతా సూచకంగా పశ్చిమ జావాలోని సైనికులు, ఆఫీసర్లు స్వయంగా ఈ భవనాలను నిర్మించి పెట్టారు.

తమపట్ల చూపబడిన విశ్వాసానికి, గౌరవానికి ఇండొనీషియా స్త్రీలు తప్పక గర్వించుతారు. తమ దేశంపట్ల సర్వేసర్వత్రా ఇండొనేషియా స్త్రీల ఆసక్తి కనబడుతూంది.

ఆ పేటికాపేదు ఇండొనీషియాలో ఉద్యోగాలు చేస్తున్న మహిళలసంఖ్య హెచ్చుతూంది. కొత్త కిండెర్‌గార్టెన్లు, క్రెషెలు నెలకొల్పడంలో మహిళా సంస్థలు చాలా ప్రముఖ పాత్రను నిర్వహిస్తున్నారు. ఈ శిశు సహాయ సంస్థలను ఏర్పరచడానికి తగిన స్థలాలను చూపటం, ఈ సంస్థలను నెలకొల్పడం, అందుకుకావలసిన విరాళాలను వసూలు చేయడం మొదగు కార్యకలాపాలను నిర్వర్తించుచుంటాయి. ప్రభుత్వం వీటికి కావలసిన పరికరాలకు, టీచర్ల జీతాలకు అవసరమైన డబ్బు యిస్తుంది.

లూడ్మిల్లా బాలభోనస్కయా

ప్రతీ మహిళాసంఘం ఇటువంటి అనేక శిశు సంక్షేమ సంస్థలను నడుపుతూ ఉంటుంది. పెర్వానీ జాతీయ సంస్థ దేశంలోని వివిధ ప్రాంతాలలో 1400 కిండర్ గార్టెన్లను నడుపుతూంది. ఇందులో ఒక్కొక్క కిండెర్ గార్టెన్లో 60 మంది వరకు పిల్ల లుంటారు. ప్రతీ గ్రామంలోను కిండెర్ గార్టెన్ నడుపడానికి సిద్ధంగా ఉంది

పగలు తల్లి దండ్రులు పనులలోకి పోతే చూసేవారు ఎవరూ లేని పిల్లలకు జకార్తా మహిళా సంఘం ఒకఆట స్థలాన్ని నిర్మించింది.

ఈ నాటి యువతరం గతంలోఉన్న అనేక అగచాట్లను పొందనవసరం లేకుండాపోయింది. 6 సంవత్సరాల ఉచిత విద్యను ప్రవేశపెట్టాము. ఉదయంపూట స్కూళ్ళను తొందర తొందరగా పరుగుపెత్తే పిల్లల్లో మగపిల్లలెంతమంది కనుపిస్తారో ఆడ పిల్లలూ అంతమంది కనుపిస్తారు. ఈ నాడు ఇండొనీషియాలో సర్వత్రా పిల్లల భవిష్యత్తు, విద్యపట్ల, ఎంతో ఆసక్తి ప్రదర్శించుతున్న విషయం కనుపిస్తుంది.

విద్యాభివృద్ధి విషయంలో మహిళాసంఘాలు ఎంతో కృషి చేస్తున్నాయి. మహిళా క్లబ్‌లు విద్యా కేంద్రాలుగా విలసిల్లుతున్నాయి ఇక్కడ స్త్రీలకు వివిధవిషయాల్లో శిక్షణగరపుతున్నారు. కిండెర్ గార్టెన్లలో పనిచేసే టీచర్లుగా, టైపిస్టులుగా, సెక్రటరీలుగా, శిక్షణ యిస్తున్నారు. విదేశభాషలు నేర్పుతున్నారు. రకరకాల వృత్తి విద్యలు, నేర్పుతున్నారు. వీరు తిరిగి యితరులకు ఈ రకమైన శిక్షణ యివ్వడానికి అవకాశం ఏర్పడుతూంది.

వివిధ వృత్తులలో విద్యలలో శిక్షణ పొందిన స్త్రీలసంఖ్య ఆనాటి కంటె హెచ్చుతూంది. తల్లుల దినోత్సవం రోజున కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న 100 మంది ఉద్యోగినులు పాల్గొన్న సమావేశం ఒకటి జరిగింది. స్త్రీలు సాధించిన అభివృద్ధిని జూసి మేము ఆనందపడకుండా ఉండలేక పోయాము. సలామాఆదిపురి అనే యువతి ఇటీవల జకార్తా యూనివర్శిటీలో ఫార్మస్యూటికల్ డిగ్రీ పొందింది. ఆమె యిప్పుడు క్వినైన్ తయారు చేస్తున్న ఒక ఫ్యాక్టరీ విభాగానికి అధిపతిగా పనిచేస్తున్నది.

మేము ఇండొనీషియా పార్లమెంటు మహిళాసభ్యులను, మున్సిపల్ కౌన్సిలర్లుగా ఉన్న స్త్రీలనుకూడా కలుసుకున్నాం, వివిధపార్టీలకు, రాజకీయ సంస్థలకు నాయకత్వం వహించుతున్న మహిళలనుకూడా మేము కలుసుకున్నాము. హరుస్తియాతి సుబాంద్రియో ఇండొనీషియా మహిళా సంఘాధ్యక్షురాలుగానే గాక, ఆరోగ్యశాఖ డిప్యూటీ మంత్రిగాకూడా ఉంది. విదేశాంగ శాఖ డిప్యూటీ మంత్రిగా పనిచేస్తున్న శ్రీమతి సుపాని, పార్లమెంటు సభ్యురాలు, పర్వానీ అధ్యక్షురాలు అయిన శ్రీమతి ఉమిసార్జొనో, ఇంకా ఇతర ప్రముఖ మహిళలను కలుసుకున్నాము. సోవియట్ ఇండొనీషియాల మధ్య స్నేహసహకారాలను పెంపొందించడానికి ఉభయదేశాలస్త్రీలు ఉమ్మడిగా కృషిచేయాలని వీరందరూ తమ అభిప్రాయాలను నొక్కిచెప్పారు.

ఇండొనేషియా మహిళా సంస్థలు కేవలం విద్యాభివృద్ధి కార్యక్రమాలకే తమ కృషిని పరిమితం చేయటంలేదు.

ఇండొనేషియాలో ప్రస్తుతం 1960 లో ప్రవేశపెట్టిన వ్యవసాయ సంస్కరణలను అమలు జరపడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అందుచే ఇండొనేషియా మహిళా సంఘం దేశంలోని వివిధ మహిళా సంఘాల నాయకురాండ్రకు ఈ భూ సంస్కరణల సమస్యపైని ఒక గోష్ఠిని ఏర్పరిచారు. కుటుంబంలో స్త్రీలకు సమానత్వం, మహిళా ఉద్యోగినులకు,

(మిగతా 6 వ పేజీలో)

2000 వ సంవత్సరంలో స్త్రీల జీవిత మెలా ఉంటుంది?

ఫ్రెంచి మహిళల పత్రిక "యాంటిమొనెట్టీ" లో ఇక 38 సంవత్సరాల తరువాత అనగా 2000 వ సంవత్సరంలో స్త్రీల జీవితం ఏవిధంగా ఉండేదీ వివరించే ఒక "ఊహాచిత్రం" ప్రకటించింది. శాస్త్రీయ విజ్ఞానం వల్ల కలిగిన ఫలితాలు ఏ విధంగా ఉంటాయి? స్త్రీల జీవితాల్లో ఎటువంటి మార్పులు వస్తాయి? శాస్త్రీయ విజ్ఞానానికి - మానవ సౌఖ్యానికి ఉన్న సంబంధం ఏమిటి? ఈ ప్రశ్నలను ఈ వ్యాసంలో లూసియన్ బెర్నియర్ వివరించారు.

శాస్త్రీయ విజ్ఞానం పట్ల స్త్రీలకు రెండు దృక్పథాలుంటాయి. వయసు మళ్ళినవారైతే విజ్ఞాన శాస్త్రం గురించి ఒక రకమైన భయం. ఎందుకంటే శాస్త్రపరిశోధనల వలన అనేక కొత్త కొత్త విషయాలతోబాటు మారణాయుధాలుకూడా అనేకం కనిపెట్టబడినాయి. ఆధునిక జెట్ యుద్ధ విమానాలు, అణుబాంబులు మొదలైన విధ్వంసక సాధనాలు కనిపెట్టబడినాయి. యుద్ధ బీభత్సం చాల చూశారు, అనుభవించారు.

కాని యువతులదృష్టి ఇందుకు భిన్నంగా ఉంది. అణుబాంబు ప్రయోగం జరిగిన సమయానికి నాల్గయిదు యేళ్ల వయస్సున్నవారు ఇప్పుడు 20 సంవత్సరాలు కల్గినవారయ్యారు. వారికి జ్ఞానంవచ్చిన తరువాత మానవుడు అంతరిక్షయానం చేయడానికి, ఇ.కా. ప్రకృతి రహస్యాలను కనుగొనడానికి శాస్త్రీయవిజ్ఞాన పరిశోధనలు వినియోగపడటం చూశారు. సోవియట్ రష్యా మొదటి స్పుత్నిక్ ఎగురవేసే సమయానికి వారికి బహుశా 15, 16 ఏళ్ళ కంటె ఎక్కువ వయస్సులు వుండవు. అందుచేత ఆధునాతన మారణాయుధాలవలన కలిగిన బీభత్సంకంటే ఆధునిక శాస్త్రీయ విజ్ఞాన పరిశోధనల సత్ఫలితాలను ఈ యువతరంవారు ఎక్కువ గమనించుతున్నారు. సైన్సుపట్ల విశ్వాసం, అభిమానం వారిలో ఎక్కువగా వుంది.

"సొరబన్ యూనివర్శిటీ లెక్కలు తీసి చూస్తే ఎక్కువమంది యువతులు సైన్సు సబ్జక్టులే తీసుకుంటున్నారనీ. అట్టి వృత్తులనే అధికంగా అభిలషించుచున్నారనీ తేటతెల్లమవుతూంది. గత సంవత్సరం జీవశాస్త్రంలో బహుమతి ఒక యువతికి రావడం యాదృచ్ఛికం కాదు.



శాస్త్రీయ విజ్ఞానం ఈనాడు ఎటువంటి దశకు వచ్చిందంటే ఈ భూగోళాన్ని ఉన్నట్టుండి మసి, నుసిచేయగలదు, కోట్లకొలది ప్రాణాలను భస్మం చేయగలదు, లేదా అత్యద్భుతమైన "ఆపరేషన్" చేసి ప్రాణాన్ని రక్షించగలదు. అన్ని దేశాలు కలిసి కట్టుగా వ్యవహరించితే మహాసముద్ర ప్రవాహాలు, రుతుపవనాలను మార్చివేయగలదు.

లూసియన్ బెర్నియర్

(ఫ్రెంచి పత్రికా రచయిత్రి)

భవిష్యత్తులో రాగల మార్పులు

వచ్చే 38 ఏళ్ళలో అనేక పనులను యంత్రాలేచేస్తాయి. ఇప్పుడుకూడ కొన్ని దేశాలలోసోవియట్, అమెరికాదేశాలలో ముందుగానే తయారు చేయబడిన విధిరాగాలతో రెండు రోజులలో యిళ్ళు నిర్మించే యంత్రాలు పని చేస్తున్నాయి.

భవిష్యత్తులో క్రమోపదడంలో స్త్రీ పురుషుల మధ్య వివక్షఉండదు. స్త్రీలు అభిరుచులనుబట్టి వారి శారీరక పరిమితులనుబట్టి ప్రస్తుతం స్త్రీలు పురుషులు చేసే పనులలో తేడా కనుపిస్తూంది.

2000 వ సంవత్సరంలో బట్టలను కుట్టడం అనే సమస్య ఉండదు. బట్టలను కుట్టేవారు బట్టలను సరాసరి కుట్టియిచ్చే యంత్రాగారాల్లో బహుశా పనిచేస్తారు. ఎవరికి ఏ కొలత ఏయే ఫ్యాషన్లలో కావాలంటే ఆ విధంగా పట్టి యివ్వగల యంత్రాలు తయారవుతాయి. అందుచేత బట్టలుకుట్టే స్త్రీలు-ఇంజనీర్ల స్థాయికి చేరిపోతారు.

ఎలక్ట్రానిక్ టెలిఫోన్ అప్పుడే వాడుకలోకి వచ్చింది. అందుచేత ఇకముందు టెలిఫోన్ ఆపరేటర్లు అసలు ఉండరు.

టైపు చేసేవారు, షార్టు హాండ్ వ్రాసేవారు ఎక్కువమంది అవసరం ఉండదు. రికార్డర్లు, టైపురైటర్లు ఎలక్ట్రానిక్ మెదడులు ఇప్పటికంటే శీఘ్రగతిని ఆ పని చేస్తాయి. స్టెనోటైపిస్టు కాని, కార్యదర్శి కాని చేసేపని ఈ అన్నిటిని ఒకచోటకు చేర్చడమే.

ఆరోగ్య సౌకర్యాల విషయంలో ఎలక్ట్రానిక్ మెదడు అంటే "మరమనిషి" వచ్చి ఒక రోగి టెంపరేచర్ చూడగలదు. రోగ నిదానమూ చేయగలదు. రోగిని మానసికంగా కులాసాగా ఉంచడానికి మాత్రం నర్సులు అవసరమవుతూఉంటారు.

పని గంటలు అన్ని కార్యాలయాల్లోను తగ్గిపోతాయి.

ఫ్యాషన్లు ఏమవుతాయి?

ముందుముందు ఫ్యాషన్లు ఎల్లామారతాయి? బట్టలు ఎల్లా ధరిస్తారు? వేసవి కాలంలో చల్లగా ఉండేటట్టు. శీతాకాలంలో వెచ్చగాఉండేటట్టు చర్మంపై ఒక రకమైన కొత్త చర్మాన్ని - అంటే కృత్రిమంగా తయారు చేయబున్న దానిని మానవుడు ధరించగలడు. 2000 సంవత్సరం రాకముందే ఆటువంటి కొత్తరకం దుస్తులను మానవుడు కనిపెట్టగలడు.

శారీరక సౌందర్యం, సౌష్టవం గురించి ఎక్కువశ్రద్ధ తీసుకుంటారు. మనిషి రెక్కలు కట్టుకొని ఎక్కువదూరం ఎగరటానికి వీలుగా కండరాలను తర్ఫీదు చేయడానికి అవకాశాలు ఏమిటో ఒక సోవియట్ శాస్త్రజ్ఞుడు పరిశీలించు తున్నాడట. అనేక కొత్తరకాలైన ఆటలు, ఇప్పుడు మనం - ఊహించడానికి కూడా వీలులేనివి కనిపెట్టవచ్చు. శరీరం అనేక రీతులలో కొత్తరకంగా అభివృద్ధి చెందగలదు.

పారిస్‌లో కాపరం, సిడ్నీలో పని

అంతేకాదు 2000 వ సంవత్సరంలో జీవించే పౌరుడు ఎంతో ఎక్కువ దూరాలకు ప్రయాణించవచ్చు. పారిస్‌లో కాపరం. డబ్లిన్ (ఐర్లండ్) లేక సిడ్నీలో (ఆస్ట్రేలియా) పని చేసుకుంటూ ఉండవచ్చు. ఈనాటి రవాణాకు ఆనాటి రవాణాకు ఎంతతేడా ఉంటుందంటే 1920 లో ఉన్న రవాణా సాధనాలకు ఇప్పటి రవాణా సాధనాలకు ఎంత తేడా ఉందో అంత తేడా ఉంటుంది. రాకెట్ శక్తితో నడిచే విమా



(మిగత 5 వ పేజీలో)

వరకట్న నిషేధ ప్రచారసభ

రాజమహేంద్రవరం లేడీస్ క్లబ్‌లో

రాజమహేంద్రవరం లేడీస్‌క్లబ్‌లో ఇటీవల శ్రీమతిసత్తూ రామమోహనరావుగారిఅధ్యక్షతన వరకట్న నిషేధ ప్రచారసభ జరిగింది. శ్రీమతి అద్దేపల్లి వివేకానందదేవిగారు సభను ప్రారంభిస్తూ యీ విధంగా ప్రసంగించారు.

"ఈ మధ్య వరకట్న నిషేధంగురించి ప్రచారం ఎక్కువగా జరుగుచున్నది. మన యూనివర్సిటీలోకూడ వరకట్న నిషేధ సభ జరిగినది. ఈ నెల 31 వ తేదీన సంఘ సంస్కరణకు కేంద్రమైన మన రాజమహేంద్రవరంలో గౌ॥ మంత్రివర్యులు శ్రీ యం. ఆర్. అప్పారావుగారి అధ్యక్షతన వరకట్న నిషేధ ప్రచార రాష్ట్ర ప్రథమ సభ జరుపుటకు నిశ్చయించినారు.

నాకు ఒక మగపిల్లవాడు. ఆడపిల్లలు లేరు. నేను నా మొగపిల్లవానికి కట్నంపుచ్చుకోను. దీనిచే నాకు నూటికి 50 మార్కులు వచ్చినట్లు. అంతేకాదు నా ఆడపిల్లలకు కూడా కట్నం యివ్వదలచుకోలేదు. ఇందులో మిగిలిన 50 మార్కులు వచ్చినట్లు. కట్నం తీసుకొనడమంటే ఒకరి బాధ్యత మరియొకరి మీద పెట్టడమన్నమాట. ఎవరిబిడ్డమీద వారికి ప్రేమయుంటుంది. కట్నం రూపేణా నిబంధన ఉండరాదు. మన మొగపిల్లవానికి ఎక్కువ కట్నం రాబట్టి తిరిగి మన ఆడపిల్లలకు అంత కట్నం ఇవ్వలేకపోతున్నాము. మన అమ్మాయికి కట్నమివ్వకపోతే పెండ్లికొడుకు రాడేమోనని అనే అనుమానం ఉండరాదు. మన మహిళ

(మిగత 6 వ పేజీలో)

రేడియో

శుక్రవారం, జూలై 24
శక 1886 శ్రావణ 2

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం: 6-30 శుభోదయం, ప్రసార విశేషాలు: 6-40 ఆం. వా. 6-45 హై ర, 6-55 సూక్తిముక్తావళి, 7-00 తె.వా. 7-15 ఈ నెల పాట; 7-20 గాంధీ మార్గము; 7-45 ఎమ్. ఎస్. బాలసుబ్రహ్మణ్యశర్మ; 8-00 ఆం. వా. 8-15 హై. రిలే; 8-30 హై. రిలే; 9-00 సమాప్తి.

మధ్యాహ్నం: 11-30 రాష్ట్రీ గానం; 11-45 మాధ్యమిక పాఠశాలలకు: 12-25 వార్తలు - వ్యాఖ్యలు: 12-30 కార్మికులకు, 1-00 వనితావాణి; 1-40 హిం. వా: 1-50 తె. వా: 2-00 సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు; 6-05 ప్రాం. వా: 6-15 ప్రస్తుతాంశం; 6-20 గ్రామస్థులకు; 7-00 తె. వా: 7-15 గ్రామస్థులకు: 7-30 మ. రిలే; 7-45 సంగీత కచేరీ; 8-55 ప్రస్తుతాంశం; 9-00 ఆం. వా. 9-15 ఆంగ్లమున, 9-25 విరామసంగీతం; 9-30 హై. రిలే; 9-45 ఎమ్. ఎస్. బాలసుబ్రహ్మణ్యశర్మ: 10-30 ఆం. వా: 10-35 సమాప్తి - జన గణ మన.

హైద్రాబాద్ - ఎ

405.4 మీ (740 కిలోసై)

ఉదయం: 6-30 సుప్రభాతం, కార్యక్రమ వివరణ: 6-40 ఆం. వా: 6-45 భక్తిరంజని: 6-55 సూక్తి ముక్తావళి: 7-00 తె. వా: 7-15 సంకీర్తనం: 7-20 గాంధీ మార్గము: 7-45 సితార్. 8-00 ఆం. వా: 8-15 బృందగానం, 8-30 కర్వగం రంగాచారి, 9-00 సమాప్తి.

మధ్యాహ్నం. 11-45 మాధ్యమిక పాఠశాలలకు: 12-15 లలిత సంగీతం: 12-30 కార్మికుల కార్యక్రమం: 1-00 వనితావాణి; 1-40 హిం. వా: 1-50 తె. వా 2-00 హై. బి. వలె; 2-10 ఉ. వా: 2-30 సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు; 6-05 ప్రాం. వా. 6-15 ప్రస్తుతాంశం; 6-20 మరాఠీ శ్రోతలకు: 7-00 తె. వా: 7-15 ఖవ్వాలి: 7-30 హై. బి. వలె: 7-45 కర్ణాటక సంగీత కచేరీ: 8-55 ప్రస్తుతాంశం; 9-00 ఆం. వా: 9-15 ఉ. వా. 9-30 సాహిత్య సంచిక: 9-45 సితార్: 10-30 ఆం. వా: 10-35 సమాప్తి - జనగణమన.

హైద్రాబాద్ - బి

కడప

285.1 మీ (1130 కిలోసై)

విశాఖపట్నం

322.6 మీ (930 కిలోసై)

సాయంత్రం 6-00 నుండి రాత్రి 9-30 వరకు

39.42 మీ (3355 కిలోసై)
(హైదరాబాద్ మాత్రమే)

ఉదయం: 6-30 హై.ఎ.వలె: 7-45 సమాప్తి.

49.02 మీ (6120 కిలోసై.)

8-00 హై. ఎ. వలె: 9-00 సమాప్తి.

42.02 మీ (7140 కిలోసై)

మధ్యాహ్నం 11-45 హై. ఎ. వలె; 2-00 వాతావరణ సూచన, వాద్య కదంబం; 2-30 సమాప్తి.

సాయంత్రం: 6-00 హై. ఎ. వలె: 6-20 గ్రామస్థులకు: 7-00 తె. వా: 7-15 గ్రామస్థులకు: 7-30 జయభేరి - రూపకం: 7-45 హై. ఎ. వలె: 9-15 ఆంగ్లమున: 9-25 విరామ సంగీతం: 9-30 హై. ఎ వలె: 9-45 కర్వగం రంగాచారి: 10-30 హై. ఎ. వలె, 10-35 సమాప్తి - జనగణమన.

మద్రాస్ - బి

211.3 మీ (1420 కిలోసై)
60.98 మీ (4920 కిలోసై)

ఉదయం: 6-40 ఆం.వా: 6-45 మ.ఎ.వలె: 7-00 తె. వా: 7-15 సంగీత మంజరి: 7-30 నాదస్వరం: 8-00 ఆం. వా: 8-15 సమాప్తి.

211.3 మీ 1420 కిలోసై
41.90 మీ. 7160 కిలోసై

మధ్యాహ్నం: 12-00 కార్మికులకు: 12-30 మాధ్యమిక పాఠశాలలకు: 1-00 మాదర్ విస్పి. 1-30 ఆం. వా: 1-40 గీతమంజరి: 1-50 తె. వా. 2-00 మధుర గీతం: 2-10 ఉన్నత పాఠశాలలకు: 2-40 సమాప్తి.

211.3 మీ (1420 కిలోసై)
60.98 మీ (4920 కిలోసై)

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం: 6-00 ఆం. వా: 6-05 ప్రాంతీయ శెయిదగగ్, 6-20 వాతావరణ సూచన, స్థానిక ప్రకటనలు, వాణిజ్య వార్తలు (ఆంగ్లం), 6-30 కార్యక్రమ వివరణ (తమిళం): 6-35 ఎ. మల్లికా శ్రీధరన్. 7-00 తె. వా: 7-15 ఇతర ప్రాంతముల సంగీతం: 7-30 జయభేరి - రూపకం (తెలుగు): 7-45 వయొలిన్: 8-55 ప్రస్తుతాంశం: 9-00 ఆం. వా: 9-15 ఆంగ్లమున, 9-40 విరామసంగీతం; 9-45 పాశ్చాత్య సంగీతం, 10-30 ఆం. వా: 10-35 సమాప్తి - జన గణ మన.

దొంగలపట్టివేత

చీరాల, జూలై 18

నిన్న సాయంకాలం చీరాల రైల్వేగ్యాంగ్ పనివారూ, రైల్వే ఆర్. పి. ఎస్. సిబ్బంది కలిసి రైల్వే ఫిష్‌ప్లేటులు దొంగిలించి బండిపై ఎత్తుకుపోతున్న నలుగురిని పట్టుకొని పోలీసులకు అప్పచెప్పారు. కేసు దర్యాప్తు జరుగుతూంది.

కాకై తెనాలిలోని బాయిల హాస్టల్‌వార్డెనను అవినీతి ఆరోపణపై పోలీసులు అరెస్టుచేశారు.

పంట, మురుగు కాలువల తవ్వకాలకై రైతుల సహకారం

శ్రీ కె. ఎల్. రావు సలహాగూర్చి సమాలోచనకు గుడివాడలో ఆగస్టు 16 న రైతు ప్రతినిధుల సమావేశం

విజయవాడ, జూలై 21

శ్రీ వద్దె శోభనాద్రి, కొల్లేటి రైతురక్షణ సంఘాధ్యక్షులు శ్రీ ఎలమంచిలి భాస్కరరావు గార్లు కృష్ణాజిల్లా రైతుల కివిధంగా విజ్ఞప్తి చేస్తున్నారు.

డెల్టా సాగు సమస్యలపై ప్రత్యేకంగా రైవస్ కాలువ, ఏలూరుకాలువ, బందరు కాలువ, యూస్ట్‌బ్యాంకు కెనాలు చాలాకాలం నుండి డెల్టా హెడ్ స్లూయిసు దగ్గరనుండి త్రవ్వని కారణంగా విపరీతంగా పూడికవేసి మేటలువేసినందువల్ల నీరు ఎదుముదన్ని సాగులకు సకాలంలో సక్రమముగా నీరు అందడం లేదు. సాగులు ఆలస్యమై ఉత్పత్తి కుంటుపడి రైతాంగానికి దేశానికి అపార నష్టం కలుగుతూంది. దీనినిగురించి జూలై 20 వ తేదీన కేంద్ర జలవిద్యుత్ శాఖామాత్యులు శాస్త్రు కె. యల్. రావుగార్ని, విజయవాడ సర్కిల్ పి. డబ్ల్యు. డి. సూపరెంటెండింగు యింజనీరు గార్ని ప్రభుత్వ అతిథి నివాస గృహంలో రైతునాయకులు శ్రీ వద్దె శోభనాద్రి, కొల్లేటి రైతు రక్షణ సంఘాధ్యక్షులు శ్రీ యలమంచిలి భాస్కరరావుగార్లు కలుసుకొని వివరంగా తెలియజేశారు.

రైవస్‌కాలువ హెడ్‌స్లూయిసు మొదలుకొని విడమానూరు వరకు దాదాపు అయిదు అడుగులలోతు నిలువున పూడికవేసి పోవుట మూలంగాను, ఏలూరు కాలువ, బందరు కాలువ, యూస్టు బ్యాంకు కెనాలుగూడ పూడికవేశాయి. త్రవ్వుటు సక్రమంగా జరుగలేదు.

అలాగే చంద్రాయి డ్రైను, పోలరాజ డ్రైను, పెద లంక డ్రైను అయినంపూడి డ్రైను, లజిబంధ డ్రైను ఇంకా అనేక చిన్న డ్రైన్లు విపరీతంగా పూడిపోయి అభివృద్ధియైన ఆయకట్టులోని మురుగునీరును దిగువ కులాగ లేకపోవుటవల్ల కొన్నివేల ఎకరాలలో పైర్లు వరదలకు గురి అవుతున్నాయి. ఇందువలన అధికాహారోత్పత్తికై ప్యాకేజి పథకం క్రింద ఖర్చుపెట్టే లక్షలాది రూపాయల ధనం వృధాయగుచున్నదని శ్రీ డాక్టర్ కె. యల్. రావుగారికి తెలిపారు.

శ్రీ కె. యల్. రావు సమాధానం యిస్తూ దాళవా సాగులు ఆపి త్రవ్వులు ప్రారంభిస్తే రైతాంగానికి ప్రభుత్వానికి గూడ చాలానష్టం వాటిల్లునుగాన దాళవా సాగులకు నీరు సరవరా ఏప్రిల్ నెలాఖరుకు ఆపివేయబడునని, తిరిగి క్రొత్తనీరు వదిలేలోగా ఒక నెల గడువు త్రవ్వుటకై వినియోగించుటకు వీలగునని చెప్పారు. ఈ నెల రోజుల కాలంలో ప్రభుత్వమే త్రవ్వవనులను ప్రారంభించి పూర్తి చేయజాలదనిన్ని డెల్టా రైతాంగము ప్రభుత్వాధికారులతో త్రవ్వవనులకు కూలీలను సరఫరాజేయుచూ మరికొన్ని బాధ్యతలను వహిస్తే కృష్ణా హెడ్‌స్లూయిసు మొదలుకొని సాధ్యమైనంత ఎక్కువదూరం త్రవ్వు పనులు పూర్తిజేయుటకు సాధ్యపడునని తెలియజేశారు.

గనుక యావత్తు డెల్టాలోని రైతు సమస్యలపై పాటుబడే యావన్మంది వ్యక్తులూ పై సుదహరించిన సమస్యలనుగూర్చి చర్చించి ఒక నిర్దిష్ట కార్యక్రమమును రూపొందించుటకు, ఈ ప్రకటననే ఆహ్వానముగా భావించి గుడివాడలో ఆగస్టు 16 వ తేదీన మధ్యాహ్నం ఒంటిగంటకు గంగామహల్లో జరిగే సమావేశములో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేయుచున్నాము.

కలకత్తాలో మరొక తెలుగు పాఠశాల

కలకత్తా, జూలై 13

ఇక్కడి కింగ్ జార్జిడాక్ ప్రాంతంలో తెలుగు బోధనభాషగా మరొక ప్రాథమిక పాఠశాల తెరువబడినది. ఈ నూతన విద్యాలయమునకు కిద్దర్‌పూర్ ఆంధ్రపాఠశాల కార్యదర్శి శ్రీ పి. ఉపేంద్రచంద్రచౌదరి నిన్న ప్రారంభోత్సవం జరిపారు, ఆగ్నేయ రైల్వే అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసరు శ్రీ ఆర్. యస్. పాత్రో అధ్యక్షత వహించారు.

కలకత్తాలోని వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న తెలుగు కార్మికుల పిల్లలకు మాతృభాషలో బోధనా సౌకర్యమును కలుగచేయుటకై విశాల కలకత్తా ఆంధ్ర సమితి స్థాపించ తలపెట్టిన అనేక ఏకోపాధ్యాయ పాఠశాలలలో ఇది మొదటిది. పాఠశాలలతో పాటు ఆయాప్రదేశాలలో వయోజనుల కొరకై పఠన మందిరములను నెలకొల్పడానికి కూడా సమితి నిర్ణయించింది. అట్టి పఠన మందిరములలో మొదటి దానికి కింగ్‌జార్జిడాక్ వద్ద నిన్న శ్రీ చౌదరి ప్రారంభోత్సవం జరిపారు.

కలకత్తా నగరం చుట్టుప్రక్కల సుమారు మూడు లక్షల మంది ఆంధ్రుల విద్యాసాంస్కృతిక ఉన్నతికై ఏకోన్ముఖ కృషి జరుపడానికై నగరములోగల అనేక చిన్న చిన్న తెలుగు సంస్థలు విలీనమై విశాల కలకత్తా ఆంధ్రసమితిగా యేర్పడటానికి నిర్ణయించుకొన్నాయి. సమితికి త్వరలోనే లాంఛనంగా ప్రారంభోత్సవము జరుగనున్నది.

శ్రీ అచ్యుతరాయల స్మారక సభ

గుంటూరు, జూలై 18

ఇటీవల గుంటూరు స్వరాజ్య మైదానంలో ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి శ్రీ తులాబందుల అచ్యుతరాయల స్మారక సావనీరును విడుదల చేశారు. ఆ సందర్భంలో జరిగిన బహిరంగసభకు మున్సిపల్ ఛైర్మన్ శ్రీ సి. హెచ్. హనుమయ్య అధ్యక్షత వహించారు.

శ్రీ అచ్యుతరాయలు చైనా ఆక్రమణను ప్రతిఘటిస్తూ పీలారిడ్జివద్ద మరణించారు.

విజయవాడలో సారా కేసులు

విజయవాడ, జూలై 21

ఈ సంవత్సరం జనవరి ఒకటవ తేదీ నుంచి జూన్ 30 వ తేదీ వరకు జరిగిన 6 నెలలలోనూ విజయవాడ మద్యనిషేధ శాఖోద్యోగులు మద్యనిషేధ చట్టక్రింద 997 మందిని అరెస్టు చేశారు. వారిలో ఇద్దరు హైదరాబాదు నుంచి లారీలో విదేశీ మద్యం తీసుకు వస్తుండగా అరెస్టు చేయబడ్డారు. విదేశీ మద్యం కలిగి వున్నందుకు 10 మంది అరెస్టు చేయబడ్డారు. వారి నుంచి 263 సీసాల విస్కీ, 409 సీసాలు గోల్డెన్ ఈగిల్ బ్రాండు బీరూ స్వాధీనం చేసుకున్నారు.

కేసులలో 541 మందికి మొత్తం 23,755 రూపాయల జరిమానాలు విధించబడినాయి. 15 రోజులు నుంచి 4 నెలల వరకూ శిక్షలు 214 మందికి విధింపబడినాయి. 211 కేసులు ఇంకా విచారణలో వున్నాయి.

ఐతంపూడి వద్ద దారుణ దురంతం

తణుకు, జూలై 20

ఈ నెల 18 వ తేదీ వుదయం 8 గంటలకు పశ్చిమ గోదావరి జిల్లా ఓగిడి గ్రామ వాసి శ్రీ అదిదాల సత్యం అనే ఆయనను ఎవరో తీవ్రంగా కొట్టి, గొంతు కోసి ఐతంపూడి-పెనుగొండల మధ్య రోడ్డు ప్రక్క పారవేసి పోయారు. ఆ వార్త తెలిసి పెనుగొండ పోలీసులు వచ్చారు. కొన వూపిరితో వున్న ఆ సత్యాన్ని తణుకు ఆస్పత్రిలో చేర్చారు. చాల ప్రమాద స్థితిలో వున్నాడు.

అనుమానం మీద పోలీసులు శ్రీ వల్లా రెడ్డి, ఆయన కొడుకు సత్యనారాయణరెడ్డిలను అరెస్టు చేశారు. ఇంకా మరికొందరిని అరెస్టు చేస్తారని తెలుస్తూంది.

అగ్నిబాధితులకు వస్త్రసహాయం

విజయవాడ, జూలై 20

ఏన్న దాక్షిణ్యపాలెంలో జరిగిన బహిరంగ సభలో భారతసేవక్ సమాజం విజయవాడశాఖ వారు ఇటీవల జరిగిన అగ్నిప్రమాదాలలో నష్టపడిన సుమారు ఏభయిమందికి పాతబట్టలూ, దుప్పట్లూ అందచేశారు.

విజయవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ ఎం. ఎస్. శర్మ సభకు అధ్యక్షత వహించారు.

అరుణా జూట్ మిల్లు కార్మికుల సమ్మె

విజయనగరం, జూలై 17

విజయనగరం అరుణా జూట్‌మిల్లులో 16-7-64 న "ఏ" షిఫ్టులో ఒక కార్మికుని అక్రమంగా తొలగించినందున మిగిలిన కార్మికులు యావన్మంది సమ్మె ప్రారంభించారు. యింకా సమ్మె కొనసాగుతూనేవుంది.

పోటీపార్టీవారి అబద్ధపు ప్రచారం

బొంబాయి జూలై 18

బొంబాయి అందేరీశాఖ కమ్యూనిస్టుపార్టీ కమిటీ ప్రధాన కార్యదర్శికామ్రేడ్ అమోన్‌కర్ కామ్రేడ్ సామంతుల రాయన్నగారలు ఈ విధంగా ప్రకటిస్తున్నారు.

ది 10-6-64 జనరల్‌బాడీలో అందేరీశాఖ సమావేశం నల్లి కాశీరావు అధ్యక్షతన జరిగి, నట్లుగా సమావేశంలో నేషనల్ కౌన్సిల్ నుండి వాకౌట్ చేసిన 32 మందిని బలపరినట్లు, నేషనల్ కౌన్సిల్‌ను వ్యతిరేకించినట్లు తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించుతూ ఆంధ్రలో స్థాపించిన పోటీ కమ్యూనిస్టుపార్టీని అభినందించినట్లుగా వార్త చూచి ఆశ్చర్యపడ్డాం. కారణమేమంటే, మా అందేరీశాఖ జనరల్‌బాడీ సమావేశం 17-5-64 రోజున జరిగింది. అందులో నేషనల్ కౌన్సిల్‌ను బలపరుస్తూ 32 మందిని తిరిగి పార్టీలో చేరుమని, వారిపైన నేషనల్‌కౌన్సిల్ తీసుకున్న చర్యను పునరాలోచించుమని అప్పీలుచేసే రూపములో ఏకగ్రీవంగా తీర్మానించడమైనది. 32 మందిని బలపరచినట్లు చెప్పుకుంటున్నవారిలో నల్లి కాశీరావు ఒక్కడు తప్ప పార్టీ సభ్యులెవ్వరూ విచ్ఛిన్నకులను బలపర్చడంలేదు. ఘనపతి వెంకటరెడ్డి అను సభ్యుడు ఏనాడు పార్టీ సభ్యుడుకాదు. కాని ఈ మధ్య విచ్ఛిన్నకులను బలపర్చడానికి చాలా తాపత్రయపడుతున్నారు.

32 మందిని మా ప్రాంతం నుండి బలపరచినట్టుగ చెప్పుకుంటున్న కాశీరావు యిక్కడి ప్రజా ఉద్యమాలలో ఎన్నడూ మొగము చూపించిన పాపాన పోలేదు. అంతే కాదు, ఈ మధ్యన జోగేశ్వరి మజాన్ వాడిలో కిరాయిలు అధికంగా వసూలు చేసిన యిండ్ల యజమానులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో నల్లి కాశీరావు అద్భుత స్థానికంగా నివాసముంటూ కూడా ప్రజల పోరాటాన్ని ఐక్యపరచడానికి బదులు ప్రజలు ధైర్యం చెబుతూండగా కూడా తన యిల్లు వదలి పారిపోయ్యారు. ఎవ్వరి మంచి యిదేనేమో! అయితే విడిపోయిన 32 మంది భారతదేశంలో మాకే మెజార్టీవుంది అని చెప్పుకుంటున్నారు. అంట్లే మా ప్రాంతము నుండి బలపరచిన పార్టీ సభ్యు లటువంటివారే అయివుండాలి."

నవ్య నాటకసమితి సమావేశం

హైదరాబాదు, జూలై 15

ఈ నెల 13 వ తేదీన హైదరాబాదులో నవ్య నాటకసమితి సాంవత్సరిక సర్వసభ్య సమావేశం నారాయణగుడాలోని వై. ఎం. సి. ఏ. హాలులో జరిగింది. నూతన సంవత్సరానికి శ్రీ వి.హెచ్. వి. వి. మూర్తిరాజు, శ్రీ ఎ. చక్రపాణి గార్లు అధ్యక్షకార్యదర్శులుగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. సలహాసంఘం శ్రీ దుక్కిరాజు మధుసూదనరావు అధ్యక్షతన, శ్రీ కె. వీరరాజు అధ్యక్షతన నాటక ప్రదర్శనసంఘమూ ఎన్నుకోబడినాయి.

నవ్యసాహితీసమితి అధ్యక్షులు శ్రీ ముళ్ళపూడి తిమ్మరాజు సభకు అధ్యక్షతవహించారు.

గోస్తనీ రిజర్వాయరుకు శ్రీ కె.ఎల్. రావు శంకుస్థాపన

పని జరుగుతున్న తీరుకు మంత్రి అసంతృప్తి

విజయనగరం, జూలై 18

విజయనగరానికి సుమారు 15 మైళ్ళ దూరంలోవున్న తాటిపూడి గ్రామంవద్ద "గోస్తనీ రిజర్వాయరు ప్రాజెక్టు"ను గత 3 సం॥ములుగా నిర్మిస్తున్నారు. యిక్కడనుండి విశాఖపట్నం మున్సిపాలిటీవారికి రోజుకు 110 లక్షల గాలన్లనీరు సరఫరా చేయవలసిన (సు॥ 50మైళ్ళు) మంచినీటి రెగ్యులేటరునకు 17-7-64 న కేంద్ర ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి శాఖ మంత్రి డా॥ శ్రీ కె. యల్. రావుగారు శంకుస్థాపనచేశారు. అనంతరం సభ జరిగింది. సభకు ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ శ్రీ ఎ. యల్. నారాయణగారు అధ్యక్షత వహించారు.

ప్రారంభంలో సూపరింటెండెంటు ఇంజనీరు శ్రీ డి. సత్యనారాయణగారు ప్రాజెక్టుయొక్క ఆవశ్యకతను దాని నిర్మాణమునకు సంబంధించిన అనేక వివరాలు తెలియ చేసినారు.

అనంతరం శ్రీ డా॥ కె. యల్. రావుగారు మాట్లాడుతూ "మన దేశంలో అనేక నదులున్నవి. వాటిలో యీ నది చాలా చిన్నది. దేశంలో వున్న అన్ని నదులనుండి 1350 యూనిట్ల నీరు ప్రవహిస్తూవుంది. మనం సుమారుగా వందయూనిట్ల నీరును మాత్రం నిలువచేసుకుని మిగిలిన నీరును వదిలివేస్తున్నాం.

యీ ప్రాజెక్టు క్రింద సుమారు 15 వేల ఎకరాల భూములకు నీరు పారుతుంది. మొత్తం నీటిలో విశాఖపట్నమునకు 4 వ వంతు నీరును మాత్రం పంపుతారు. యిది 1966 నాటికిపూర్తి కావలసివున్నది" అన్నారు.

ప్రాజెక్టుపై పనిచేసే యింజనీర్లు మాత్రం. ప్లాను ప్రకారం, క్రమపద్ధతులలో పనిచేయుట లేదని 2 కోట్ల రూపాయల ఖర్చుతో యీ ప్రాజెక్టు నిర్మిస్తున్నామని ఆయనను యీ ప్రాజెక్టునుండి మిగిలిన నీరు విశాఖపట్నం అవసరాలకు సరిపోదని దానిని వేరే ఏర్పాట్లు చేసుకోవలసిన అవసరం వున్నదని అందువలన అధిక అంచనాలతో డబ్బును నిరుపయోగం చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకుని యింజనీర్లు పనిచేయాలని మదరాసు రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు కట్టినారని మన ఆంధ్ర దేశానికి యింకా చాలా అభివృద్ధి చేసుకోవలసిన అవసరం వున్నదని ప్రజలు కూడా శ్రద్ధగా పనిచేయాలని దేశాభివృద్ధికి సహకరించాలని అన్నారు. ఎగ్జిక్యూటివ్ యింజనీరు శ్రీ బి. ప్రసాదరావుగారి వందనాలతో సభ ముగిసింది.

అంతకుముందు శ్రీ రావుగారు ప్రాజెక్టు ఏరియాఅంతా 2 గంటలకాలం పరిశీలన చేసి కొన్నిచోట్ల మార్పులు చేయవలసిన అవసరాన్ని గురించి యింజనీర్లకు యీ ప్రాజెక్టులో ఉపయోగించే మట్టిని పరిశీలించి ఈ మట్టిపనికి రానిది వాడుతున్నారని అన్నారు. యిక్కడ పని పరిస్థితులు శ్రీ రావుగార్కి సంతృప్తికరంగా లేనందువలన మొదట పునాది రాయి వేయుటకు అనుమానించినారని తెలుస్తుంది.

కలెక్టరు శ్రీ విద్యాసాగర్‌గారు ఆంధ్రచీఫ్ యింజనీయర్ శ్రీమల్లిరెడ్డిగారు, విశాఖ చైర్మన్ శ్రీ టి. యస్. యస్. రాజుగారు, డా॥ యం. వి. కృష్ణారావుగారు, పబ్లిక్ హెల్తు సూపరింటెండెంటు యింజనీరు శ్రీ కె. సుబ్బారావుగారు అనేకమంది ఉద్యోగులు శ్రీ రావుగారి వెంట వున్నారు.

రాయదుర్గంలో వియ్యానికి వేసట

రాయదుర్గం, జూలై 20

రాయదుర్గంలో వియ్యం కటకటను వివరిస్తూ శ్రీ ఎం. పోలెప్పగారు ఈవిధంగా ప్రకటిస్తున్నారు.

విశాఖపట్నం మెడికల్ కాలేజి హాస్టల్స్ పనివారి సమ్మె నోటీసు

వాల్తేరు, జూలై 14

ఆంధ్ర మెడికల్ కాలేజీ హాస్టల్ పనివారి సంఘం సర్వీసు సౌకర్యాలు, జీతాలుహెచ్చింపు పనిగంటలు తగ్గింపు గురించి చేస్తున్న ఆందోళన యెడ మేనేజ్‌మెంటు చూపుతున్న నిర్లక్ష్యానికి అసమ్మతి తెలుపుతూ జూలై 24 న తేదీన ఒకరోజు సమ్మె చేయడానికై నిర్ణయించి, నేడు అధికారులకు నోటీసు ఇచ్చింది. వారి కోరికలివి:

పనివారికి ఉద్యోగభద్రత కలిగించాలి. జీతాలుపెంచాలి; హాస్టల్ భోజనశాలలో పనిచేసే స్త్రీలచేత రోజుకు 18 గంటల పని చేయించడం మానాలి. పనివారిని పెంచి పనిగంటలు తగ్గించాలి. సెలవులు వగైరా సౌకర్యాలు కలిగించాలి.

ఆంధ్ర విశ్వ విద్యాలయం హాస్టలులో పనివారల కిచ్చే జీతాలే తమకూ ఇవ్వాలని కోరారు.

సమ్మె నోటీసులు లేబర్ ఆఫీసరుకు, ప్రభుత్వం హోంశాఖ కార్యదర్శికి, జిల్లా కలెక్టరుకు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలరుకూ కూడా పంపబడినాయి.

వరకట్న నిషేధ ప్రచారసభ

(3 వ పేజీ తరువాయి)

లలో ఆత్మవిశ్వాసం రావాలి. అప్పుడే ఈదురాచారం నశించగలదు. ఇతర దేశాలలో ఈ దురాచారంలేదు మనదేశంలో ఇంకా నారెపెట్టవచ్చును వేదకాలం నాడు కూడా ఆడపిల్లలకు బట్టలు నదికి పెట్టేవారట. అవి వధువుకు అవుకూడ యిచ్చేవారట - మొన్న సుశీలానయ్యర్ చెప్పినట్లు ఆడవాళ్లు తలచుకుంటే లంచగొండితనంవలె దీనినికూడ రూపుమాపవచ్చును.

శ్రీమతి దాట్ల సత్యవతిరాజు యిలా అన్నారు. మా రాజుల కులంలో యిప్పటికీ ఈ దురాచారంలేదు. పెండ్లిముందు కట్నం అడగటంకాని, అడిగించడంకాని లేనేలేదు, పెండ్లి అయిన తర్వాత రాజ్యాలుకూడ ఆడపిల్లలకు ఇచ్చేవారు. మాలో పాత్రసామగ్రి పిల్లలకు ఎవరి తాహతకొద్దీ వారు యిస్తారు. కాని వరునిపక్షంవారు దేనినీ అడుగరు, కన్యాదాతలు యివ్వరు. స్త్రీ సహకారం లేనిదే పురుషుడు ఏమీ చేయలేడు. కావున వరకట్నాలను వ్యతిరేకిస్తూ స్త్రీలోకమంతా దృఢనిశ్చయం చేసుకోవాలి.

తరువాత ఒక మైసూరు మహిళ యీవిధంగా ప్రసంగించింది:

"ఈ దురాచారం మన దేశమంతటా ఉన్నది. మనం కట్నం అడుగుట మనకే గౌరవలోపం అని భావించాలి. మా మైసూరు రాష్ట్రంలో కట్నాల సమస్య లేనేలేదు. మాలో వేలు, లక్షలు గుమ్మరించడం లేదు. నా తండ్రికి మేము ముగ్గురు కుమార్తెలం. ఈ వరకట్న పద్ధతి ఉన్నచో మా నాన్నగారు కట్నాలు యివ్వలేక పెళ్ళిళ్ళు చేయలేక పోయేవారు. నా భర్త నా వద్దనుండి కాసీ కట్నం కోరలేదు. మొగపిల్లలు ఉంటే కట్నం వస్తుంది అని ఆడ పిల్లలకు యివ్వవచ్చునని అనుకొంటారు. మొగపిల్లలు లేని సంసారాలు ఏమి కావాలి? పేదకన్నెలు ఏమి కావాలి? అని ప్రశ్నిస్తున్నాను. కావున వివాహం అంటే పవిత్రమైన సంస్కారంగా భావించాలి. కాని డబ్బుతో దానిని ముడిపెట్టరాదు. మహిళాలోకం ముందుకు వచ్చి ఈ దురాచారాన్ని రూపుమాపాలి.

శ్రీమతి యిమాముద్దీన్ యిలా అన్నారు: మాలో 'మెహర్' అనే పద్ధతి ఉన్నది. దానివల్ల ఆడదానికి ఆధారందొరుకుతుంది, కానియిప్పుడు యిచ్చిన కట్నం వెంటనే మ్రింగివేస్తున్నారు. కావున ఏ విధంగాను యీ విధానం మంచిది కాదు.

తరువాత ఒక హెడ్‌మిస్ట్రెస్ ఈ విధంగా చెప్పారు. "భారతదేశంలో స్త్రీ జీవితమంతే కత్తిమీద సాములాంటిది. పెండ్లికాని ఆడపిల్లలను ఏదోత్రోవ పట్టించడానికి ప్రయత్నాలు చేస్తారు. నిగ్రహంగా జీవితంగడపడం చాలాకష్టం. కావున వివాహ సమస్య సులువుగా పరిష్కారం కావాలి. కావున యీ కట్నాల పీడ పోవాలి. స్త్రీకి కొంతచదువు చెప్పించిన తరువాత మానివేస్తున్నాము. ఎట్లాగైనా కట్నం యివ్వడం తప్పదు కావున పెద్దచదువు మన ఆడపిల్లలకు చెప్పించడమెందులకు అని అనుకొంటున్నారు. కావున విద్యకూడా ఆడపిల్లలకు పూర్తిగా రావడంలేదు. వరులను సంతలో పశువులవలె అమ్ముకొనుట చాలా నీచమైన పని అని వేరే చెప్పనక్కరలేదు. విద్యార్థులలో విశాలభావములు కలవు. కాని వెనుకవుండి తల్లిదండ్రులు వారిని కట్నవిషయములో తప్పుద్రోవ పట్టించుచున్నారు. తల్లిదండ్రులలో విద్య బాగా రావాలి. వారుకూడ విశాల భావములు అలవరచుకొనవలెను. అవసరమైతే మూర్ఖులైన తల్లిదండ్రులను ఎదిరించియైనా విద్యార్థులు నిలబడాలి. వారు అబ్బాయి చదువుకు అప్పుచేస్తే దానిని కొడుకు తన జీతంలో తీర్చుకుంటాను కాని కట్నం తీసుకునేందుకు ఒప్పుకోను, అని గట్టిగా చెప్పే ధైర్యం వరులలో రావాలి. లేడీస్ క్లబ్ కార్యదర్శినిగారి వందన సమర్పణతో సభ ముగిసింది.

ఇండోనేషియా స్త్రీలు

(3 వ పేజీ తరువాయి)

స్త్రీ కార్మికులకు సమానవేతనాలు, సౌకర్యాలు మున్నగు సమస్యలు మహిళా సంఘ చర్చనీయాంశాలలో ఉంటున్నాయి.

ఇండోనేసియా మహిళలు దేశంలోని ప్రతి రాజకీయ సంఘటనల్లోను ముందు శ్రేణిలోనే ఉంటారు. చక్కని రంగులలో ఉండేవారి జాతీయ దుస్తుల్లో (సారంగ్) పిల్లలను చంకను పెట్టుకొని ఇండోనేసియా మహిళలు సభలకు, సమావేశాలకు హాజరవుతారు. తమ సమస్యల గురించి, దేశ సమస్యలను గురించి చర్చిస్తారు.

మేము ఇండోనేసియాలో ఉండగా యావత్తు ఇండోనేసియా జాతిని కలవరపెట్టే రెండు ప్రధాన రాజకీయ సమస్యలు సంభవించాయి. మలేషియా ఫెడరేషన్‌ను ఏర్పరచడానికి తయారుచేయబడిన వలసవాద పథకం. అమెరికా సప్తమ నౌకాదళం హిందూమహాసముద్రంలో ప్రవేశించడానికి పథకం. ఇండోనేసియా జాతియొక్క సంఘటనలో భాగస్వాములుగా ఉన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు దేశం సమైక్యంగా ఉండాలనీ, ఒక బ్రహ్మాండమైన సభలో ఉపన్యాసాలు చేశారు.

మేము ఇండోనేసియాలో పర్యటించుచున్న అన్ని రోజులలోను మాకు అన్నిచోట్లా జాతీయ చైతన్యం, జాగృతి ప్రస్ఫుటంగా కనబడ్డాయి. ఇండోనేసియా పోరాటం ఇంకా ముగియలేదనీ, తమ దేశ స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమాధికారాన్ని కుంచించడానికి లేదా భగ్నపరచడానికి జరిగే ఎట్టి ప్రయత్నాన్నైనా సరే ప్రతిఘటించడానికి తమ లక్ష్యమైన దేశ ఆర్థికాభివృద్ధిని, సాంస్కృతికాభివృద్ధిని సాధించడానికి తాము కృతనిశ్చయులమై ఉన్నామని స్త్రీలు అన్నిచోట్లా మాకు చెబుతూ వచ్చారు.

మేము వివిధ నగరాలను సందర్శించినప్పుడు మేము కలుసుకున్న ప్రతివారూ స్నేహం, అంతర్జాతీయ సహకారం, స్వేచ్ఛా శాంతియుత జీవితాన్ని గ్యారంటీ చేయడానికి ఐక్యత అవసరమని నొక్కి చెబుతూ ఉండే వారు.

గోదావరిపై బ్యారేజి జాతీయావసరం

దాని నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూనుకోవాలని రాజమండ్రి సభలో శ్రీ కె. ఎల్. రావు ప్రసంగం

రాజమండ్రి, జూలై 19

నేడు కేంద్ర నీటి పారుదల, విద్యుచ్ఛక్తి మంత్రి శ్రీ కె. ఎల్. రావుగారు రాజమండ్రి వచ్చిన సందర్భంలో వీరేశలింగం టౌన్‌హాల్ కమిటీ వారికి స్వాగత సన్మానసభ జరిపింది.

ఆ సభలో జిల్లాయువజన సంఘం తరపున సంఘ కార్యదర్శి శ్రీ సప్పారపు చెల్లారావు రైలు రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రంలో కృషిచేయాలనికోరుతూ మెమోరాండం ఇచ్చారు.

అలాగే ఉభయ గోదావరి జిల్లాల రైతుల తరపున శ్రీయుతులు చింతంపాటి బచ్చిరాజు (గణపవరం) పుష్పాల రామమూర్తి గారలు ధవళేశ్వరంవద్ద రెగ్యులేటర్ బ్రిడ్జి, కొల్లేటిస్కీము, విప్పూరుడాంల నిర్మాణం చేయాలని కోరుతూ మెమోరాండం ఇచ్చారు.

స్థానిక రేటు పేయర్స్ సంఘంవారు గోదావరిపై రైలురోడ్డు నిర్మాణానికి విజ్ఞప్తిచేస్తూ మరో మెమోరాండం ఇచ్చారు.

సన్మానానికి సమాధానమిస్తూ శ్రీ కె. ఎల్. రావు రాజమండ్రివద్ద రెండో రైల్వేబ్రిడ్జి, దానితో రోడ్డు అవసరమైనదని తాము భావిస్తున్నా మన్నారు.

ఆయన రోడ్డుబ్రిడ్జికి "అప్రోచ్‌రోడ్లు" వేయవలసిన ప్రదేశాలనుచూసి, అవి బాగున్నాయనీ, స్థానిక మున్సిపాలిటీ ఆ రోడ్లను నిర్మించ పూనుకో వచ్చుననీ చెప్పారు. దానికి 5 లక్షలకన్న ఎక్కువ ఖర్చు కాదన్నారు.

18 అడుగుల రోడ్‌బ్రిడ్జి నిర్మించడానికి 225 లక్షలు ఖర్చు అవుతుందనీ, దానిలో ఒక కోటి రాష్ట్రప్రభుత్వమూ, మిగిలినది కేంద్రం, భరించలేనంటే ఉభయ గోదావరుల ప్రజలూ భరించవలసి వుంటుందన్నారు.

రైలురోడ్డు బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ సాగుతున్న ఆందోళన న్యాయమైనదేననీ, ఈ ప్రాజెక్టు పూర్తి అయితే జాతీయ హైవేలో భాగం కాగలదని అన్నారు.

గోదావరిపై 116 ఏళ్ళ క్రితం ఆనకట్టను నిర్మించిన సర్ ఆర్థర్ కాటన్ నైపుణ్యాన్ని శ్రీరావు ప్రశంసించారు దీనితో మొదలై పలుచోట్ల అటు తర్వాత కట్టిన ఆనకట్టలు కూలిపోయి రెండోమారు కట్టడం, అవసరమైందనీ, కాని, గోదావరి ఆనకట్ట నిలబడడం నిర్మాతల కౌశల్యానికి చిహ్నమనీ అన్నారు. ఆందోళన చేయడం, మెమొరాండాలివ్వడం అవసరం లేకుండానే రాష్ట్రప్రభుత్వం ధవళేశ్వరంవద్ద వెంటనే బ్యారేజినిర్మాణానికి పూనుకోవాలనీ, ధనం వున్నా లేకపోయినా జాతీయ ప్రమాదం ఏర్పడకుండా ఆ పనికి వెంటనే పూనుకోవాలనీ ఆయన అన్నారు.

పారిశ్రామికాభివృద్ధికోసం, ముఖ్యంగావిశాఖ పట్టణంవద్ద ఉక్కు కర్మాగారానికి గోదావరినుండి నీరుతోడి సరఫరా చేయడానికి అవకాశం వున్నదనీ, దానికి అయిదుకోట్లు ఖర్చు అవుతుందనీ అన్నారు. అప్పుడే సర్వేయింగ్ పూర్తి అయివుండడంచేత ఆ నిర్మాణం సులభంగానే సాగించ వచ్చునన్నారు. అది పూర్తిఅయితే రాజమండ్రి, విశాఖపట్టణముల మధ్య 120 మైళ్ళ పొడుగునా పరిశ్రమలు వృద్ధిపొందుతా యన్నారు.

కృష్ణా, గోదావరి నీటి పంపకంగురించి ఆగస్టు 17, 18 తేదీలలో న్యూఢిల్లీలో ఆంధ్ర, మహారాష్ట్ర, మైసూరు ముఖ్యమంత్రుల సమావేశం జరుగుతుందనీ, దానిలో రామపాద సాగరంవంటి పెద్ద ప్రాజెక్టుల నిర్మాణం గురించి చర్చ రావచ్చుననీ, ఒకటి రెండేళ్ళలో రామపాదసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం కావచ్చుననీ ఆయన అన్నారు.

అంతకు పూర్వం శ్రీ కె. యల్ రావుగారు ఆలమూరు బ్రిడ్జి ప్రదేశాన్నీ, ఏలేరు రిజర్వాయరు ప్రదేశాన్నీ పర్యటించి వచ్చారు.

టౌన్‌హాలులో జరిగినసభకు శాసనసభ్యులు శ్రీబోయల వీరభద్రరావు అధ్యక్షతవహించారు.

మహిళాభ్యుదయం
విశాలాంధ్ర
విజయవాడ-4

2000 వ సంవత్సరంలో స్త్రీలు

(3 వ పేజీ తరువాయి)

వాటను ఈనాడు మనం ఎక్కువకాలమని 1920లో ఉన్నవారెవరైనా అనుకున్నారా? పారిస్ నుండి మాస్కో వెళ్ళాలంటే 3 గంటలు పారిస్‌నుండి న్యూయార్క్ వెళ్ళాలంటే అయిదు గంటలు పడుతుంది. కాని అణుయుగంలో ఈ దూరాలు అయిదారు నిముషాలకంటె ఎక్కువ పట్టవు. టోకియో వెళ్ళడానికి 20 నిముషాలకంటె ఎక్కువ పట్టదు.

మనం ఎన్నేళ్ళు జీవిస్తాం?

శాస్త్రీయ జ్ఞానంఅంటే మనం అపనమ్మకంగా చూడవలసిన పనిలేదు రాచకురుపువేసి ఎవరైనా చనిపోతే రాచకురుపు నివారణకు తగు చికిత్స కనిపెట్ట బడలేదని వైద్యశాస్త్రాన్నంతను దూషిస్తు కూర్చుంటాము; సైన్సు పరిశోధనలు జరుగుతూనే ఉంటాయి.

రాచకురుపు ఎల్లావస్తుంది అంటే జీవకణంలో ఏమి జరుగుతూందో చూడాలి.

కొంతకాలంక్రితం ఒక డాక్టర్ ఎలక్ట్రానిక్ సూక్ష్మదర్శిని యంత్రాన్ని పెట్టడంవలన ఒక జీవకణం, అంతర్భాగంలో ఏముందో చూడటానికి వీలైంది

అందుచేత వచ్చే 36 ఏళ్లలో రాచకురుపు వ్యాధిని నిర్మూలించడం సాధ్యం కావచ్చు. మనిషి 130 సంవత్సరాలు బ్రతకాలన్నది మామూలు కోర్కె. ఈ కోర్కెకూడా నెరవేరుతుందని మనం గట్టిగా చెప్పవచ్చు.

సైన్సుపురోభివృద్ధి మనుష్యులపై ఆధారపడి ఉంది. స్త్రీ పురుషులు సైన్సుగురించి ఎక్కువ ఆసక్తి ప్రదర్శించిన కొలదీ స్త్రీ పురుషుల ప్రయోజనాలకు అనుగుణంగా అది అభివృద్ధి చెందుతుంది.

వంట-వార్పు ఉంటాయా?

వంటవార్పులబదులు ఏమైనమాత్ర వేసుకుంటే ఆహారం తినవసరంలేని స్థితి ఏర్పడవచ్చు. దానిబదులు పెద్దయెత్తున ఆహార పదార్థాలను తయారుచేయడమే జరగవచ్చు. వ్యక్తిగతంగా వండుకోదలచుకున్నవారు వండుకొంటారు.

యింటిపని ఉంటుందా?

యింట్లో ఎన్నో ఎక్కువ "రాబట్"లు అంటే ఎలక్ట్రానిక్స్‌తో నడిచే మరమనుషులు? అంత ఎక్కువ యింటిపని వాటిచే చేయించవచ్చు. వంటపని, వడ్డనపని కూడా, కాని విద్యుచ్ఛక్తి ఖర్చు. అసలు "రాబట్లను కొనే" వ్యవహారం ఒక సమస్య అవుతుంది.

ఒకగ్లాసునీటినిఅణువిద్యుత్ఉత్పత్తియంత్రంలో పోస్తే దేశంలో విద్యుచ్ఛక్తితో నడిచేయంత్రాలన్నీ ఒక అరగంటసేపు పనిచేయడానికి వీలైనంత విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది. అందుచే విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అపారంగా ఉంటుంది. ప్రస్తుతంవలె బొగ్గు, కట్టెలు ఇంధనంగా ఉపయోగించ వవసరం ఉండదు.

ఇప్పుడు ఆయుధాల ఉత్పత్తికి వినియోగించేడబ్బు అంతా ఆ విధంగా వినియోగించడం మానివేసి, ఆడబ్బును చేతబట్టుకుంటే ప్రస్తుతం మనం అనుకున్న పరిణామాలన్నీ సాధ్యమవుతాయి.

విరామ సమయం; విజ్ఞాన వికాసం

విరామ సమయం అంటే చేయవలసిన పని అయిపోయినతరువాత ఉండేవిశ్రాంతిసమయం. దీనిలో ఏమి చేయాలి అన్నది సమస్య ఎదురౌతుంది. పనిచేసే కాలపరిమితి తగ్గినపుడు, శ్రమభారం తగ్గినప్పుడు మానసికాభివృద్ధి, విజ్ఞానాభివృద్ధి ఎక్కువ చేసుకోడానికి స్త్రీ పురుషులు ప్రయత్నిస్తారు.

ప్రపంచంలో ఏమి జరుగుతుందో వారు తెలుసుకోడానికి అభిలషిస్తారు. ఇందుకుగాను ప్రపంచ వ్యాపితమైన టెలివిజన్ ప్రసారాలు ఉంటాయి. మీట నొక్కితే ప్రపంచంలో ఏ దేశ రాజధానిలో ఏ ప్రాంతంలో ఏమి జరుగుతూందో స్వయంగా కళ్ళతో చూడవచ్చు. ఈ టెలివిజన్ ప్రసారాలకు సరిహద్దులు, ఎల్లలు అంటూ లేవు. ఏ దేశంనుండి అయినాసరే తాజావార్తలను మనం వినవచ్చు.

సభలు-సమావేశాలు

దక్షిణనెల్లూరుజిల్లాకమ్యూనిస్టుపార్టీకార్యవర్గ సమావేశం ఈనెల 25 వ తేదీ వుదయం 9 గంటలనుంచి నెల్లూరు పార్టీ కార్యాలయంలో జరుగుతుంది.

ఎజెండా

1. రాష్ట్ర సమితి రిపోర్టు
2. పార్టీ ముసాయిదా కార్యక్రమం, సిద్ధాంత సమస్యల డాక్యుమెంట్లమీద ఆగస్టు 1, 2, 3 తేదీలలో జరగబోవు వరుసపు.
3. ఆహార సమస్య.
4. పార్టీ మహాసభకు సన్నాహం.

• • •

ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు పార్టీ సభ్యుల సానుభూతిపరుల జనరల్‌బాడీ ది 28-7-64 మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుండి ఖమ్మంలో జరుగుతుంది. సమావేశానికి శ్రీయుతులు నీలం రాజశేఖరరెడ్డి, తమ్మారెడ్డి సత్యనారాయణ, వై. వి. కృష్ణారావుగార్లు హాజరు అవుతారు. పార్టీ సభ్యులు సానుభూతిపరులు ఖమ్మం, మధిర, ఇల్లెందు తాలూకాల వారు హాజరు కావాలి.

• • •

తెనాలి స్వరాజ్యటాకీసులో ఈ నెల 27 వ గుంటూరు జిల్లా గ్రామోద్యోగుల వార్షిక మహాసభ, 28 వ తేదీన ఆంధ్రరాష్ట్ర గ్రామోద్యోగుల అత్యవసర మహాసభజరుగును. ప్రస్తుతం గ్రామోద్యోగులకు ఉన్నితన్ కమిటీ రిపోర్టు ద్వారా ఉద్భవించిన విషమపరిస్థితులనుగురించి చర్చిస్తారు.

• • •

కృష్ణాజిల్లా కమ్యూనిస్టుసమితి సమావేశం విజయవాడ జిల్లా కార్యాలయంలో జూలై 29, 30 తేదీలలో జరుగును. సమావేశం 29 వ తేదీ సాయంత్రం 3 గంటలకు ప్రారంభమగును. సమావేశానికి ప్రదేశ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి కామ్రేడ్ రాజశేఖరరెడ్డి హాజరవుతారు. జిల్లా కార్యాలయం యిదివరకటి ప్రదేశంనుండి శీతారాంపురంలో విశాలాంధ్ర కార్యాలయం ప్రక్కనున్న మేడపైకి మార్చబడింది.

• • •

26-7-64 తేదీ ఆదివారం మధ్యాహ్నం 1 గంటనుండి బందరు పట్టణ కమ్యూనిస్టు కమిటీ కార్యాలయంలో బందరు తాలూకా, బందరు పట్టణ కమ్యూనిస్టుకమిటీల సంయుక్త సమావేశం జరుగుతుంది. రాష్ట్ర సమితి నిర్ణయాలు చర్చించి కార్యక్రమం తీసుకోబడుతుంది.

వ్యవసాయ వస్తు ధరలు

విజయవాడ జూలై 22

విజయవాడ రీజనల్ అసిస్టెంట్ మార్కెటింగు డైరెక్టరు నేడు అందజేసిన ఉత్పత్తిదారులనుండి 13-7-64న కొనుగోలుచేయబడిన టోకుధరలు (ఒకక్వింటాల్ 100కిలోగ్రాములు. లేక 220½ పౌనులు):

ధాన్యం
(75 కిలో గ్రాములకు)

నంబర్లు:	విజయవాడ	రూ. 48 00	36 00
„	కాకినాడ	48 00	36 00
„	చిత్తూరు	53 33	40 00
అక్కుళ్లు:	విజయవాడ	40 66	30 50
„	తాడేపల్లిగూడెం	42 00	31 50
„	కాకినాడ	44 00	33 00
„	ఆముదాలవలస	44 66	33 50
సన్నకృష్ణకాటుకలు:			
	తాడేపల్లిగూడెం	44 67	33 50
నన్నాలు:	ఆముదాలవలస	46 00	34 50
మొలకొలుకులు:	నెల్లూరు	47 84	36 18

మిల్లు బియ్యం

నంబర్లు:	విజయవాడ	రూ. 82 00
„	కాకినాడ	79 71
అక్కుళ్లు:	విజయవాడ	85 00
„	తాడేపల్లిగూడెం	86 54
„	కాకినాడ	89 69
„	ఆముదాలవలస	89 76
సన్నకృష్ణ కాటుకలు:		
„	తాడేపల్లిగూడెం:	71 62
నంబర్లు,	చిత్తూరు	85 48
నన్నాలు:	ఆముదాలవలస	74 41
మొలకొలుకులు:	నెల్లూరు	78 50

వేరుశనగ

కాయలు	విజయవాడ	87 50
„	నంద్యాల	92 50
„	ఆదోని	97 50
„	విజయనగరం	85 33
పప్పు	విజయవాడ	125 00
„	నంద్యాల	118 25
„	ఆదోని	124 00
„	విజయనగరం	133 33
నూనె	విజయవాడ	245 00
„	నంద్యాల	237 50
„	ఆదోని	237 50
„	విజయనగరం	263 33

అపరాలు

కందులు:	విజయవాడ	రూ. 81 00
„	గుంటూరు	82 00
„	ఆముదాలవలస	77 42
మినుములు:	విజయవాడ	73 00
„	గుంటూరు	70 00
„	ఆముదాలవలస	65 58
పెసలు:	విజయవాడ	85 00
„	గుంటూరు	88 00
„	ఆముదాలవలస	81 72
శనగలు:	విజయవాడ	70 66

జొన్నలు

నంతపురం:	తెల్లవి	54 00
ద్యాల:	పచ్చవి	47 00

బెల్లం

నకాపల్లి:	మొదటిరకం	—
„	మూడవరకం	—
ఎత్తూరు	మొదటిరకం	87 33
„	మూడవరకం	67 33

జీడిపప్పు

వేటపాలెం:	అమెరికన్‌రకం	రూ. 705 00
„	దేశవాళి	659 00
„	బద్దలు	600 00
„	ముక్కలు	500 00

మిర్చి

జీ2 ఒకటవ రకం	గుంటూరు	175 00
జీ2 రెండు 2వ రకం	„	165 00
జీ2 దర్ల రకం	„	—

నెయ్యి

	వల్నాడు	దేశవాళి
గుంటూరులో	610 00	620 00

కొబ్బరికాయలు

(వెయ్యింటికి ధరలు)	కొత్తవి:	పాతవి
విజయవాడ:	160 00	122 00
రాజమండ్రి	145 00	105 00
పాలకొల్లు	155 00	100 00

పసుపు

దుగ్గిరాలలో	కొమ్ములు	రూ. 128 5
„	కాస్పూరు	140 00
„	దుంపలు	117 00
కడపలో	కొమ్ములు	136 00
„	దుంపలు	—

జనపనార

విజయనగరం:	మొదటిరకం	66 66
	రెండవరకం	61 62
	మూడవరకం	56 26
ఆముదాలవలస	మొదటిరకం	60 00
	రెండవరకం	57 33
	మూడవరకం	54 00

భారత్ - రష్యాల పరస్పర మైత్రి

కాశ్మీర్ సమస్యపై సోవియట్ వైఖరి యిందుకు తార్కాణమని శ్రీ చాగ్లా

మాస్కో, జూలై 21

కాశ్మీర్ విషయంలో, భారతదేశానికి సోవియట్ యూనియన్ యిస్తున్న తోడ్పాటు, ఉభయ దేశాల వైఖరిలో, కార్యాచరణలోవున్న సారూప్యానికి ఒక ఉదాహరణ అని భారత విద్యామంత్రి శ్రీ యమ్. సి. చాగ్లా అన్నారు.

మాస్కోలోని భారత రాయబారి శ్రీ టి. యన్. కౌల్ యిచ్చిన విందులో శ్రీ చాగ్లా ప్రసంగిస్తూ, భారత - సోవియట్ యూనియన్ల మధ్య చాలా సారూప్యం వుందని, పరస్పరం ఒకరి అనుభవంనుండి మరొకరు నేర్చుకోగల విషయాలు అనేకం వున్నాయని అన్నారు.

ప్రపంచ శాంతి, సౌహార్దతలకోసం ఉభయ దేశాలు భుజం భుజం కలిపి ముందుకుపోగటం, ముఖ్య అంశమని ఆయన చెప్పారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు:

భారత దేశం పట్ల సోవియట్‌కున్న స్నేహ సౌహార్దతలను గురించి గతంలో నేను విన్నాను. కాశ్మీర్ విషయమై భద్రతాసంఘంలో జరిగిన చర్చలో పాల్గొన్న నాకు, ప్రత్యక్షంగా దాని ఫలాన్ని గ్రహించగల్గే అవకాశం లభించింది.

అంతకు ముందు సోవియట్ విద్యా మంత్రి ఎల్యూటిన్ మాట్లాడుతూ భారత ప్రజలు శాంతి కాముకులని అన్నారు.

శ్రీ కౌల్ ప్రసంగిస్తూ గత 10 సంవత్సరాలుగా భారత - సోవియట్ మైత్రి త్వర త్వరగా, అభివృద్ధి చెందుతున్నదన్నారు.

శాంతి, శాంతియుత సహజీవనం, పరస్పర గౌరవం, అనే లక్ష్యాలు ఇరువురికీ ఆమోదయోగ్యం కావటమే దీనికి కారణమన్నారు.

నాల్గవ ప్రణాళికలో రోడ్లకు 1150 కోట్లు

ప్లానింగ్ కమిషన్ సూచన

న్యూఢిల్లీ, జూలై 21

నాల్గవ ప్రణాళికా కాలంలో రహదార్ల అభివృద్ధికి 1150 కోట్ల రూపాయలు కేటాయించాలని ప్లానింగ్ కమిషన్ ఉపసంఘం సిఫారసు చేసినట్లు తెలుస్తున్నది.

జాతీయ రహదార్లకు రూ॥ 425 కోట్లు, రాష్ట్రాలమధ్యరహదార్లకు రు.72కోట్లు, రాష్ట్రాలలోనిరహదార్లకు రు.600కోట్లు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని రహదార్లకు 45 కోట్లు కేటాయించాలని సూచించింది.

మూడవప్రణాళికలో రహదార్లకు రు॥ 324 కోట్లు కేటాయించారు. అయితే యీ ప్రణాళిక పూర్తయ్యేలోగా రహదార్ల పద్దు క్రింద రు. 454 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు.

రహదార్ల అభివృద్ధికి ఒక జాతీయ పథకం ఉండాలని ప్లానింగ్ కమిషన్ ఉపసంఘం సిఫారసు చేసింది.

దేశంలోని ప్రధాన నగరాలను, పారిశ్రామిక కేంద్రాలను కలుపుతూ, జాతీయ రహదార్లను అభివృద్ధి చేయాలని సూచించింది.

జాతీయస్థాయిలోనూ, రాష్ట్రాలస్థాయిలోనూ రహదార్ల పథకాలను రూపొందించి అమలు జరపడానికి ప్రత్యేక బోర్డులు అవసరమని పేర్కొన్నది.

అవసరాల కనుగుణంగా రోడ్ల అభివృద్ధికి ఈ బోర్డులు ఉపయోగపడగలవని ప్రణాళికా సంఘం నిపుణులు అభిప్రాయపడ్డారు.

నాల్గవ ప్రణాళికలో ఇంకా మిగిలిన ప్రదేశాలలో జాతీయ రహదార్ల ఏర్పాటు, ప్రధాన వంతెనల నిర్మాణం, అలాగే ప్రధాన జాతీయ రహదార్లను వెడల్పు చేయటం, ఎక్కువ రద్దీ ఉన్న రోడ్లను మరింత బలపరచటం, అవసరమయిన స్థలాల్లో రైల్వే క్రాసింగులవద్ద వంతెనల నిర్మాణం - మొదలగు పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది.

ప్రవక్త మొహమ్మద్ జన్మదినోత్సవం

పలు ముస్లిం దేశాలలో వేడుకలు

బీరట్, జూలై 21

ఈరోజు ఇస్లాం ప్రవక్త మహమ్మద్ జన్మదినోత్సవం సందర్భంగా అరబ్ దేశాలన్నింటిలో గొప్ప వేడుకలు, ప్రార్థనా సమావేశాలు జరిగాయి.

ప్రభుత్వ కార్యాలయాలకు సెలవిచ్చారు. వివిధ భవనాలపై నిన్నరాత్రి అంతా జ్యోతులు వెలిగించారు.

డమాస్కస్, బాగ్దాద్, అమ్మాన్ రాజధానుల్లో ప్రభుత్వస్థాయిలో ఉత్సవాలు జరిగాయి.

ఆల్వాయి ఎరువుల ఫ్యాక్టరీ విస్తరణ

ఎర్నాకులం, జూలై 21

పబ్లిక్ రంగంలోని అల్వాయి ఎరువుల ఫ్యాక్టరీ 3వ దశ విస్తరణ కార్యక్రమం ప్రారంభమయ్యింది. 12కోట్లుఖర్చుతో, ఈకార్యక్రమం పూర్తయితే, ఏటా 2 లక్షల టన్నుల అమోనియం సల్ఫేటు, లక్ష 35 వేలటన్నుల అమోనియం ఫాస్ఫేటు ఇక్కడ ఉత్పత్తి అవుతుంది. ఇదికాక 25 వేల టన్నుల అమోనియం క్లోరైడ్, 44 వేల టన్నుల సూపర్ ఫాస్ఫేటు, 350 టన్నుల నైట్రేట్ పొటాషియం ఫాస్ఫేటు మిశ్రమం తయారవుతాయి. ఈ విస్తరణ పథకం అనుకున్న కాలంకంటేముందు పూర్తవుతుందని అంచనా.

విమాన కార్పొరేషన్ ఉద్యోగి అరెస్టు

వాల్కాట్ ఉదంతం సందర్భంగా

బొంబాయి, జూలై 21

ఢిల్లీ విమానాశ్రయం నుండి డానియల్ వాల్కాట్ పలాయన ఉదంతానికి బాధ్యుడనే ఆరోపణపై భారత విమాన కార్పొరేషన పౌరసంబంధాలశాఖ అధికారి శ్రీ ఆర్. జి. హజారిని నే డిక్కడ పోలీసులు అరెస్టు చేశారు.

అనుమానితు లయినమరో యిద్దరు విదేశీయులు జూన్ 9 వ తేదీన అదృశ్యమయిన ఉదంతంతో గూడా శ్రీ హజారికి సంబంధం వుందనే ఆరోపణ వుంది.

మహారాష్ట్రలో కలరా

తొంభై మందికి పైగా మరణం

నాగపూర్, జూలై 20

మహారాష్ట్రలోని అకోలా, బుల్డానా జిల్లాలలో జూలై 3 వ తేదీ నుండి యింతవరకు కలరా మూలకంగా 91 మంది చనిపోయినట్లు ఇప్పటకందిన అధికార సమాచారాన్నిబట్టి తెలుస్తోంది.

ఈ రెండు జిల్లాలలోను అయిదు వందల అయిదు మందికి కలరా సోకినట్లు వార్తలు వచ్చాయి. యాభైఅయిదు గ్రామాలలో ఈ వ్యాధి సోకింది.

అకోలాజిల్లాలో 31 గ్రామాలలో 401 మందికి యీ వ్యాధి సోకగా 61 మంది చనిపోయారు. బుల్డానా జిల్లాలో 17 గ్రామాలలో 104 మందికి యీ వ్యాధి సోకింది. ముప్పై మంది చనిపోయారు.

ఈ వ్యాధి వ్యాపించిన ప్రాంతాలలో ప్రజలందరికి ఇంజక్షన్లు యిస్తున్నారు.

సైగాన్‌లో డిగోల్ వ్యతిరేకప్రదర్శన

ఫ్రెంచి కార్యాలయం ధ్వంసం

సైగాన్ (ద. వియత్నాం), జూలై 21

స్థానిక విశ్వవిద్యాలయం విద్యార్థులు రెండు వందలమంది నేడిక్కడ ఫ్రెంచి రాయబార కార్యాలయంముందు డిగోల్ వ్యతిరేక ప్రదర్శనలు జరిపారు.

రాయబార కార్యాలయంలోనికి జొరబడి వారు బల్లలనూ, కుర్చీలనూ, మైక్కనూ చిందరవందర చేసివేశారు.

దక్షిణ వియత్నాం ను తటస్థీకరించడం ద్వారా శాంతిసాధన జరగాలనే డిగోల్ విధానాన్ని విరసిస్తూ, ప్రధాని గుయెన్ ఖాన్ ఈ వారం ఒక ప్రకటన చేశారు. ఇంతటితో దక్షిణవియత్నాం - ఫ్రాన్స్ సంబంధాలు బెడిసినట్లే భావించవచ్చుననీ, ఫ్రాన్స్ ఆర్థిక సహాయం కూడా నిల్చిపోవచ్చునీ పరిశీలకులు భావిస్తున్నారు.

దక్షిణవియత్నాంప్రభుత్వాన్ని బలపరుస్తున్న విద్యార్థులు ఈ ప్రదర్శన జరిపి, జెనీవా ఒప్పందం దశమవార్షికోత్సవాన్ని వీరు జాతీయ విరసన దినంగా పాటించారు.

కృశ్చేవ్ పోలెండు ప్రయాణం

వార్సా, జూలై 21

పోలెండు 20 వ స్వాతంత్ర్య వార్షికోత్సవాలలో పాల్గొనేందుకు సోవియట్ ప్రధాని కృశ్చేవ్ నేడు వార్సాకు బయలుదేరారు.

తూర్పు జర్మనీ కమ్యూనిస్టుపార్టీ నాయకులు ఉల్‌బ్రెక్ట్, జెకొస్లావేకియా అధ్యక్షులు అంటోనిన్ నవోట్నీలు ఇప్పటికే వార్సా చేరుకున్నారు.

పోలెండ్ 20వ స్వాతంత్ర్య వార్షికోత్సవాల సందర్భంలో, శిక్షలు అనుభవిస్తున్న అనేక మంది నేరస్తులకు క్షమాదానం ప్రకటించారు. అయితే లంచగొండి నేరానికి, దాగి కొల్లలు నడిపినవారికి, రౌడీలకు క్షమాదానం వర్తించదని ప్రభుత్వ ప్రకటనలో వుంది.

హార్లెంలో ప్రశాంత పరిస్థితి

న్యూయార్క్, జూలై 21

న్యూయార్క్‌లోని హార్లెం (నీగ్రోలపేట)లో పోలీసులు సాగిస్తున్న హింసాకాండ ఫలితంగా పోలీసులకు నీగ్రోలకు మూడు రోజులుగా తీవ్ర ఘర్షణ చెలరేగాయి.

ఈసందర్భంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో ఒకరు మరణించారు. 130 మంది గాయపడ్డారు. సుమారు 120 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

రోడ్ల వెంట ఎక్కడచూచినా బారికేడ్లు ఏర్పాటు చేసివున్నాయని ఆ ప్రాంతం చూచి వచ్చిన పి. టి. ఐ. విలేకరి వ్రాస్తున్నారు. ఎక్కడచూచినా పోలీసు బందోబస్తు పెద్ద ఎత్తున వుంది.

250,000 మంది నివసించే హార్లెం ప్రాంతములో శాంతి పరిస్థితులను కాపాడమని నీగ్రో నాయకులు ప్రజలలో ప్రచారం చేస్తున్నారు.

15 ఏండ్ల నీగ్రోయువకుని ఒక పోలీసు కాల్చి చంపటంతో ఇక్కడ కలహాలు ప్రారంభమయ్యాయి.

ప్రక్కస్కూలులో చదువుకుంటున్న నీగ్రో యువకుల్ని చూచిన ఒక శ్వేత జాతీయుడు మీ రంగు కడిగివేస్తానంటూ, ఆ బిచ్చిల్లిలపై నీళ్ళు చల్లాడు. దానితో కోపోద్రిక్తులయిన నీగ్రో యువకులు ఆ తెల్లవానిని వాళ్ళ వెంబడించి, భవనం బయటికి వస్తుండగా, ఒక పోలీసువచ్చి, తన రివాల్వర్‌తో నీగ్రో యువకుని కాల్చి చంపాడు.

తనని పొడవడానికి కత్తితో మీదకు వస్తుంటే ఆత్మరక్షణార్థం కాల్చి చంపానని ఆ పోలీసు ఉద్యోగి తర్వాత వాఙ్మూలం యిచ్చారు. కాని ఆ యువకునిదగ్గర కత్తిలేదని చూచినవారు సాక్ష్యం యిస్తున్నారు.

ఈ విషయమై రహస్య న్యాయ విచారణ జరుగుతున్నది. బహిరంగ విచారణ జరపాలని నీగ్రో నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

నీగ్రో యువకుని కాల్చి చంపటంతో న్యూయార్క్‌లో అనేక ప్రశ్నలు ఉదయించాయి.

శ్వేతజాతేతరుల పట్ల పోలీసులు క్రూరంగానూ, అమానుషత్వంగానూ వ్యవహరిస్తున్నారని నీగ్రో నాయకులు చెబుతున్న విషయం దీనితో స్థిరపడింది.

నీగ్రోలపై పోలీసులు అనవసరంగా, చీటికి మాటికి చేయి చేసుకోవటం మామూలయింది.

శాంతి కలహాల నివారణకు పోలీసులు తీసుకున్న చర్యలనుగురించి కూడా పలు ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

మూకల్ని చెదరగొట్టడానికి రైఫిళ్ళు ప్రయోగించటం మినహా వేరేమార్గం లేదా? బాష్పవాయుప్రయోగించవచ్చుగదా? లాఠీఛార్జీ జరపవచ్చుగా? నీళ్ళు చిమ్మవచ్చుగా? అనేప్రశ్నలు వినిపిస్తున్నాయి.

హర్లెంవాసులకు, పోలీసులకుమధ్య సఖ్యత కుదిరే సూచనలు కనుపించటంలేదు. పోలీసుల దృష్టిలో హర్లెంవాసులంతా నేరస్తులు దొంగలు.

గృహవసతి సరిగా లేకపోవటం, తీవ్ర నిరుద్యోగం, అమానుషమయిన జీవన పరిస్థితుల కారణంగా ఏ చిన్నఘటన జరిగినా అది రగిలి పెద్దదయ్యే ప్రమాదం ఇక్కడ వుంది.

తెల్లవాళ్ళే ఈ ప్రాంతీయులకు మహాకోపం. నీగ్రో పౌరహక్కులకొరకు పనిచేసే కొందరు శ్వేతజాతీయులు కల్లోలనివారణకు కృషి చేస్తుండగా, వారినికూడా పౌరదాటున ఎక్కడ కొడతారోనని నిన్నంతా ఒక ఇంటిలో పెట్టారు.

ఆసియా ఆఫ్రికా దేశాల శాస్త్రవేత్తల మహాసభ

జూలై 27 న ఢిల్లీలో ప్రారంభం

న్యూఢిల్లీ, జూలై 20

32 దేశాల ఆఫ్రికా - ఆసియా దేశాల, భారత దేశంలోని విజ్ఞానశాస్త్రవేత్తల మహాసభ ఇక్కడ జూలై 27 నుండి ప్రారంభం కానున్నది. ఈ మహాసభ 4 రోజులు జరుగుతుంది. సభకు రాష్ట్రపతి రాధాకృష్ణన్ ప్రారంభోత్సవం చేస్తారు.

భారతదేశాభివృద్ధిలో విజ్ఞానశాస్త్రంయొక్క పాత్రనుగురించి చర్చించేందుకు భారతీయ విజ్ఞానశాస్త్రవేత్తల సంఘం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

దేశంలోని ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలోని శాస్త్ర పరిశోధనా సంస్థలనుండి దాదాపు 200 మంది శాస్త్రవేత్తలు మహాసభలో పాల్గొంటారు. అలాగే ఆసియా - ఆఫ్రికా దేశాలనుండి 45 మంది శాస్త్రవేత్తలు ఈ గోష్టిలో పాల్గొంటారు. వీరిలో రష్యా విజ్ఞాన శాస్త్రవేత్తలుకూడా ఉంటారు. ప్రపంచ విజ్ఞాన శాస్త్రవేత్తల సమాఖ్య ప్రతినిధులుకూడా పాల్గొంటారు.

మహాసభ అనంతరం విదేశ ప్రతినిధులు దేశంలోని పరిశోధనా సంస్థలను దర్శిస్తారు. ఆగస్టు 11,12 తేదీలలో సభ్యులు మరల సమావేశమై 1965 లో పెద్ద ఎత్తున మహాసభను నిర్వహించేందుకు సన్నాహక కమిటీని ఏర్పాటు చేస్తారు.

మే, జూన్ నెలల్లో భారతీయ శాస్త్రవేత్తలు [illegible] ఆసియా - ఆఫ్రికా దేశాల్లో పర్యటించిన ఫలితంగా, ఈ అంతర్జాతీయ గోష్టి ఏర్పాటు చేయబడింది.

శాస్త్రీయ, సాంకేతిక రంగాలలో భారత దేశం, ఆసియా-ఆఫ్రికా దేశాలమధ్య ఇతోధిక సహకారం అభివృద్ధి చెందేందుకు ఈగోష్టి ఉపయోగపడగలదని భారతీయ శాస్త్రవేత్తల సంఘం అభిప్రాయపడుతుంది.

సీటి పారుదల, విద్యుచ్ఛక్తి, ఆహారం, వ్యవసాయం, ఉక్కు మొదలైన భారీపరిశ్రమలు పెట్రోలియమ్ ఇతర రసాయనాలు, రవాణా, రంగాలలో విజ్ఞానశాస్త్రం యొక్క పాత్రను గూర్చి గోష్టి జరుగుతుంది.

విజ్ఞాన శాస్త్రరంగంలో ప్రణాళికలు, పెట్టుబడులు, అంతర్జాతీయ సంబంధాలను గురించి కూడా మహాసభ చర్చిస్తుంది.

మహాసభలో, వివిధ సమావేశాలకు, టి.టి. కృష్ణమాచారి, సి. సుబ్రహ్మణ్యం, హుమాయూన్ కబీర్, డా॥ కె. యల్. రావు, సుశీలా నయ్యర్, అణుశక్తి కమిషన్ అధ్యక్షులు బాబా, అశోక్ మెహతా అధ్యక్షత వహిస్తారు.

భారత పతాక నౌక కైరో రాక

కైరో, జూలై 21

ఐ. యన్. యస్. మైసూర్ అనే భారత పతాకనౌక నేడు కైరో రేవులోనికి ప్రవేశించింది. ఈ నౌక నాలుగు రోజులపాటు అరబ్ రిపబ్లిక్ సముద్రప్రాంతంలో సుహృద్భావ యాత్ర జరుపుతుంది.

నౌకాశ్రయంలో లంగరు వేయగానే మన పతాక నౌక కప్తాన్ దోరాబ్ మెహతా తీరానికి వెళ్ళి అరబ్ రిపబ్లిక్ నౌకా దళాధిపతులను కలుసుకున్నారు. వారు గూడా మర్యాద పూర్వకంగా మన నౌక పైకివచ్చి మన నావికులను పరామర్శించారు.

భారతీయ నావికులు, అరబ్ రిపబ్లిక్ నావికులు కొన్ని ఆటల పోటీలు జరుపుకుంటారు.

భారత్ ఎలెక్ట్రానిక్సు కంపెనీ ఉత్పత్తి

బెంగుళూరు, జూలై 20

భారత ఎలెక్ట్రానిక్సు కంపెనీ 1964-'65 సంవత్సరంలో తొమ్మిది కోట్ల రూపాయల విలువగల సరుకు ఉత్పత్తిచేస్తుం దనుకుంటున్నట్లు కేంద్ర రక్షణ పరికరాల ఉత్పత్తిశాఖ మంత్రి శ్రీ ఏ.ఎం. థామస్ నేడిచ్చటచెప్పారు.

1962-63 సంవత్సరంలో ఈ కంపెనీలో 3 కోట్ల రూపాయల విలువగల సరుకులు, 1963-64 సంవత్సరంలో 6 కోట్ల రూపాయల విలువగల సరుకులు తయారైనాయి.

శ్రీ థామస్ నేడు యీ ఫ్యాక్టరీని సందర్శించారు. శాస్త్రీయ సలహాదారు డాక్టర్ ఎస్. భగవంతం మంత్రికి ఫ్యాక్టరీలోని విభాగాలన్నిటిని చూపించారు. మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వి. వి. బాలిగాకూడా వీరి వెంట ఉన్నారు.

ట్రక్కు క్రిందపడి 9 మంది దుర్మరణం

ఆగ్రా, జూలై 21

వేగంగా వెళుతున్న ఒక ట్రక్కు దారితప్పి రోడ్డుప్రక్కన వున్న జనంపైగా వెళ్ళిన కారణంగా 9 మంది అక్కడి కక్కడే మరణించారు.

అపైన వేగంగా వస్తున్న ట్రక్కు ముందు రోడ్డు ప్రక్కనవున్న ఒక మహిళ, ఇద్దరు పిల్లలమీదుగా వెళ్ళింది. ఆ తర్వాత ముందున్న ఒక స్కూటర్‌ను గుద్దింది. ఫలితంగా స్కూటర్‌పై వున్న వ్యక్తి మరణించాడు.

అంతట ఆ ట్రక్కును ఆపుచేయడానికని ఎదురు వచ్చిన మరో నలుగురి మీదుగా కూడా పోయింది. ఎదరవున్న ఒక ఎడ్లబండిని గుద్దింది. ట్రక్కు క్రిందపడిన నల్గురు అక్కడి కక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన కొట్టు యజమాని తర్వాత హాస్పటల్‌లో చనిపోయాడు.

సత్యాగ్రహం

(1 వ పేజీ తరువాయి)

సత్యాగ్రహం సాగుతోంది. నేడు 6 గురు మహిళతో సహా 7 గురు అరెస్టు అయ్యారు.

రైల్వేస్ నిబంధనలను ఉల్లంఘించి అక్రమ వ్యాపారాన్ని సాగిస్తున్న ఆహార ధాన్యాల వ్యాపారస్తులను నాగపూర్ సివిల్ సప్లయిశాఖ పట్టుకుంది.

చౌకడిపోలపై అధికారులు దాడి జరిపి, పరిశోధించగా కొన్నింటిలో ఆహార ధాన్యాల నిల్వలు లేకపోవటం, మరికొన్నింటిలో అధికంగా నిల్వలు ఉన్నాయి.

దిగుమతి చేసుకున్న గోధుమలను మాత్రమే అమ్మటానికి ఉద్దేశించబడిన చౌకడిపోలో స్థానికంగా పండించిన గోధుమ నిల్వలు కూడ ఉన్నాయి.

వ్యాపారస్తులపై కేసు పెట్టారు.

మధ్యప్రదేశ్‌లో పోలీసు లాఠీఛార్జీ

భోపాల్, జూలై 21

మధ్యప్రదేశ్ ఉత్తర ప్రాంతంలో మొరీనా అనే జిల్లా కేంద్రంలో ఆహారధాన్యాలు చౌకగా అమ్మించాలని కోరుతూ, కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన ఒక పెద్ద ప్రదర్శనపై నిన్న పోలీసులు లాఠీఛార్జీ చేశారు.

ప్రదర్శకులు కట్టుదప్పి ప్రవర్తించారనీ, తమపై రాళ్ళు రువ్వారనీ, 12 మంది పోలీసులు, యిద్దరు సబ్ యిన్స్పెక్టర్లు, సబ్ డివిజనల్ మేజిస్ట్రేటుకు గూడా దెబ్బలు తగిలాయనీ పోలీసుల కథనం.

ఈ ప్రదర్శనలో పాల్గొన్నవారిలో హెచ్చు సంఖ్య స్త్రీలేననీ, వారు ధాన్యం చౌకధరకు అమ్మించాలని మాత్రమే నినాదాలిచ్చారనీ ప్రత్యక్షంగా అక్కడ ఉండి చూచిన పౌర అధికారులు చెబుతున్నారు.

నిన్నటి ఉదంతం తరువాత నగరంలో గట్టి పోలీసు బందోబస్తు యేర్పాటు చేశారు.

అహ్మదాబాద్‌లో ఆహార మంత్రికి నల్ల జండాలు

అహ్మదాబాద్, జూలై 21

కేంద్ర ఆహార, వ్యవసాయశాఖల మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం నే డిక్కడకువచ్చినసందర్భంలో విమానాశ్రయంవద్ద వెయ్యిమంది ప్రజలు నల్లజండాలతో ఒక ఆహార ప్రదర్శన జరిపారు.

నిత్యావసర వస్తువులన్నింటి ధరలు వెంటనే తగ్గించేటందుకు గట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ వీరు నినాదాలిచ్చారు.

గుజరాత్ ప్రభుత్వం ఆహ్వానంపై ఆయన రాష్ట్రంలో ఆహార పరిస్థితిని ముఖ్యంగాముతక ధాన్యాలు, వేరుశనగనూనె ధరలపరిస్థితిని పరిశీలించేందుకే యిక్కడకు వచ్చారు.

మహాగుజరాత్ జనతా పరిషత్, సంయుక్త సోషలిస్టు పార్టీవారూ కలిసి యీ ప్రదర్శన నేర్పాటు చేశారు.

అధిక లాభార్జనపరులపై గట్టి చర్యలు తీసుకోవాలనీ, కాంగ్రెస్ ప్రభుత్వం రాజీనామా యివ్వాలనీ కూడా ప్రదర్శకులు నినాదాలిచ్చారు.

వీరికి నాయకత్వం వహించిన సంయుక్త సోషలిస్టుపార్టీ నాయకుణ్ణి శ్రీ సుబ్రహ్మణ్యం తన వద్దకు పిలిపించుకొని, "నల్లజండాలు చూపుతున్నాడుకదా! నన్ను వెనక్కు వెళ్లిపోమంటారా" అని ప్రశ్నించారు. పరిస్థితి ఎంత దుర్భరంగా వుందో తెలియజేసేటందుకు మాత్రమే యీ ప్రదర్శన ఉద్దేశించబడిందని సోషలిస్టు నాయకు డాయనకు వివరించారు.

గ్వాలియర్‌లో

గ్వాలియర్, జూలై 21

నిన్న జిల్లా కలెక్టరు కార్యాలయంముందు ధాన్యాల ధరలు తగ్గించాలనికోరుతూ ప్రదర్శనలు చేసిన సందర్భంలో అరెస్టు చేయబడిన ఎనిమిదిమందిలోనూ ఏడుగురు నేడు విడుదల చేయబడ్డారు.

ఈపేర ఉదయం పట్టణంలో 144 సెక్షన్ విధించబడింది. ఈ నిషేధాజ్ఞలు మూడురోజుల వరకూ అమలులో వుంటాయి.

ప్రదర్శకులపై నిన్న పోలీసులు లాఠీఛార్జి చేసినందుకు నిరసనగా పట్టణంలో నేడు ఒక గంటసేపు సమ్మె చేశారు.

బీహారులో సత్యాగ్రహానికి సన్నాహం

పాట్నా, జూలై 20

ఆహార ధాన్యాల ధరలను అదుపులో పెట్టడం, ధాన్యం దొంగ నిల్వచేసే వారిపైన, బ్లాక్ మార్కెట్ దార్లపైన కఠిన చర్యలు తీసుకోవడం, ధాన్యం టోకువ్యాపారాన్ని ప్రభుత్వమే నిర్వహించడం - ఈ కోర్కెలను ప్రభుత్వం అంగీకరించకపోతే, ఆగస్టు 17నుండి ప్రభుత్వ కార్యాలయాలముందు సత్యాగ్రహం చేస్తామని బీహారు ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి ప్రభుత్వానికి హెచ్చరిక చేసింది.

ఆహార సంక్షోభంపై సమితి తీర్మానాన్ని నేడు పత్రికలకు విడుదలచేశారు.

దొంగ నిల్వదార్లకుఅనుకూలమైన ప్రభుత్వ ఆహార విధానానికి నిరసనగా ఆగస్టు 5 మంది మూడు రోజులు శాసనసభ భవనం ముందు నిరాహార దీక్ష సాగించవలసినదిగా కమ్యూనిస్టు శాసన సభ్యులను సమితి ఆదేశించింది.

ఆహార సమస్యపై సంయుక్త సోషలిస్టు పార్టీ ఆగస్టు 7న పాట్నాలో తలపెట్టిన హర్తాళ్‌కు తమ సంపూర్ణ సహకారం అందజేస్తామని సమితి ప్రకటించింది.

ఇటీవల ఆహారధరలుపెరగడానికి ధాన్యం ఉత్పత్తి పడిపోవడం కారణం కాదనీ, పెద్ద టోకు వ్యాపారులు ధాన్యం నిల్వపోసి బ్యాంకులిచ్చిన రుణాలతో చట్టా వ్యాపారానికి పూనుకోవడమే కారణమని సమితి తన తీర్మానంలో పేర్కొన్నది.

సమితి తీర్మానంలో ఇంకా ఇలా వుంది:

"ప్రభుత్వం బ్యాంకులను, ధాన్యం టోకు వ్యాపారాన్ని జాతీయం చేయడానికి నిరాకరించడమేకాక టోకు వ్యాపారులు న్యాయమైన ధరలకు ప్రజలకు ధాన్యం అమ్మేటట్టు ఒత్తిడి చేయడానికి కూడ నిరాకరిస్తున్నది. న్యాయబుద్ధితో వ్యవహరించాలని ప్రభుత్వం చేసే విజ్ఞప్తులను, బెదరింపులను దొంగ నిల్వదారులు ఏమాత్రమూ ఖాతరు చేయడంలేదు."

కటంగాలో విప్లవకారుల పురోగమనం

ఎలిజబెత్‌విల్లీ, జూలై 20

జడోవిల్లికి ఆగ్నేయంగా 50 మైళ్ళ దూరంలో నున్న సెసి వైపుకు విప్లవకారులు ముందుకు సాగుతున్నారని నే డిక్కడ ఒక ప్రకటన వెలువడింది.

సెసిలో కీలకమైన విమానాశ్రయంకూడ ఉంది.

బర్మాలో షాన్ తిరుగుబాటుదార్ల వధ

రంగూన్, జూలై 21

బర్మా ప్రభుత్వ సైన్యాలు గతవారం షాన్, సాడాంగ్ ప్రాంతాలలో జరిపిన చర్యల సందర్భంలో ఇద్దరు షాన్ తెగ తిరుగుబాటుదారులు కాల్చివేయబడ్డారు. యుట్నిమాట్ అనే మరో విప్లవకారుడు కొన్ని ఆయుధాలతోనూ, మందుగుండు సామాగ్రితో సహా పట్టుబడ్డాడు. ఇతను గతంలో పార్లమెంటు సభ్యుడు.

ఈ సందర్భంలో ఒక సైనికుడు మరణించాడు. మరో యిద్దరికి గాయాలు తగిలాయి.

కమ్యూనిస్టు పార్టీ సన్నాహాలు

లూధియానా, జూలై 21

ధరల పెరుగుదలను అరికట్టాలని ఆహార ధాన్యాల వ్యాపారాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, బ్యాంకులను జాతీయం చేయాలనే కోర్కెలకై దేశవ్యాపితంగా కమ్యూనిస్టు పార్టీ పెద్ద ఆందోళన ప్రారంభిస్తుందని చైర్మన్ శ్రీ డాంగే ఈ మధ్య ఇక్కడకు వచ్చినప్పుడు సూచించినట్లు తెలుస్తూంది.

దాదాపు 60 వేలమంది పార్టీ సభ్యులు, సానుభూతిపరులు ఈ ఆందోళనసందర్భంలో అరెస్టుకావటానికి సంసిద్ధంగా ఉన్నట్లు కూడా ఆయన తెలియజేశారు.

ఈ ఉద్యమ నిర్వహణకు సంబంధించిన వివరాలను కేంద్ర కార్యాలయం త్వరలోనే రాష్ట్ర శాఖలకు పంపుతుంది.

ఈ సంవత్సరం ప్రారంభంలో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన దేశవ్యాపిత నిరశనదీక్ష ఉద్యమం జయప్రద మయిందని, అంతకంటే కూడా ఈ రెండవ దశలో ప్రారంభించే ఉద్యమం మరింత జయప్రదం కాగలదని పార్టీ వర్గాలు తెలియచేస్తున్నారు.

యు. పి. కాంగ్రెసు వాదుల ఆందోళన

లక్నో, జూలై 20

ఆహార పరిస్థితిని పరిష్కరించటంలో ప్రభుత్వం దారుణంగా విఫల మయినందుకు స్థానిక కాంగ్రెసు వాదులు తీవ్ర అసంతృప్తిని చెందారు. ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు కొన్ని చర్యలు గైకొంటామని కూడ వారు నేడిక్కడ సమావేశంలో హెచ్చరించారు.

దాదాపు 400 మంది కాంగ్రెసుకార్యకర్తలు సమావేశమై నిల్వ ధాన్యాన్ని ప్రభుత్వం స్వాధీన పరచుకొని న్యాయమైన ధరకు ప్రజలకు లభ్యమయ్యేలా చూడాలని వీరు విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయానికి కేటాయించిన మొత్తాలు వ్యయంకాని స్థితి

పశ్చిమబెంగాల్ ప్రభుత్వ అసమర్థత

కలకత్తా, జూలై 20

కేంద్రప్రభుత్వం పశ్చిమబెంగాల్ వ్యవసాయరంగంపై జరిపిన పరిశీలన వలన పశ్చిమబెంగాల్ రాష్ట్రప్రభుత్వ లోపాలు బయటపడ్డాయి. వ్యవసాయరంగంలో రాష్ట్రంలో క్లిష్టపరిస్థితి ఏర్పడనున్నదని పరిశీలనా నివేదిక తెలియచేస్తున్నది.

వర్తమాన ప్రణాళికలో వ్యవసాయానికై కేటాయించబడిన ధనాన్ని ఖర్చు చేయటంలో సైతం రాష్ట్రంవెనుకబడిందని తెలిసింది. ప్రణాళిక ననుసరించి వ్యవసాయంపై 17.78 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయవలసి వుంటుంది. ఐతే మొదటి మూడు సంవత్సరాలలో కేటాయించబడిన మొత్తంలో 31 శాతం మాత్రమే ఖర్చు చేయబడ్డది. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ననుసరించి నాల్గవ సంవత్సరంలో 30 శాతం ఖర్చు చేయబడింది.

అయితే నాల్గవ సంవత్సరంలో అంతధనం వ్యవసాయ రంగంలో ఖర్చు చేయబడలేదని కేంద్ర ప్రభుత్వ అధికారులు అనుమానిస్తున్నారు. ఐదవ సంవత్సరంలో 40 శాతం ఖర్చుచేయవలసి వుంటుంది. గతంలోని పనిని పరిశీలిస్తే అంతపెద్దమొత్తాన్ని రాష్ట్రప్రభుత్వం ఒక సంవత్సరంలో ఖర్చుచేయలేదని స్పష్టంగా తెలుస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వం తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు వ్యవసాయ ఖర్చులు అధికమైనాయని కుంటిసాకులు చెప్తూంది. రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో సైతం కేటాయించబడిన ధనంలో 80 శాతం ధనాన్నే రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేయ కలిగింది.

ఒక్క వ్యవసాయ రంగంలోనేకాదు రాష్ట్ర ప్రభుత్వంఈవిధంగాతనఅసమర్థతను ప్రదర్శించటం. వ్యవసాయాభివృద్ధికిసంబంధించిన ఇతర రంగాలలో సైతం రాష్ట్రప్రభుత్వం ఇలాగే వ్యవహరించింది. సమాజాభివృద్ధికై కేటాయించబడిన ధనంలో 37 శాతమే మొదటి మూడు సంవత్సరాలలో ఖర్చు చేయబడింది. 'సహకారం' పద్దు క్రింద కేటాయించబడిన మొత్తంలో 55 శాతం మాత్రమే ఖర్చు చేయబడింది.

పశ్చిమ బెంగాల్ వ్యవసాయ రంగంలో వైఫల్యం పొందటానికి గల కారణాలలో కొన్నింటిని ప్లానింగ్ కమిషన్ సభ్యుడు శ్రీ మన్నారాయణ తెల్పారు.

వ్యవసాయానికి సంబంధించిన వివిధ శాఖలమధ్య సక్రమమైన సహకారం లోపం ప్రధానమైన కారణంగా శ్రీమన్నారాయణ తెల్పారు.

శ్రీ మన్నారాయణ్ పశ్చిమ బెంగాల్ మరికొన్ని రంగాలలో కూడా వెనుకబడుతున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ ఉత్పత్తిలో కీలక పాత్రను వహించే ఎరువుల పంపకం విషయంలో ఇది వ్యక్తమౌతున్నది. మూడవ పంచవర్ష ప్రణాళికలో ప్రతిసంవత్సరం 5 లక్షల టన్నుల ఎరువులను రైతులకు పంపిణీ చేయవలసి వుంది. 63-64 సంవత్సరంలో 75 వేల టన్నుల ఎరువు మాత్రమే పంపిణీచేయబడింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు సంస్థలద్వారా ఎరువును పంపిణీ చేయటాన్ని పరిశీలనా బృందం తీవ్రంగా విమర్శించింది. సహకారసంస్థలద్వారా ఎరువులను పంపిణీ చేయాలని పరిశీలనాబృందం తెలియచేసింది.

సీటిపారుదల పరిస్థితికూడా అధ్వాన్నంగానే వుంది. 600 గొట్టపుబావులకుగాను 200 బావులే పని ప్రారంభించాయి. విద్యుచ్ఛక్తి సరఫరా చాలినంతగా లేనందువలన మిగతా బావులు పనిచేయటంలేదు. సిమెంటుకొరతవలన పిల్ల కాలువలు తవ్వబడలేదు.

ఈవిధంగా ప్రభుత్వవైఫల్యాలు కొట్టవచ్చినట్లు స్పష్టంగా కన్పడుతుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ పి. సి. సేన్ రాష్ట్ర దుస్థితికి ఏవో కల్లబొల్లి కారణాలు చెప్తున్నారు. అతివృష్టి అనావృష్టి పరిస్థితులవలన, 1, 2 మిలియన్ల ఎకరాలలో వరి ఎండిందటానికి బదులు జనపనార సాగుచేసినందువలన రాష్ట్రంలో దుస్థితి ఏర్పడిందని శ్రీ సేన్ నమ్మించ ప్రయత్నిస్తున్నారు.

వ్యవసాయ పద్దుక్రింద కేంద్రం కేటాయించిన ధనాన్ని సక్రమంగా వినియోగిస్తే మరికొంత ధనాన్ని కేంద్రం కేటాయిస్తుందని ప్లానింగ్ కమిషన్ హామీ ఇచ్చింది. ఇచ్చిన ధనాన్ని సకాలంలో ఖర్చు చేయకపోతే కేటాయించబడిన ధనంలో సైతం కోత పెడతామంటున్నది కేంద్ర ప్రభుత్వం. ఈ విధంగా పశ్చిమ బెంగాల్ తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూంది.

నేషనల్ ఫెడరేషన్

(1వ పేజీ తరువాయి)

చేయాలని ఫెడరేషన్ కోరింది.

కరువు భత్యాన్ని సరాసరి జీవన వ్యయ ప్రమాణంతో సమన్వయ పరిచేటందుకేదో ఒక విధానాన్ని వెంటనే రూపొందించాలనీ, రైల్వే పనివారి కిస్తున్న కరువు భత్యానికీ, వారి జీవన వ్యయ ప్రమాణానికీ పొంతనయేలేదనీ తెలిపింది.

కరువు భత్యాన్ని, జీవనవ్యయ ప్రమాణానికి జతపరచాలనే అభిప్రాయాన్ని ప్రభుత్వం ఒప్పుకొంది. గాని రెండో పేకమిషను చేసిన సూచనలు పైసూత్రానికి అనుగుణంగాగాని, యదార్థానికి సన్నిహితంగాగాని లేవు అన్నారు.

రెండో పేకమిషను కరువుభత్యం ఇవ్వడం గురించి తయారుచేసిన విధానాన్ని కార్మిక సంఘాల సలహా సహాయాలతో వెంటనే సవరించాలని ఫెడరేషను ప్రభుత్వాన్ని కోరింది. కనీసం తక్కువ జీతగాళ్ళ విషయంలోనైనా వెంటనే ధరల పెరుగుదలను సరిచేసేటట్టు కరువుభత్యాన్ని సవరించాలనీ, లేకుంటే పారిశ్రామిక శాంతి, అభివృద్ధి దుర్లభమనీ ఫెడరేషను కోరింది.

రైల్వే బోర్డు స్థాయిలో శాశ్వత రాయబార సంఘంద్వారా చర్చించినా పరిష్కారంకాకుండా విడిచిపోయిన సమస్యలన్యమధ్యవర్తి పరిష్కారానికి పెట్టాలంటూ ఫెడరేషను చేసిన సూచనను ప్రభుత్వం పాటించాలేగాని, మరో కొత్త సంఘం ఏర్పరచరాదని కోరింది.

అవినీతి నివారణకు ప్రభుత్వంతో పూర్తిగా సహకరిస్తానని ఫెడరేషను వాగ్దానం చేస్తూ దానికై సామూహిక ప్రజా వుద్యమాన్ని ప్రారంభించవలసిందిగా అనుబంధ సంస్థల్ని కోరింది.

క్లాస్ 4 వుద్యోగుల ప్రమోషన్ కమిటీ సూచనలను వెంటనే అమలు జరపవలసిందని రైల్వేశాఖను ఫెడరేషను కోరింది.

నెహ్రూ స్మారకనిధికి ఉదారంగా విరాళాలివ్వవలసిందిగా ఫెడరేషను రైల్వే పనివారికి విజ్ఞప్తి చేసింది.

జయప్రకాష్

(1 వ పేజీ తరువాయి)

సోషలిస్టులు సంకుచితమైన, అవహ్యాకరమైన, దురాక్రమణ తత్వంతో కూడిన జాతీయతతో సోషలిజాన్ని ముడిపెట్టి గందరగోళ పరుస్తున్నారు. మరికొంతమంది భారత జాతీయతను హిందూ జాతీయతను ఒకటిగానే పరిగణించుచున్నారు. ఇదంతా మన ప్రజలకు, ముఖ్యంగా యువకులకు సరియైన విద్యాబోధన జరగకపోవడంవల్ల జరిగిన ఫలితమే. ఇది మన దేశాన్ని విషాద పరిణామాలకు తీసుకొనివెళ్ళే ప్రమాదం వుంది.

మన కండ్లముందే ఒక నూతన ప్రపంచం అవతరించుచున్నది. ఆ ప్రపంచంలో పరిపూర్ణమైన సర్వ స్వతంత్ర రాజ్యమంటూ వుండదు. ప్రపంచంలో ఎక్కడ ఏది జరిగినా దాని ప్రభావం సుదూరాన వున్న ప్రజలపైన కూడా పడుతుంది. జాతులన్నీ సన్నిహిత మవుతున్నాయి.

ఆ తరువాత శ్రీ జయప్రకాశ్ నారాయణ కామన్‌వెల్తు ప్రధాన మంత్రుల ప్రకటనలోని అంశాలను గురించి ప్రస్తావించి యిలాఅన్నారు:

భారత - పాకిస్తాన్ సంబంధాలను గురించి ఉదహరించి కామన్‌వెల్తు సమావేశం ఏమితప్పు చేసిందో నాకు తెలియటంలేదు. ఈ సంబంధాలు కామన్‌వెల్తుపై పడవా? అంతేకాదు, నానాటికి చిన్నదవుతున్న ఈ ప్రపంచంపైననే భారత - పాకిస్తాన్ సంబంధాల ప్రభావం పడదా? ఆలాంటప్పుడు తమ ఆందోళనను వ్యక్తంచేసే హక్కు వారికి లేదా? ఉభయ దేశాలమధ్య తగాదాలు సర్దుబాటు చేసుకోవాలనే ఆకాంక్షను వెలిబుచ్చడం సవ్యం కానేరదా? ఆ ప్రకటనలోని ప్రస్తావన ఇటు భారత్‌కు, అటు పాకిస్తాన్‌కుకూడా వర్తిస్తుంది. ఇందుకు పాకిస్తాన్‌సంతోషాన్ని, సంతృప్తిని వ్యక్తంచేసింది. మనకే అంతబాధఎందుకు కలగాలి? దీనినిబట్టి తప్పు మనలోనే వుందని ప్రపంచానికి కనపడదా? పాకిస్తాన్‌తో గల తగాదాను పరిష్కరించుకోవాలని మనమే ఒకవైపున అదుర్దాపడుతున్నప్పుడు ఈ రకంగా వ్యవహరించడం సరియైనదేనా? దీనినిబట్టి చూస్తే కొంతమంది కుత్సితంగా వ్యవహరించుచున్నట్లు భావించవలసివస్తున్నది.

ఈ సందర్భంలోనే శ్రీ జయప్రకాష్ కాంగ్రెసుపార్లమెంటరీ పార్టీ కార్యదర్శి శ్రీ రఘునాథసింగ్ ప్రవర్తనను విమర్శించారు.

ఉన్నతస్థాయికి చెందిన వివాదాలకు సంబంధించిన విషయాలను గురించి పార్టీ నాయకుణ్ణి అవతలకు నెట్టి పార్టీ కార్యదర్శి బహిరంగంగా ఎలా మాట్లాడనివ్వ నిస్తున్నారో ఆశ్చర్యకరంగావుంది. ఒక సీనియర్ మంత్రికి-ఆయన వివరించి చెప్పే అవకాశం యివ్వకుండా అడించవచ్చునా అని ప్రశ్నించుచున్నా."

సత్యాగ్రహుల విడుదల

బొంబాయి, జూలై 21

ఈ రోజు మధ్యాహ్నం జరిగిన సత్యాగ్రహం సందర్భంలో అరెస్టయిన 11 మంది కమ్యూనిస్టు కార్యకర్తలను, పోలీసులు రాత్రి ప్రొద్దుపోయాక విడుదల చేశారు.

దేశాయిఅవార్డు పొడిగింపుకు కార్మికమంత్రిత్వశాఖ నిర్ణయం?

ఉద్యోగుల ఆందోళనపట్ల నిర్లక్ష్యం

న్యూఢిల్లీ, జూలై 21

బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య సూచనలను పెడచెవిని పెట్టి, "దేశాయి అవార్డును" (బ్యాంకింగు పరిశ్రమ గురించిన అవార్డు) 1964 జూలై 30 వ తేదీ మరో సంవత్సరానికి పొడిగించాలని కార్మిక మంత్రిత్వశాఖ నిర్ణయించినట్లు తెలుస్తున్నది.

ఈ అవార్డు గడువు నుపొడిగించరాదని ఉద్యోగుల సంఘాలు తీవ్ర ఆందోళన చేస్తున్నాయి. నిజంగా ఉద్యోగులకేమయినా ఇబ్బందులు వుంటే, అవార్డుకాలపరిమితి పొడిగింపుతో నిమిత్తం లేకుండా, విడిగా పరిష్కరించుకోవచ్చునని కార్మికశాఖ అంటున్నట్లు తెలుస్తోంది.

ఎంతోవ్యయప్రయాసలకోర్చి రూపొందించిన అవార్డు గనుక మూడు సంవత్సరాల వరకూ దానిని కొనసాగించి తీరాల్సిందేనని కార్మిక మంత్రిత్వశాఖ అంటున్నది. పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం అవార్డు గడువు 3 సంవత్సరాలని వాదించుచున్నది.

ఈ అవార్డు 1962 నుండి అమలులో వుంది. 80,000 మంది బ్యాంకు ఉద్యోగులకు (స్టేట్‌బ్యాంకుతోసహా) వర్తిస్తుంది.

ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుయిటీల విషయంలో మూల వేతనాన్ని లెక్కగట్టేటప్పుడు అనుసరించవలసిన పద్ధతిని, అవార్డులో సాధించినట్లుగాక, కొన్ని సవరణలు చేయాలని ఉద్యోగుల సంఘం కోరుతున్నది.

జీవనవ్యయం విపరీతంగా పెరిగినదృష్ట్యా అన్నిబ్యాంకుల ఉద్యోగుల వేతనాలను తరగతులవారీగా 20 శాతం పెంచాలని డిమాండ్ చేస్తున్నది.

ఏటా ప్రపంచ జనాభా పెరుగుదల 6½ కోట్లు

లండన్, జూలై 21

ప్రపంచ జనాభా ఏటా 6½ కోట్ల చొప్పున పెరుగుతున్నదని రాయల్ అగ్రికల్చర్ సొసైటీ అధ్యక్షులు ప్రొఫెసర్ డడ్లీస్టాంప్ నేడిక్కడ అన్నాడు.

జనాభా ఈవిధంగా పెరగటంవల్ల భూ వసతి కొరత ఏర్పడుతుందని హెచ్చరించారు.

ప్రస్తుతం అమెరికాలో మనిషికి 12 ఎకరాల భూమి ఉంటగా, బ్రిటన్‌లో 1.1 ఎకరా మాత్రమేవున్నదని తెలిపారు.

ఇండియాలో సాగుకు లాయకీఅయిన భూమి తలసరి 40 సెంట్లుకాగా జపాన్‌లో 20 సెంట్లు అని చెప్పారు.

అసంతృప్తికరంగా ఉన్న ఆంధ్ర విద్యుత్ ప్రణాళికలు: శ్రీ కె. యల్. రావు

పత్రికా గోష్ఠి

హైదరాబాద్, జూలై 21

తృతీయ ప్రణాళికలో ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి ఉత్పత్తి సంతృప్తికరంగాలేదని, 1967 సంవత్సరాంతంలోగా ఈ స్థితి తొలగగలదని ఆశిస్తున్నానని కేంద్రమంత్రి శ్రీ కె యల్ రావ్ నే డిక్కడ వ్యాఖ్యానించారు

1967 నాటికి అతిముఖ్యమైన కొన్ని విద్యుత్ పథకాలు పని ప్రారంభించగలవని ఆయన అన్నారు.

మన రాష్ట్రంలో తన పర్యటన ముగించుకొని ఢిల్లీ వెళ్తూ, నే డాయన యిక్కడ ఒక పత్రికా గోష్ఠి జరిపారు.

కొత్తగూడెం, డిగువసీలేరు, శ్రీశైలం ప్రాజెక్టులు సత్ఫలితాల నివ్వగలవని ఆశిస్తున్నా నన్నారు.

కొత్తగూడెం థర్మల్ కేంద్రానికి నీరు సరఫరా చేసే కిన్నెరసాని ప్రాజెక్టు పని గురించి అయన అసంతృప్తి ప్రకటించారు.

ఒక శతాబ్దంక్రిందట రాజమండ్రివద్ద నిర్మాణమైన గోదావరి ఆనకట్ట పరిస్థితిగురించి నిపుణులచేత దర్యాప్తు జరిపించాలని భావిస్తున్నట్లు ఆయన సూచించారు.

ధవళేశ్వరంలో ఆనకట్ట బీటలు పడిందనే వార్త నిజంకాదనీ, అయితే ఆనకట్ట పునాది క్రింద పెద్దపెద్ద రంధ్రాలున్నవని అన్నాడు. గోదావరిపై రెండు బ్యారేజీలు నిర్మించడం అవసరమన్నారు. ఒకటి డెల్టా భూములకు నీరు అందించడంలో తోడ్పడుతుందనీ రెండవది మెట్టప్రాంతం భూములకు నీరందించడానికి అవసరమని వివరించారు.

ప్రజాతంత్ర పార్టీ సభ్యుల్ని పలుగుర్ని కొంతమంది స్వతంత్రులను కాంగ్రెస్ శాసనసభా పార్టీలో చేర్చుకునే విషయంపై తన నిర్ణయాన్ని వచ్చే నెలలో ప్రకటిస్తానని శ్రీ కామరాజ్ ప్రకటించారు.

అస్సాం, గుజరాత్‌ల్లో నూనె బావుల త్రవ్వకం

త్వరితం చేయడానికి నూనె సహజవాయువు కమిషన్ నిర్ణయం

డెహ్రాడూన్, జూలై 21

అస్సాంలోని రుద్రసాగర్ ప్రాంతంలోనూ, గుజరాత్‌లోని కోసంబా ప్రాంతంలోనూ నూనె బావుల త్రవ్వక కార్యక్రమాన్ని త్వరితం చేయడానికి నూనె, సహజవాయువుల కమిషన్ నేడు నిర్ణయించింది.

శ్రీ పి. ఆర్. నాయక్ అధ్యక్షతన కమిషన్ సభ్యుల సమావేశం నేడిచ్చట జరిగింది. కోసంబా ప్రాంతంలో మరో రెండు పరిశోధనా బావులు త్రవ్వాలని కూడా నిర్ణయించింది.

బరౌనీ నూనెశుద్ధి కర్మాగార అవసరాలు తీర్చడానికి నహర్‌కటియా నూనె గనులను త్వరగా అభివృద్ధి చేయడానికి కమిషన్ ఒక ప్రణాళికను తయారుచేసింది. 1966 నాటికి బరౌని శుద్ధి కర్మాగార శక్తిని ముప్పై లక్షల టన్నులకు పెంచబోతున్నారు.

దేశం మొత్తంమీద జరుగుతున్న బావుల త్రవ్వకం, సర్వే కార్యక్రమాల అభివృద్ధిని కమిషన్ సమీక్ష చేసింది.

కావేరీ ప్రాంతంలోని నట్టూకొట్టై వద్ద 60 మీటర్లవరకు బావి నిర్మాణ కార్యక్రమం చేపట్టారనీ, మద్రాసులోని కరైకాల్ వద్ద లోతుగా త్రవ్వకం జరిగిందనీ వచ్చే మాసంలో బావి నిర్మాణం ప్రారంభమౌతుందనీ తెలుస్తోంది.

డెహ్రాడూన్ సమీపంలోని సిరలిక్కువద్ద బావులనిర్మాణం ప్రారంభమైంది. లోతు త్రవ్వే యంత్రాలు రవాణాలో ఉన్నాయి. ఈ పరికరాలు పంజాబ్‌లోని జావలముఖి ప్రాంతంలోని కాశ్మీర్ నుండి పంపించబడ్డాయి.

హోషియార్‌పూర్ వద్ద జనేరిలో బావుల త్రవ్వకం ఈ వసంతకాలంలో ప్రారంభిస్తారు.

బీహారులోని పూర్ణియావద్ద, కలకత్తా వద్దనున్న పోర్టుకానింగ్ వద్ద బావుల త్రవ్వకం త్వరలో ప్రారంభిస్తారు.

అంకాలేశ్వర్, కాంబే, నవన్‌గామ్ అహమ్మదాబాద్ వద్ద నూనె గనుల అభివృద్ధి కార్యక్రమాలను ఎక్కువచేయడానికికూడా కమిషన్ నిర్ణయించింది. గుజరాత్‌లో కోయిలివద్ద నిర్మిస్తున్న నూనెశుద్ధి కర్మాగారం వచ్చేసంవత్సరం మొదట్లో మొదటిదశ పనిచేయటం ప్రారంభిస్తుంది.

వచ్చే మాసంలో పూర్తిపరికరాలతో సోవియట్ ఓడ వచ్చినతర్వాత సముద్రంలో నూనె గనుల సర్వే ప్రారంభిస్తుంది.

కాంబేలో సముద్రజలాలలో నూనె సర్వే కార్యక్రమాన్ని తన స్వంత సిబ్బందితోనే కమిషన్ ప్రారంభించింది.

కృష్ణా జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యాలయం మార్పు

విజయవాడ, జూలై 21

కృష్ణాజిల్లా కమ్యూనిస్టు సమితి కార్యాలయం ఇదివరకటి స్థలం నుండి శీతారాంపురంలో విశాలాంధ్ర కార్యాలయం ప్రక్కన ఉన్న మేడపైకి మార్చబడిందని జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ జె. యస్. ఆర్. ఆంజనేయశాస్త్రి తెలియజేస్తున్నారు. జిల్లా కార్యాలయంతో ఇకముందు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేవారు జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యాలయం, శితారాంపురం — విజయవాడ-4 అన్న అడ్రసుకు రాయాలి.

ఫిలిప్పైన్స్ ప్రఖ్యాత మల్లుడు సామోయ్ పోర్కర్ జూలై 18 వ మరణించాడు.


Sulekha
స్పెషల్ ఫౌన్‌టెన్‌పెన్ సిరా
④ స్థిరమైన రంగులలో లభించును.
★ బ్లూ - బ్లాక్ ★
★ రాయల్ బ్లూ ★
★ బ్లాక్ ★
★ బ్రౌన్ ★
SULEKHA WORKS LTD.
CALCUTTA-32
PRO/SW 6

జాతీయ మహాసభను బలపర్చే చర్యలు

తీసుకునేందుకు శ్రీ సాదిక్‌కు అధికారంయిస్తూ కార్యవర్గ తీర్మానం

శ్రీనగర్, జూలై 22

పార్టీ నుండి చీలిపోయినవారికి, తిరిగి పార్టీలో చేరి, సంస్థను బలపర్చమని విజ్ఞప్తి చేయడానికి జాతీయ మహాసభ తాత్కాలిక అధ్యక్షులు జి. ఎం. సాదిక్‌కు అధికారం యిస్తూ నేడిచ్చట జరిగిన జాతీయ మహాసభ కార్యవర్గ సమావేశం తీర్మానించింది.

జాతీయ కాంగ్రెస్ సిద్ధాంతాలకి కట్టుబడిన వారందరినీ జాతీయ మహాసభలో చేరమని విజ్ఞప్తి చేయడానికి కూడా కార్యవర్గం నిర్ణయించింది.

సమావేశానంతరం పార్టీ ప్రతినిధి ఒకరు పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ పార్టీ ప్రధాన కార్యదర్శిని నియమించే అధికారం కూడా సాదిక్‌కు యిచ్చినట్లు తెలియజేశారు.

కార్యవర్గం నియమించిన ఏడుగురితో కూడిన ఉపసంఘం చేసిన సూచనలపై కార్యవర్గం యీ నిర్ణయాలను చేసింది.

కార్యవర్గ సభ్యులలోని 21 మందిలోనూ 18 మంది సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలోని పార్లమెంటు సభ్యులు ఎనిమిది మంది, మరో ముగ్గురు ప్రత్యేక ఆహ్వానితులుగా సమావేశంలో పాల్గొన్నారు.

ప్రధాన కార్యదర్శికిగాను మరో ఇద్దరు కార్యదర్శులను కూడా ఏర్పాటు చేయడానికి కార్యవర్గం నిర్ణయించింది.

సభ్యత్వం చేర్పించడం అక్టోబరువరకూ కొనసాగించాలని ఉపసంఘం చేసిన సూచనను కార్యవర్గం ఆమోదించింది.

భవిష్యత్తులో 'జరిగే ఎన్నికలను' జిల్లా, తాలూకా సంఘాల పనివిధానాన్ని అజమాయిషీ చేయడానికి జమ్మూ, కాశ్మీర్‌లకు చెరొకటి చొప్పున రెండు ఆర్గనైజింగ్ ఉపసంఘాలను నియమించడానికికూడా కార్యవర్గం నిర్ణయించింది.

పార్టీ, ప్రభుత్వాల కార్యక్రమాన్ని సమన్వయ పరచడానికి ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేయడానికి తాత్కాలిక అధ్యక్షునికి అధికారం యిచ్చారు. ఈ సమన్వయ కమిటీలో ఇద్దరు మంత్రులు, ముగ్గురు పార్టీ ప్రతినిధులు ఉంటారు. పార్టీ ప్రతినిధుల ముగ్గురిలో అధ్యక్ష కార్యదర్శులు కూడా ఉంటారు.

ప్రచారానికి, కార్యకర్తలకు రాజకీయ విద్యను గరపడానికి ఉపసంఘాలను నియమించడానికి తాత్కాలిక అధ్యక్షునికి అధికారం యిచ్చారు.

కీ. శే. ప్రధాని నెహ్రూ అడుగుజాడలలో నడుస్తామని కార్యవర్గం ప్రతిజ్ఞ చేసింది.

నేత పనివారలకు మేలురకం సామాగ్రి

బెంగుళూరు, జూలై 21

దేశంలో చేతి మగ్గాల పరిశ్రమల్లో నూతన విధానాలను అవలంబించేందుకు, మంచి పనిముట్లను వాడేందుకు అఖిల భారత చేతి మగ్గాల సంస్థ, శ్రీ పి. హరిహరన్‌ను జపాన్ పంపుతుంది. ఈయన నేత పనివారికి కావలసిన పనిముట్లను, చిన్నయంత్రాలను ఎన్నికచేసి జపాన్ నుండి తీసికొని వస్తారు.

జపాన్‌లోని టోక్యో, ఒసాకా, నగోయా, క్యోటా ప్రాంతాలలో పర్యటించి, భారతదేశ పరిశ్రమకు అవసరమైన పనిముట్లను శ్రీ హరిహరన్ ఎన్నిక చేస్తారు.

జపాన్‌నుండి మేలురకం పనిముట్లను, సామాగ్రిని కొనేందుకుగాను 75 వేల రూపాయలను మంజూరుచేయబడ్డది. సామాగ్రి వచ్చిన తరువాత నేతపనివారి నిమిత్తమై బెంగుళూరు మొదలయిన కేంద్రాలలో ప్రదర్శనలను ఏర్పాటు చేస్తారు.

గుజరాత్‌లో వేరుశనగ నూనె

వెలుపలికి రవాణా నిషేధించమని గుజరాత్ విజ్ఞప్తి

అహమ్మదాబాద్, జూలై 21

వేరుశనగ నూనె రాష్ట్రం వెలుపలికి వెళ్లకుండా ఆంక్షలను విధించేందుకు తక్షణం చర్యలను తీసుకోవలసిందిగా గుజరాత్ ప్రభుత్వం కేంద్ర ఆహారశాఖమంత్రి శ్రీ సుబ్రహ్మణ్యంకు నేడు విజ్ఞప్తి చేసింది.

వేరుశనగనూనె ప్రస్తుతం చాలా పరిమితంగా వుందనీ. కొత్తపంట వచ్చేంతవరకూ రాష్ట్రంలోని నూనె బయటకు వెళ్ళకుండా నిరోధించాలని వారు కోరారు.

ఈవేళ ఉదయం ఢిల్లీనుండి ఇక్కడికి వచ్చిన శ్రీ సుబ్రహ్మణ్యం గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ బల్వంతరాయ్‌మెహతా, సివిల్ సరఫరాల మంత్రి శ్రీ యమ్. పి విజయకుమార్, తదితర మంత్రులతోనూ, అధికారులతోనూ రాష్ట్ర ఆహార పరిస్థితిని గురించి చర్చించారు.

వేరుశనగనూనె ఇప్పటికే రాష్ట్రంవెలుపలికి చాలాభాగం వెళ్లిపోయిందనీ, యిప్పుడున్నది తమ రాష్ట్రానికి మూడు మాసాలకు మించి సరిపోదని గుజరాత్ అధికారులు శ్రీ సుబ్రహ్మణ్యంకు వివరించారు.

తమ రాష్ట్ర పరిస్థితిని చక్కపరచేందుకు అధికారులు మరికొన్ని సూచనలను కూడా చేశారు.

ఇది యిలా వుండగా రాజస్థాన్ ప్రభుత్వం యిస్తానన్న గోధుమలను తాము నిరాకరించామన్న మాట నిజంకాదని నేడు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

రాజస్థాన్ ప్రభుత్వం గోధుమల సరఫరా చేయగలనని ముందువచ్చినమాట వాస్తవం కాదని, ఆ పరిస్థితులు తాము నిరాకరించే సమస్య లేదన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో అపరిమిత వ్యయం

కౌన్సిలు చర్చలో శ్రీ సదాశివన్ విమర్శ

హైదరాబాద్ జూలై 21

ఆంధ్ర ప్రదేశ్ గ్రామపంచాయతీల సవరణ బిల్లును శాసనసభ ఆమోదించిన రూపంలో ఆంధ్ర శాసనమండలి ఆమోదించింది.

బిల్లుపై చర్చకు సమాధానమిస్తూ, పంచాయతీరాజ్ మంత్రి శ్రీ లక్ష్మీనరసయ్య, సమితుల ఎన్నికలలో అవినీతిచర్యలు జరిగినమాట నిజమేననీ, కొన్ని ఘటనలు ప్రభుత్వం దృష్టికి కూడా వచ్చాయనీ అంగీకరించారు. రాబోయే ఎన్నికల లోపునయినా అవినీతి చర్యల నరికట్టేటందుకు తగిన పథకాలను ప్రభుత్వం ఆలోచిస్తున్నదన్నారు.

పంచాయతీఎన్నికలలో మాత్రం అన్యాయాలేవీ జరగలేదన్నారు. పంచాయతీలకు ఎప్పుడూ ప్రభుత్వం ధనసహాయం ఇస్తూండటం సాధ్యం కాదనీ, వాటి ఖర్చులకు కావలసిన ధనాన్ని పన్నులువేసి తెచ్చుకోవాలనీ అన్నారు.

కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ బదుకల్లు సదాశివన్ బిల్లుకు ఒక సవరణ తెచ్చారు. కాని, అది త్రోసివేయబడింది.

చర్చా సమయంలో ప్రతిపక్ష ఉపనాయకుడు శ్రీ సదాశివన్ ప్రసంగిస్తూ, గ్రామాలలో కొందరు పెత్తందార్లకుగల బలమూ, ప్రభుత్వోద్యోగులు వాగ్దానంచేసిన ధనాశ ఫలితంగా మాత్రమే 7 వేల పంచాయతీలకు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఎన్నికలలో ధనం దండిగా ఖర్చుచేశారనీ, అనంతపురం జిల్లాలోని ఒక కుగ్రామంలో పంచాయతీ ఎన్నికలలో 30 వేలు ఖర్చుచేశారనీ ఆయన అన్నారు.

"ఎన్నికలలో ధనం వ్యయమవుతున్నదనీ, అవినీతికరచర్యలు సాగుతున్నాయనీ ప్రభుత్వం ఎరుగును. అసలు ఎన్నికలపద్ధతిలో వున్న లోపాలమూలంగానే ఇల్లాగ జరుగుతూంది. చట్టంలోని నిబంధనలను అమలుజరపడంలేదు" అన్నారు.

ఎన్నికలలో ధనం బాగా ఖర్చుచేస్తూండడం నిజమేననీ, దానిని నిలపాలనీ శ్రీ కె. రామచంద్రారెడ్డి (కాం) అన్నారు. అయితే 7 వేల పంచాయతీలకు ఏకగ్రీవ ఎన్నికలు జరగడం గొప్ప విషయమే నన్నారు.

తెలంగాణాలోని గ్రామపంచాయతీలఆదాయం చాలా తక్కువని అయనఅన్నారు. పన్నులు పంచాయతీలకు ఇస్తున్నారుగాని అవి చాలడం లేదన్నారు. గ్రామాలలో అభివృద్ధికార్యక్రమాల నెత్తుకోవాలంటే గ్రామ పంచాయతీల ఆదాయం పెరగాలన్నారు.

గోవాలో బాంబు ప్రమాదాలు

కుట్రదారుల ఆచూకి తెలిసినట్లు వార్త

పాంజిమ్ జూలై 21

గోవాలో జూన్ 26 వ తేదీన జరిగిన బాంబు ప్రమాదాలకు, పోర్చుగల్‌లో నివాసం ఏర్పాటుచేసుకున్న ప్రసిద్ధి పొందిన పోలీసు అధికారి కాస్మిరోమాంటైరో ప్రధానకారకుడని తగిన సాక్ష్యం లభించినట్లు నమ్మకంగా తెలుస్తోంది. గోవా జాతీయోద్యమ కాలంలో యితను అనేక దుర్మార్గాలకు కారకుడు.

ఈ బాంబు ప్రమాదాలు జరగకపూర్వం, మారు పేరుతో మూడు వారాలపాటు మాంటైరో గోవాలో ఉన్నట్లు నమ్ముతున్నారు. మాంటైరో, మరొకతను ఇస్మాయిల్ డైమాస్ గోవాలోకి ఎట్లా ప్రవేశించిందీ, ప్రమాదాలు జరిగిన తరువాత ఎట్లా పరారి అయ్యిందీ. తెలియక పోయినప్పటికీ. మార్మగోవా రేవునుండి విదేశీఓడలో గానీ, దేశంనుండి పారిపోవడానికి ముందు బొంబాయి చేరిగానీ ఉంటారని అనుకుంటున్నారు.

డైమాస్ యీ కుట్రలో కొంతమంది స్థానికుల సహాయం సంపాదించాడనీ, బాంబులను స్వయంగా మాంటైరో తయారుచేసినట్లు కూడా నమ్ముతున్నారు.

బాంబు ప్రమాదాలు జరిగిన మాసం రోజులకు గోవా పోలీసులు యీ కుట్రను కనుగొన్నట్లు తెలుస్తోంది.

కేసు పెట్టడంలో గోవా పోలీసులకు కేంద్ర నేర పరిశోధక శాఖకుచెందిన న్యాయశాఖ నిపుణుల సహాయం చేస్తున్నట్లు నమ్ముతున్నారు.

కుట్రదారులకు ఆర్థిక సహాయం చేశాడనే అనుమానంతో అరెస్టు చేసిన డాక్టరు, మాంటైరో బంధువు అరెస్టుతో యింతవరకు అరెస్టు అయిన వారి సంఖ్య మొత్తం పద్దెనిమిది.

బాంబులు పెట్టినవాడనీ, తరువాత కారును మైసూరు రాష్ట్రంలోని కిట్టూర్‌వద్ద వదలిపెట్టి పారిపోయాడనుకునే డ్రైవరు హసన్‌ఖాన్ ఆచూకి యింతవరకూ తెలియలేదు.

ఆంస్టర్‌డాంలోని జి.ఎల్. లూన్ కంపెనీ వారు పైపులో గ్యాస్ వెనకకు రాకుండా నివారించే కొత్తరకం చెక్ వాల్వులు కనుగొన్నారు. వాల్వులు-బర్నర్లకు మధ్య పైపులో వచ్చే ఏ రకమైన వత్తిడిని అయినా ఇది తట్టుకోన గలదు. అన్ని రకాల బర్నర్లకు దీనిని ఉపయోగించవచ్చు.

విదేశాలనుండి సిమెంటు దిగుమతి

కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు మహారాష్ట్ర మంత్రి వెల్లడి

బొంబాయి, జూలై 21

దేశంలోని సిమెంటు కొరతను తీర్చడానికి విదేశాలనుండి సిమెంటు దిగుమతి చేసుకునే విషయం కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది.

మహారాష్ట్ర గృహనిర్మాణాల శాఖమంత్రి శ్రీ తలియార్‌ఖాన్ నేడు శాసనసభలో ఈ విషయాన్ని వెల్లడించారు. గృహనిర్మాణాలబోర్డు 1961-62 సంవత్సరపు పనిని గురించి జరిగిన చర్చకు సమాధానంయిస్తూ ఈ విషయం చెప్పారు.

దేశం మొత్తానికి నెలకు పదునెనిమిది లక్షల టన్నుల సిమెంటు కావాల్సి వుండగా, దేశంలో పదిలక్షల టన్నులుమాత్రం ఉత్పత్తి అవుతోందనీ. కొత్త ఫ్యాక్టరీలు నిర్మించే అవకాశం గానీ, దేశీయ ఉత్పత్తులు తగినంత పెరిగే అవకాశం గానీ లేనందున, వచ్చే కాలంలో సిమెంటు కొరత అనుభవించక తప్పదన్నారు.

కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ ఎస్. జి. పాట్కర్ లేవనెత్తిన పాయింట్‌ను ప్రస్తావించి, పట్టణంలోని భూమి ధరలకు ప్రభుత్వం సీలింగ్ నిర్ణయిస్తుందన్నారు. 1948సంవత్సరపు ధరలు ప్రాతిపదికగా కూడా గృహాలు నిర్మించి, చౌక అద్దెలకు యివ్వటం అసాధ్య మన్నారు. గృహనిర్మాణాలబోర్డు పట్టణం అభివృద్ధిచెందే సరిహద్దులలో భూములు సేకరించిందనీ, పట్టణంలోని గృహాల కొరతను తీర్చడానికి కొంతవరకు అదొక్కటే మార్గమని తాను భావిస్తున్నట్లు శ్రీ తలియార్‌ఖాన్ తెలియజేశారు.

హైదరాబాద్‌లో నెహ్రూ మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంటు నవంబరు 14 నుండి జరుగుతుంది.

లోహ చూర్ణ కర్మాగారానికి పునాది

కేంద్ర రక్షణ ఉత్పత్తిశాఖ మంత్రి చే

హైదరాబాద్, జూలై 21

రక్షణ ఉత్పత్తుల శాఖామంత్రి శ్రీ ఎ. ఎం. థామస్ నేడిక్కడ లోహ చూర్ణ కర్మాగారానికి పునాది వేశారు. ఆ లోహ చూర్ణాల నుంచి దృఢమైన లోహ పరికరాలూ, యంత్ర భాగాలూ తయారు చేస్తారు.

రక్షణ శాఖ వారి లోహ పరిశోధనాలయానికి అనుబంధంగా ఈకర్మాగారాన్ని నెలకొల్పుతున్నారు. ఈ సంవత్సరం ఆఖరుకే దీని నిర్మాణం పూర్తి అవుతుంది.

బెంగుళూరులోని రక్షణ పరిశోధనాగారాలను పరిశీలించి కేంద్ర మంత్రి ఇక్కడకు వచ్చారు. రక్షణ మంత్రి సలహాదారుడు డా. ఎస్. భగవంతం కూడ ఆయనతో వచ్చారు.

రక్షణశాఖకు చెందిన సంస్థలలో పని బాగానే జరుగుతున్నదనిఆయన సంతృప్తి ప్రకటించారు.

డాక్టరు భగవంతం మంత్రికి స్వాగతం పలుకుతూ పారిశ్రామిక పరిశోధనాగారాల అవసరాలువేరు-రక్షణశాఖ పరిశోధనా గారాల అవసరాలు వేరు అన్నారు. సాయుధసేనల ప్రత్యేకావసరాలు ఏమిటో చెప్పి శాస్త్రవేత్తలను తయారు చెయ్యాలన్నారు. రక్షణ పరికరాలలో ఒక ప్రత్యేక తరహా వాని కవసరమయిన ప్రత్యేకరకం లోహభాగాలను ఈయంత్రాగారం తయారు చేస్తుందన్నారు.

పరిశోధనాగారం డైరెక్టరు డా. ఆర్. వి. తమ్హంకర్ తమ సంస్థయొక్క పుట్టుపూర్వోత్తరాలను వివరించి, లోహపరిశోధనా గారాలు మొత్తం పూర్తిఅయ్యేసరికి మూడేళ్లు పడుతుందన్నారు. పరిశోధనాగారంకోసం 600 ఎకరాల నేల విరాళంగా ఇచ్చిన ప్రభుత్వ సహాయానికి ఆయన అభినందనలు తెలిపారు.

పారిశ్రామికతగాదాలలో ఐచ్ఛిక మధ్యవర్తి తీర్పు

న్యూఢిల్లీ, జూలై 21

1962 సంవత్సరం నవంబరు నుండి 1964 సంవత్సరం మే నెల మధ్యకాలంలో 510 పారిశ్రామిక తగాదాలలోను 215 తగాదాలు యజమానులు, కార్మికులు ఐచ్ఛిక మధ్యవర్తి తీర్పుకు అంగీకరించినట్లు అధికార పత్రికా ప్రకటనద్వారా తెలుస్తోంది.

ఈ తగాదాలలో 40 శాతం ఐచ్ఛిక మధ్యవర్తి తీర్పుద్వారా పరిష్కారమైనాయి.

1963 సంవత్సరంలో జరిగిన త్రైపాక్షిక కార్మిక మహాసభలో చేసిన నిర్ణయాన్ననుసరించి కార్మిక మంత్రిత్వశాఖ, యజమానుల, కార్మికుల కేంద్ర సంస్థలను పారిశ్రామిక తగాదాల పరిష్కారానికి ఐచ్ఛిక మధ్యవర్తి తీర్పుకు అంగీకరించేటట్లు ఒప్పించడానికి ప్రయత్నం చేస్తోంది.

గుంటూరు జిల్లా కమ్యూనిస్టు సమితి సమావేశం

25 వ తేదీన గుంటూరులో

గుంటూరు, జూలై 22

గుంటూరుజిల్లా కమ్యూనిస్టు సమితి సమావేశం గుంటూరు పట్టణ పార్టీ కమిటీ కార్యాలయంలో 25 వ తేదీ ఉదయం 9 గంటలకు జరుగుతుంది.

సభ్యులంతా తప్పక హాజరు కావాలని జిల్లా పార్టీ కార్యదర్శి శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ కోరుతున్నారు

26 27 తేదీలలో కార్యకర్తలకు స్కూలు ఏర్పాటు చేయబడిందని దానికి గ్రామ, పట్టణ, పేట బ్రాంచి కార్యదర్శులు తప్పక హాజరుకావాలని ఆయన తెలియచేస్తున్నారు.

ఈ స్కూలుకు ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ రాజశేఖర రెడ్డి, శ్రీ శ్రీకృష్ణ హాజరవుతారు.

అభ్యంతరకరమైన శ్రీ గులాబ్‌చంద్ టామట్ ప్రకటనను ప్రచురించినందుకు ఎందుకు చర్య తీసుకొనకూడదో వంజాయిషీ యివ్వమని మధ్య ప్రదేశ్ ప్రభుత్వం రాయపూర్‌లోని రెండు హిందీ దినపత్రికలకు నోటీసు యిచ్చింది.

25 వారం
బాబూ మూవీస్
మూగమనసులు
BM
BABU MOVIES
నిర్మాత సి సుందరం
దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు
శ్రీ ఖలింస్ విడుదల
విజయవాడ మారుతి
విశాఖపట్నం రామకృష్ణ
విజయనగరం శ్రీకృష్ణ
గుంటూరు శ్రీసరస్వతి
రాజమండ్రి స్వామి
తిరుపతి ప్రతాప్
నెల్లూరు కనకమహల్
కాకినాడ వెంకటేశ్వర
హైదరాబాద్ బసంత్
నేడే రజతోత్సవము బసంత్‌లో

సంపాదకవర్గం: కాట్రగడ్డ రాజగోపాలరావు (అధ్యక్షుడు) ఏటుకూరు బలరామమూర్తి, తుమ్మల వెంకటరామయ్య. విశాలాంధ్ర విజ్ఞానసమితి తరపున ఎడిటర్, ప్రింటర్, అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు స్వతంత్ర అచ్చు ప్రింటర్స్, విజయవాడ-4.